# ఆ గాయకుడిపై నోట్ల వాన



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 16 మే 2026 | సంపుటి: 10 | సంచిక: 130 | పేజీలు:12 | వెల రూ.5

# పతనమైన రూపాయి మారకపు విలువ



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


# జూన్ 21న నీట్ రీ ఎగ్జామ్

**హాల్ టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్న ఎన్టీఏ**

**విద్యార్థులు మళ్లీ అప్లై చేయాల్సిన అవసరం లేదని స్పష్టీకరణ**

ఢిల్లీ, మే 15 : ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను జూన్ 21న, ఆదివారం నిర్వహించనున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీ ఎగ్జామ్ కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్టీఏ కోరింది. హాల్ టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది.

దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీని




(నీట్-యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా

...మిగతా 2లో

## వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నీట్

ప్రకటించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

2

# 26న కేరళకు నైరుతి రుతుపవనాలు

## వారం ముందే వానలు!

ఢిల్లీ, మే 15 : ఎండ దెబ్బకు అల్లాడిపోతున్న భారతీయులకు వాతావరణ విభాగం చల్లని కబురు చెప్పింది. దేశ వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థకు జీవనాడి అయిన నైరుతి రుతుపవనాలు మే 26న కేరళను తాకనున్నట్లు వెల్లడించింది. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు పలకరిస్తుంటాయి. కానీ, ఈసారి ఐదు రోజుల

...మిగతా 2లో





# పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

## లీటర్‌కు రూ. 3 పెంపు

ఢిల్లీ, మే 15 : దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్, డీజిళ్ల పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్

...మిగతా 2లో

## మోడీకి ఫైటర్ జెట్‌తో స్వాగతం పలికిన యూఏఈ

2

# పదేండ్లు నేనే సీఎం

**సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకతో చొరవ ఉంది**

**ఇప్పుడు ప్రజలు స్విగ్గీ పాలిటిక్స్ కోరుకుంటున్నారు**

**దేశంలో రేవంత్ రెడ్డికి డిమాండ్ ఉంది.. ఇది రాష్ట్ర ప్రజలకు గౌరవం**

**టీడీపీలో దశాబ్దం పాటు పని చేశా..**

**చంద్రబాబు ఇప్పటికీ నన్ను గౌరవిస్తరు**

**బండి సంజయ్ తన కొడుకును పోలీసులకు అప్పగించాలె**

**రాహుల్ నాయకత్వంలో పనిచేస్తా.. అవకాశాల కోసం పార్టీ మారను**

**వే టు న్యూస్ కాన్‌క్లేవ్‌లో సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, మే 15 (మనం బ్యూరో) : మరో పదేండ్లు నేనే ముఖ్యమంత్రి...ఆ తరువాత సీఎంగా ఉండను.. తరువాతి తరానికి అవకాశం ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 2034 వరకు ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారనీ, అప్పటి వరకు ఈ ప్రజల కోసమే పని చేస్తానని పేర్కొన్నారు. శుక్రవారం జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో వే టు న్యూస్ కాన్‌క్లేవ్ 2026లో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకతో చొరవ ఉందనీ, అయినా నా గీత నేను దాటనని స్పష్టం చేశారు. టీడీపీలో పదేండ్లు పని చేశాను, చంద్రబాబు నాయుడు ఇప్పటికీ నన్ను గౌరవిస్తారని చెప్పారు. పార్టీని వదిలిపెట్టిన తరువాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదనీ, తాను టీడీపీని వదిలి పెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తు చేశారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవాలని

...మిగతా 2లో




# సర్ ప్రక్రియను ఏడాది పాటు నిర్వహించాలి

**బీఎల్వో మూడు సార్లు ఇంటికి వెళ్లి వెరిఫికేషన్ చేయాలి**

**'సర్'పేరుతో 14 రాష్ట్రాల్లో ఓట్ల చోరీ జరిగింది**

**బయట దేశస్థుల పేరుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది**

**బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారు**

**పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్**

హైదరాబాద్, మే 15 (మనం బ్యూరో) : రాష్ట్రంలో వచ్చే రెండేండ్లు ఎన్నికలు లేవు కాబట్టి 'సర్' ప్రక్రియను ఏడాది పాటు నిర్వహించాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సెన్సస్ ప్రక్రియలో 'సర్' చేస్తే సజావుగా సాగదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 'సర్' నిర్వహణకు కేంద్రం షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం బీఆర్కే భవన్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డితో పీసీసీ చీఫ్ భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 14 రాష్ట్రాల్లో 'సర్' ప్రక్రియలో భాగంగా ఓట్ల చోరీ జరిగిందనీ, దానికి ఇటీవల జరిగిన బెంగాల్ ఎన్నికలే నిదర్శనమన్నారు. ఆ రాష్ట్రంలో 90 లక్షల ఓట్లు తొలగించి 60 లక్షలు యాడ్ చేశారనీ, దీంతో రాజకీయ సమీకరణాలు మారి అధికారంలోకి రావాల్సిన పార్టీలు ఓడిపోయాయన్నారు. బీద వాడి ఓటు తొలగిస్తే సరైన డాక్యుమెంట్ ఇవ్వలేడు కాబట్టి దానికి 3 నెలలు సమయం ఇవ్వాలనీ, మూడు సార్లు బీఎల్వో ఇంటికి వెళ్లి వెరిఫికేషన్ చేయాలని పేర్కొన్నారు. కొన్ని చోట్ల బయట దేశస్తుల పేరుతో ఓట్లు తొలగించే

...మిగతా 2లో



# ఆర్టీసీ విలీనంపై సమాలోచనలు

**జేఏసీ నేతలతో మంత్రి పొన్నం భేటీ**



హైదరాబాద్,మే15(మనం న్యూస్) : ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన ప్రభుత్వం వాటిని అమలు చేసే దిశగా కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా శుక్రవారం ఆర్టీసీ సంఘాల నేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం అయ్యారు. మినిస్టర్ క్వార్టర్స్ లో జరిగిన

...మిగతా 2లో

## కేసీఆర్‌పై మరోసారి కవిత ఫైర్



**మంచి ఉద్యమకారుడే కానీ..ప్రజా నాయకుడు కాదు**

**తన తండ్రి మరమనిషి అంటూ వ్యాఖ్యలు**

**ఆయనతో సమస్య లేదు..ఆయన తీరుపైనే అసంతృప్తి**

**ఎన్నికలు ఎప్పుడు జరిగినా టీఆర్ఎస్‌దే విజయం**

**టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**

2

# ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ

- చైర్మన్‌గా కేకే.. సభ్యులుగా పొన్నం, అద్దంకి, కోదండరాం
- త్వరగా నివేదిక ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్, మే 15 ( మనం బ్యూరో ) : సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి వారి సేవలు-త్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈమేరకు సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం జీవో ఆర్టీ నం.679 జారీ చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా ప్రభుత్వ సలహాదారు కేకే, సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ముందుగా స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేస్తుంది. అనంతరం వారికి ఎలాంటి గుర్తింపు, గౌరవం, సౌకర్యాలు కల్పించాలనే అంశంపై ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. కమిటీ అవసరమైతే అధికారులను పిలిపించుకోవచ్చు, సమాచారం సేకరించవచ్చు, సమావేశాలు నిర్వహించవచ్చు, అవసరమైన ఇతర వ్యక్తులు అధికారులను కూడా సంప్రదించవచ్చు. కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి వీలైనంత త్వరగా సమర్పించాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు కమిటీకి అవసరమైన సహకారం అందించాలని ఈమేరకు ప్రభుత్వం ఆదేశించింది.



## బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లపై సీఎస్ కీలక సమీక్ష!

**భూసేకరణ వేగవంతం చేయాలని అధికారులకు సీఎస్ అదేశం**

హైదరాబాద్,మే15(మనం న్యూస్) : తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టబోతున్న మూడు భారీ హైస్పీడ్ రైలు (బుల్లెట్ రైలు) కారిడార్ ప్రాజెక్టుల తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు

...మిగతా 2లో

## 'బండి' కేసులో సోషల్ మీడియాకు వార్నింగ్

బాధితుల ఫోటోలు షేర్ చేస్తే చర్యలు

సైబరాబాద్ పోలీసుల హెచ్చరికలు

3

## ఇక... ఎఫెక్టివ్ పోలీసింగ్

మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

డీజీపీ సీవి ఆనంద్ వెల్లడి

3

## 20న మెడికల్ షాపులు బంద్

ఆన్‌లైన్‌లో కార్పొరేట్ కంపెనీల డిస్కౌంట్లపై ఆందోళన

2

# అమెరికా క్షీణిస్తున్న దేశం



**అది పతన దిశగా పయనిస్తోందన్న జిన్‌పింగ్**

**అవును.. కానీ, అది జో బైడెన్ హయాంలో అని ట్రంప్ జవాబు**

బీజింగ్, మే 15 : అమెరికా పతనం అంచున ఉందని చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ పేర్కొన్నారు. ఈ అభిప్రాయంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఏకీభవించారు. అయితే, అది మాజీ అధ్యక్షుడు

...మిగతా 2లో

# రూ.1700 కోట్ల నకిలీ జీఎస్టీ స్కాం

**92 షెల్ కంపెనీలతో మోసాలు**

**సరకు రవాణా పేరిట నకిలీ ఇన్వాయిస్‌లు**

**కేసులో ప్రధాన సూత్రధారి అంజిరెడ్డి అరెస్ట్..**

హైదరాబాద్,మే 15(మనం,ప్రత్యేక ప్రతినిధి) : దాదాపు రూ.1700 కోట్ల నకిలీ ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ సిండికేట్ గుట్టు రట్టయ్యింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం డీజీజీఐ అధికారులు ఈ కేసులో ప్రధాన సూత్రధారి ధంట్ల ఆది రెడ్డి అలియాస్ అంజి రెడ్డిని అరెస్ట్ చేశారు. విచారణలో భాగంగా జీఎస్టీ ఫైలింగ్స్, బ్యాంక్ లావాదేవీలపై వచ్చిన సమాచారంతో అధికారులు డిజిటల్ ట్రాకింగ్, ఫీల్ వెరిఫికేషన్ చేయగా నిందితుడు ఇతరుల ఆధార్, పాన్ కార్డులను దుర్వినియోగం చేసినట్లు తేలింది. నకిలీ రెంటల్ అగ్రిమెంట్లతో ఏకంగా 92 నకిలీ కంపెనీలను సృష్టించినట్లు తేలింది. ఎలాంటి సరుకు రవాణా, సేవల సరఫరా లేకుండానే కేవలం నకిలీ ఇన్వాయిస్‌లతో ఈ సిండికేట్ రూ.264 కోట్ల నకిలీ ఐటీసీ పొందినట్లు డీజీజీఐ విచారణలో వెలుగుచూసింది. అదేవిధంగా నిందితులు రూ.260 కోట్ల ఐటీసీని ఇతరులకు

...మిగతా 2లో



# భోజ్‌శాల ఆలయం హిందువులదే!

**మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు**

ఇండోర్, మే 15 : మధ్యప్రదేశ్ లోని ధార్ జిల్లాలోని వివాదాస్పద భోజ్‌శాల/కమల్ మౌలా ఆలయ వివాదంలో అక్కడి హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ వివాదాస్పద స్థలం ఆలయానికే చెందుతుందని ఇండోర్ కోర్టు ద్విసభ్య ధర్మాసనం హిందూ పిటిషనర్లకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ ఆలయాన్ని పురావస్తుశాఖ అధీనంలోకి తీసుకోవాలని

...మిగతా 2లో

# పదేండ్లు నేనే సీఎం

(మొదటి పేజీ తరువాయి)
రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందనీ, కానీ, ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని చెప్పారు. ప్రజలు ఇప్పుడు స్విగ్గీ పాలిటిక్స్ కోరుకుంటున్నారనీ, వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధే ఉంటారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ముందు ప్రకటించి ఆ తరువాత కూటమి పార్టీలను ఒప్పిస్తామన్నారు. రాష్ట్రంలో రెండున్నరేళ్ల పాలనలో మహిళలపైన నేరాలను నియంత్రించామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో ఈనెల 8న రాత్రి మైనర్ బాలిక తల్లి పేట్ బషీరాబాద్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారనీ, 9న విచారణ ప్రారంభించి సెక్షన్లు కూడా మార్చి కేసు పెట్టామని గుర్తు చేశారు. భగీరథ కూడా కరీంనగర్‌లో ఫిర్యాదు చేశాడనీ, ఆ ఫిర్యాదును బేరీజు వేసుకుని అమ్మాయి స్టేట్‌మెంట్ తీసుకుని నోటీసులు ఇచ్చారని తెలిపారు. తొందరపడితే 1000 మంది పోలీసులను తీసుకుని ఇంటి మీద పడ్డారని అంతా విమర్శలు చేసే వారనీ, సినిమా వాళ్లు, రాజకీయ నాయకులు, ఎవరైనా నాకు మినహాయింపులు లేవని స్పష్టం చేశారు. నేను సహాయం చేయాలనుకుంటే పోక్సో కేసు పెట్టం కదా...ఆ కేసు పెట్టామంటేనే నా కమిట్మెంట్ ఏమిటో తెలుస్తుంది కదా...అని వ్యాఖ్యానించారు. హోం మంత్రిగానే కాకుండా సీఎంగా కూడా చర్యలు తీసుకోవడం తన బాధ్యత అనీ, బండి సంజయ్, బీఆర్ఎస్‌కు ఎక్కడ చెడిందో తనకు తెలియదన్నారు. ఒక్క రోజు ఆలస్యమైనా శిక్ష నుండి తప్పించుకోలేరనీ, నన్ను జైలులో పెట్టిన కేసీఆర్ కుటుంబం పట్ల నేను కఠినంగా వ్యవహరించానా అని ప్రశ్నించారు. కుమారుడి విషయంలో బండి సంజయ్ తీరు నైతికంగా తప్పనీ, కొడుకు తప్పిదం వల్ల ఆయనకు తలవంపులు వచ్చాయని పేర్కొన్నారు. బండి కొడుకును తీసుకొచ్చి పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలనీ, విచారణను ఎదుర్కోవాలి పారిపోవద్దని సూచించారు. నోటీసులకు స్పందించకపోతే పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ, సీఎంగా తాను అధికారిక కార్యక్రమంలోనే మాట్లాడామనీ, నిధుల కోసం మాతో కలసి రావాలని మోడీ అడిగారని వివరణ ఇచ్చారు. రాజకీయాల్లో నా కమిట్మెంట్ గురించి ప్రధాని మోడీకి తెలుసు, మైక్‌ల ముందే మాట్లాడుకున్నాం ఇందులో ఎలాంటి రహస్యం లేదని స్పష్టం చేశారు. దేశంలో రేవంత్ రెడ్డికి డిమాండ్ ఉంది. ఇది రాష్ట్ర ప్రజల గౌరవం, రాహుల్ గాంధీ నాయకత్వంలోనే పనిచేస్తా, నా మనసుకు నచ్చినట్లు చేస్తాననీ, నిబద్ధతతో పార్టీలో చేరాననే గాంధీ కుటుంబం నాకు అవకాశం ఇచ్చిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# జూన్ 21న నీట్ ఎగ్జామ్

(మొదటి పేజీ తరువాయి)
ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. రీఎగ్జామినేషన్కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్టీఏ స్పష్టం చేసింది.

**కొనసాగుతున్న సీబీఐ దర్యాప్తు..**
ఇదిలాఉండగా.. నీట్ పేపర్ లీ సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజసాన్ లోని సికార్లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది.

# వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నీట్

- ప్రకటించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**ఢిల్లీ, మే 15 :** నీట్ యూజీ 2026 జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాటాడుతూ.. వచ్చే ఏడాది నుంచి ఈ పరీక్షను ఆన్ లైన్ లో నిర్వహిస్తామని వెల్లడించారు. 'జూన్ 21న నీట్ రీఎగ్జామ్ తేదీ ఖరారైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. ఇప్పటికే ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వారు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నాం. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మా మొదటి లక్ష్యం. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే మా ప్రధాన కర్తవ్యం. ఏటా కోటి మందికి ఎన్టీఏ పరీక్షలు నిర్వహిస్తోంది. పేపర్ ఎలా లీక్ అయింది.. ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందన్న పూర్తి వివరాలు పూర్తి బహిర్గతమవుతాయి.

**రీ ఎగ్జామ్‌లో మాల్ ప్రాక్టీస్ జరగకుండా జాగ్రత్తలు..**
ఈసారి ఎలాంటి పరిస్థితుల్లోనూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూసుకుంటాం. రీటెస్ట్ కోసం విద్యార్థులు నచ్చిన నగరాన్ని ఎంచుకోవడానికి వారం రోజులు గడువు ఇస్తున్నాం. జూన్ 14న అడ్మిట్ కార్డులు విడుదల చేస్తాం. నీట్ కోసం మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న వార్తలు చూసి విద్యార్థులు ఆందోళన చెందొద్దు. పరీక్ష రద్దు కారణంగా కలిగిన అంతరాయాన్ని, ఒత్తిడిని దృష్టిలో పెట్టుకొని రీటెస్ట్ సమయంలో విద్యార్థులకు 15 నిమిషాల అదనపు సమయం ఇవ్వనున్నాం'' అని ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.

# 26న కేరళకు నైరుతి రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)
ముందే కేరళను తాకే అవకాశం ఉన్నట్లు ఐఎండీ శుక్రవారం వెల్లడించింది.

భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, ఈసారి ఎల్ నినో భయాలు ఉన్నాయి. తూర్పు, మధ్య పసిఫిక్ మహా సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పుల నేపథ్యంలో ఎల్ నినో ప్రారంభమైందని ఇప్పటికే ఇన్కాయిస్ ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్ వరకు తటస్థ పరిస్థితులు ఉండగా తాజాగా ఎల్ నినో గా మారిందని వెల్లడించింది. ఈ మే నుంచి 2027 జనవరి వరకు ఈ పరిస్థితులు కొనసాగుతాయని తెలిపింది. రుతుపవనాలు మొదటి దశలో అంటే జూన్ నుంచి జులై ప్రారంభంలో స్థిరమైన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ సంస్థలు అంచనా వేశాయి.

# భారీగా పతనమైన రూ. మారకపు విలువ

**ఢిల్లీ, మే 15 :** అమెరికా డాలర్ తో పోలిస్తే రూపాయి మారకపు విలువ భారీగా పతనం అయ్యింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా డాలర్ విలువ తొలిసారి రూ.96 మార్కును దాటింది. గురువారం ట్రేడింగ్ సెషన్లో 95.96 వద్ద కనిష్ఠాన్ని తాకిన రూపాయి విలువ.. శుక్రవారం మధ్యాహ్నం 96.07 కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల పెరుగుదల నేపథ్యంలో మన రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది.

రూపాయి విలువ పతనమైతే.. దిగుమతి చేసుకునే వంట నూనెలు, చమురు, సహజవాయువు, ఎలక్ట్రానిక్స్, బంగారం, లగ్జరీ కార్లు, గడియారాలు మరింత ఖరీదవుతాయి. నిత్యావసరాల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి, ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. విదేశీ ఉన్నతవిద్య కోసం తమ పిల్లల్ని పంపిన తల్లిదండ్రులపై భారం పెరుగుతుంది. అదే సమయంలో మన దేశం నుంచి వస్తువులు, సేవలు ఎగుమతి చేసేవారికి మాత్రం లాభం కలుగుతుంది.

# పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

(మొదటి పేజీ తరువాయి)
ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్ సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. సీఎన్జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్జీని రూ.2 చొప్పున పెంచాయి.

# మోడీకి ఫైటర్ జెట్‌తో స్వాగతం పలికిన యూఏఈ

**అబుధాబి, మే 15 :** ప్రధాని నరేంద్రమోడీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను యూఏఈ ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం శుక్రవారం మధ్యాహ్నం యూఏఈ గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ ఫైటర్ జెట్ ఎస్కార్ట్ గా వచ్చింది. తమ వాయుసేన కోసం ప్రత్యేకంగా రూపొందించిన యుద్ధ విమానం ఎఫ్-16 బ్లాక్ 60 'డెజర్ట్ ఫాల్కన్'ను పంపింది. అబుదాబిలో ప్రధాని విమానం ల్యాండ్ అయ్యేవరకు వెంటే వచ్చింది. ఐరోపా దేశాల పర్యటనకు బయల్దేరిన మోడీ మధ్యలో యూఏఈకి వెళ్లారు. కేవలం కొన్ని గంటలే అక్కడ ఉండనున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

**యూఏఈపై ఇరాన్ దాడి సరికాదు.. : మోడీ**
యూఏఈపై ఇరాన్ దాడిని ప్రధాని మోడీ ఖండించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచం మొత్తంమీద ఉందని చెప్పారు. హర్మూజ్ విషయంలో అంతా అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలన్నారు. యూఏఈ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోడీ సమక్షంలో భారత్ పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఎల్పీజీ సరఫరా, పెట్రోలియం నిల్వలపై ఎంవోయూ కుదుర్చుకుంది. అంతేకాకుండా వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం, నౌకల మరమ్మతు కేంద్రం ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించిన ఎంవోయూలపై భారత అధికారులు సంతకాలు చేశారు.

# రూ.1700 కోట్ల నకిలీ జీఎస్టీ స్కాం

(మొదటి పేజీ తరువాయి)
బదిలీ చేశారని, మొత్తం రూ.1700 కోట్ల విలువైన మోసపూరిత లావాదేవీలు జరిగాయని అధికారులు వివరించారు. ఇదే కేసులో మార్చి 25న సిద్ధగోని ప్రభాకర్, రామావత్ నాగరాజు నాయక్ అనే ఇద్దరు కీలక నిందితులను అధికారులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. అయితే ఈ కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు ఆది రెడ్డిని అరెస్ట్ చేసి సీజీఎస్‌టి చట్టం 2017 లోని పలు సెక్షన్ల కింద నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. ఇదిలావుండగా కేవలం కమీషన్‌ల ఆశతో తమ ఆధార్, పాన్, ఓటీపీ వంటి వ్యక్తిగత వివరాలను అపరిచితులకు ఇవ్వవద్దని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు. గుర్తింపు పత్రాల దుర్వినియోగం వల్ల చట్టపరమైన ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉందన్నారు.

# భోజ్‌శాల ఆలయం హిందువులదే!

(మొదటి పేజీ తరువాయి)
ఆదేశించింది. ఈ ఆలయంలో సరస్వతి విగ్రహం ఏర్పాటు చేసుకోవచ్చని కేంద్రానికి సూచించింది.

ఆ ప్రదేశంలో ఎన్నో ఏళ్ల పాటు దైవ ఆరాధన కొనసాగినట్లు భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) చేసిన సర్వేలో తేలిందని ధర్మాసనం పేర్కొంది. పర్మార్ వంశానికి చెందిన రాజా భోజ్ తో సంబంధం ఉన్న సంస్కృత విద్యాకేంద్రంగా ఇది ఉండేదని పలు చారిత్రక సాహిత్యాలు రుజువు చేస్తున్నాయని చెప్పింది. మసీదుకు ప్రత్యామ్నాయ స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని ధర్మాసనం ముస్లిం వర్గాలకు సూచించింది. ఇండోర్ ధర్మాసనం తీర్పు నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

భోజ్ శాల ఆలయ వివాదం దశాబ్దాలుగా కొనసాగుతోంది. మధ్యయుగం నాటి ఈ స్మారక కట్టడాన్ని హిందూవులు వాగ్దేవి (సరస్వతి) దేవాలయంగా భావిస్తారు. ముస్లింలు దాన్ని కమల్ మౌలా మసీదుగా వ్యవహరిస్తుంటారు. 2003 ఏఎస్ఐ ఒప్పందం ప్రకారం, హిందువులు మంగళవారాల్లో, ముస్లింలు శుక్రవారాల్లో ప్రార్థనలు కొనసాగిస్తున్నారు. అయితే, ఈ ప్రదేశంలో ఆరాధన కోసం ప్రత్యేక హక్కులు కోరుతూ హిందూ వర్గం ఈ ఒప్పందాన్ని హైకోర్టులో సవాలు చేసింది. ఆలయ స్థలం మసీదుకు చెందిందని ముస్లిం వర్గాలు వాదించాయి. దీంతో ఈ ప్రాంతంలో 2024లో 98 రోజుల పాటు పురావస్తు శాఖ సర్వే నిర్వహించి 2024 జులై 15న కోర్టుకు నివేదిక సమర్పించింది. దీనిపై ఇండోర్‌లోని మధ్యప్రదేశ్ హైకోర్టు బెంచ్ నేడు తీర్పుచెప్పింది.



# సర్ ప్రక్రియను ఏడాది పాటు నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)
ప్రమాదం ఉన్నందున సిటిజెన్‌షిప్ ప్రూఫ్ అడగకుండా నియమావళి చేయాలన్నారు. పాస్‌పోర్ట్ అనేది 14లో ఒకటి మాత్రమేననీ, సర్ పేరిట లౌకిక వాదాన్ని నమ్ముకున్న వారి ఓట్లు తొలగించే ప్రక్రియ జరుగుతోందని ఆరోపించారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారనీ, అందుకే వాళ్లకు వణుకుపుడుతోందని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు.

**ప్రజలపై పెట్రో ధరల భారం...**
పెట్రో ధరల పెంపుతో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరో భారం మోపిందని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ విమర్శించారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను మళ్లీ పెంచడం ద్వారా బీజేపీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలు, విద్యుత్ చార్జీలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ పెట్రో ధరల పెంపు ప్రజలపై మరింత భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గుతున్న సమయంలో కూడా దేశంలో పెట్రో ధరలను తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ మండిపడ్డారు.

# బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లపై సీఎస్ కీలక సమీక్ష!

(మొదటి పేజీ తరువాయి)
ఆదేశించారు. తెలంగాణను ఆర్థికంగా మరింత బలోపేతం చేసే లక్ష్యంతో హైదరాబాద్ కేంద్రంగా ముంబై, బెంగళూరు, చెన్నై భారీ హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగు చర్యలు తీసుకోవాలని సీఎస్ అధికారులకు సూచించారు.

**ఎకనామిక్ గ్రోత్ కారిడార్:**
హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సి.ఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హై స్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సి.ఎస్ వెల్లడించారు.

**డీపీఆర్ సిద్ధం:**
హైదరాబాద్ - పూనే - ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డీపీఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సూమారు 671 కి. మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి. మీటర్ల మేరకు భూసేకరణ అవసరం ఉంటుందని, అదేవిధంగా హైదరాబాద్ - బెంగళూరు కారిడార్, హైదరాబాద్ - చెన్నై కారిడార్ లో సూమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ, హెచ్.యం.డి.ఎ, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు కేంద్ర రైల్వే ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని హై స్పీడ్ రైలు ప్రాజెక్ట్ కు సహకరించాలని సీఎస్ అన్నారు.జ

ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై మరోసారి కవిత ఫైర్

**హైదరాబాద్,మే 16(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి ఫైర్ అయ్యారు. ఈక్రమంలో శుక్రవారం ఒక మీడియా సంస్థ నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న కవిత తన తండ్రి కేసీఆర్ ఒక 'మరమనిషి' (రోబో)గా అభివర్ణిస్తూ సంచలన విమర్శలు చేశారు. ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ ఎప్పుడూ గొప్ప వ్యక్తి అని, ఆ పాత్రలో ఆయనతో ఎవరికీ ఎటువంటి సమస్యలు లేవని, ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాతే ప్రజలకు పూర్తిగా దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

పరిపాలనా కాలంలో కేసీఆర్ కేవలం ఒక యంత్రంలా పనిచేశారని, అందువల్లే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదని కవిత విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన ఎంత కఠినంగా ఉండేవారంటే, కన్నబిడ్డగా తనకే తన సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం ఉండేది కాదని ఆమె పేర్కొన్నారు. సొంత కుటుంబ సభ్యులకే అందుబాటులో లేని వ్యక్తి, ఇక సామాన్య ప్రజల కష్టాలను ఎలా వింటారని ఆమె ప్రశ్నించారు. ఉద్యమ నాయకుడి నుండి ఒక యంత్రంలాంటి ముఖ్యమంత్రిగా కేసీఆర్ మారిన తీరే ప్రస్తుత రాజకీయ పరిణామాలకు కారణమని కవిత తేల్చిచెప్పారు. .

**చరిత్రలో చిరస్థాయిగా :**
రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన సరే తెలంగాణ రక్షణ సేనదే అధికారమని కవిత అన్నారు. తెలంగాణ ప్రజలకు మర్చిపోలేనంత మంచి చేశానని చరిత్రలో చిరస్థాయిగా తన పేరు ఉండాలన్నదే తన కోరికన్నారు. రాష్ట్రంలో గుణాత్మక మార్పు తెచ్చేందుకే తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేశామని, చుక్క రక్తం చిందించకుండా రాజ్యాంగం ద్వారా దేశంలో మార్పు తెస్తానని అంబేద్కర్ అన్న మాటలను గుర్తు చేశారు. తాను కూడా రాజకీయ పార్టీ ద్వారా మంచి మార్పు తేవాలని వచ్చానని, తనను ప్రజలు దీవిస్తారు, ఆశీర్వదిస్తారన్న నమ్మకం ఉందన్నారు. రాజకీయాల్లో కచ్చితంగా వ్యూహాలు ఉండాలని, తన తండ్రి కేసీఆర్ వద్ద ఆయా వ్యూహాలు నేర్చుకున్నానన్నారు. ఎన్టీఆర్, కేసీఆర్, ఇందిరాగాంధీ, సుష్మాస్వరాజ్, మార్గరెట్ థాచర్ తనకు ఇష్టమైన నాయకులని, అలాగే జ్యోతి రావు పూలే తనకు స్ఫూర్తినిచ్చిన నాయకులన్నారు. తాను కూడా వాళ్ల మాదిరిగా గొప్ప నాయకురాలిగా ఎదగాలని అనుకుంటున్నానని, తమిళనాడులో విజయ్ గెలిచినట్లు తెలంగాణలో ఎప్పడు ఎన్నికలు జరిగినా టీఆర్ఎస్ గెలుస్తుందన్నారు.

# 20న మెడికల్ షాపులు బంద్

**12.4 లక్షలకు పైగా మెడికల్ దుకాణాలు బంద్‌కు పిలుపు**

**ధరల నియంత్రణ విషయంలో నిబంధనలు పాటించడం లేదని ఆందోళన**

**బంద్ సమయంలో బలవంతపు మూసివేతలు, బెదిరింపులు, చట్టవిరుద్ధమైనవి అపాలి?**

హైదరాబాద్, మనం ప్రతినిధి : దేశవ్యాప్తంగా ఈ నెల 20న 12.4 లక్షలకు పైగా మెడికల్ షాపులు మూతపడనున్నాయి. ఆలిండియా అర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసీడీ) దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. కార్పొరేట్ కంపెనీల అండదండలతో నడుస్తున్న ఆన్‌లైన్ ఫార్మసీలు భారీ డిస్కౌంట్లు ఇస్తూ సంప్రదాయ మెడికల్ షాపులకు నష్టం కలిగిస్తున్నాయంటూ కెమిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న ఫార్మసీ కంపెనీలు ఈ పోటీని తట్టుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు చెబుతున్నారు. అనియంత్రిత ఆన్‌లైన్ అమ్మకాలు, ఈ-ఫార్మసీ డిస్కౌంట్‌కు వ్యతిరేకంగా ఏఐఓసీడీ బంద్ కు పిలుపునిచ్చింది. ఈ బంద్ కారణంగా సాధారణ మందుల కొనుగోలు ఒకరోజు పాటు తీవ్రంగా ప్రభావితం కానుంది. ఆసుపత్రులకు అనుగుణంగా ఉన్న ఎమర్జెన్సీ ఫార్మసీలు మాత్రం తెరిచి ఉండే అవకాశం ఉంది. 20న బంద్ నేపథ్యంలో అత్యవసర మందులను ముందుగానే కొనుగోలు చేయాలని ఏఐఓసీడీ సూచించింది. ఈ బంద్‌లో కెమిస్టులు,ఫార్మాస్యూటికల్ డిస్ట్రిబ్యూటర్లు పాల్గొననున్నారు. ఆన్‌లైన్ పార్మసీని నియంత్రించాలని ఏఐఓసీడీ డిమాండ్ చేస్తోంది. ఆన్‌లైన్‌లో కంపెనీలు తక్కువ ధరలకు మందులు విక్రయించడం వల్ల స్థానిక వ్యాపారులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్లు దుర్వినియోగం అవడమే కాకుండా, ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని పేర్కొంది. కార్పొరేట్ సెక్టార్లు ఇస్తున్న డిస్కౌంట్లను నియంత్రించాలని, ధరల నియంత్రణ విషయంలో నిబంధనలు పాటించకుండా నేషనల్ ప్రైస్ అథారిటీ ప్రకారం విక్రయాలు జరగాలని డిమాండ్ చేసింది.

కొవిడ్ సమయంలో పేషెంట్లకు మందులు డోర్ డెలివరి చేశారని, ఈ సౌకర్యాన్ని నిలిపివేయాలని కోరింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు వెళ్ళినప్పటికీ, సరైన చర్యలు తీసుకోలేదని ఏఐఓసీడీ పేర్కొంది. అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలిగించకుండా, బంద్లో శాంతియుతంగా, చట్టబద్ధంగా పాల్గొనాలని డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు అన్నారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, నిజమైన అత్యవసర పరిస్థితులలో మాత్రమే ఎమర్జెన్సీ మందులను సరఫరా చేయాలని అన్నారు. రోగులు, ప్రజలు, అధికారులు లేదా ఏజెన్సీలతో ఎటువంటి ఘర్షణకు దిగవద్దని కోరారు. అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని కోరారు. బంద్ సమయంలో బలవంతపు మూసివేతలు, బెదిరింపులు, చట్టవిరుద్ధ కార్యకలాపాలను నివారించాలని పోలీసు శాఖను కోరారు. అంబులెన్సులు, అత్యవసర మందుల సరఫరా వాహనాలు, ఆరోగ్య సిబ్బంది సులభంగా రాకపోకలు సాగించేలా చూడాలని కోరారు.

# చైనాలో పనిచేయని ట్రంప్ 'సెక్యూరిటీ..' కమాండ్

**బీజింగ్, మే 15 :** సాధారణంగా అమెరికా అధ్యక్షుడు ఏ దేశానికి వెళ్లినా ఆయన పర్యటించే ప్రాంతం మొత్తాన్ని అగ్రరాజ్య సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు తమ గుప్పిట్లో ఉంచుకుంటారు. ఆ చోట చీమ చిటుక్కుమనాలన్నా తమ అనుమతి ఉండాల్సిందే అన్న రీతిలో అమెరికా భద్రతా సిబ్బంది వ్యవహరిస్తారు. కానీ, చైనాలో మాత్రం వీరి కమాండింగ్ పని చేయలేదు. అమెరికాఅధ్యక్షుడు ట్రంప్ పర్యటన వేళ బీజింగ్ భద్రతా సిబ్బంది వీరికి షాకిచ్చారు. ఈ క్రమంలో ఇరుదేశాల భద్రతా సిబ్బంది, జర్నలిస్టుల మధ్య ఘర్షణలు చోటుచేసుకోవడం గమనార్హం. రెండు రోజుల పర్యటన నిమిత్తం బీజింగ్ వెళ్లిన ట్రంప్.. చైనా అధ్యక్షుడు షీ జిన్పింగ్‌తో గురువారం భేటీ అయ్యారు. అయితే, ఈ సమావేశ వేదిక వద్దకు చైనా మీడియా సిబ్బంది దూసుకొచ్చారు. వైట్ హౌస్ సిబ్బందిని నెట్టుకుంటూ ప్రాంగణం లోపలికి వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనలో అమెరికా సిబ్బందిలో ఒకరు కిందపడటంతో స్వల్ప గాయాలైనట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీనిపై అగ్రరాజ్య అధికారులు చైనా వద్ద తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్లు సమాచారం.

**టెంపుల్ ఆఫ్ హెవెన్‌ను సందర్శించిన దేశాధినేతలు..**
ఇక, బీజింగ్ లోని 'టెంపుల్ ఆఫ్ హెవెన్'ను ఇరు దేశాధినేతలు సందర్శించారు. ఆ సమయంలో యూఎస్ సీక్రెట్ సర్వీస్ కు చెందిన ఓ ఏజెంట్ వద్ద తుపాకీ ఉందన్న కారణంతో చైనీస్ అధికారులు టెంపుల్ లోపలికి అనుమతించలేదు. ఆయుధాన్ని తమకు ఇచ్చిన తర్వాతే లోపలికి వెళ్లాలని సూచించారు. ఇందుకు అమెరికా ప్రతినిధులు అంగీకరించకపోవడంతో ఇరువర్గాల మధ్య వాదనలు చోటుచేసుకున్నాయి. దాదాపు 30 నిమిషాల తర్వాత మరో సీక్రెట్ సర్వీస్ అధికారిని అనుమతించగా.. గన్ తో ఉన్న ఆ ఏజెంట్ వెలుపలే ఉండిపోయారు.

**జర్నలిస్టులను ఆపి..**
ఇక, టెంపుల్ నుంచి ట్రంప్, జిన్ పింగ్ వెళ్లిపోతుండగా.. ప్రెసిడెన్షియల్ మోటార్ కేడ్ లో కలవకుండా అమెరికా జర్నలిస్టులను చైనా అధికారులు అడ్డుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న అగ్రరాజ్య ప్రతినిధులు.. బీజింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం.

# ఆర్టీసీ విలీనంపై సమాలోచనలు

(మొదటి పేజీ తరువాయి)
ఈ సమావేశంలో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాల ఎన్నికలు, తదితర అంశాలపై చర్చించారు. కాగా ఆర్టీసీని విలీనం చేయడంతో పాటు తమ సమస్యలను పరిష్కారించాలనే డిమాండ్‌తో గత నెలలో ఆర్టీసీ జేఏసీ బంద్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మే 1వ తేదీన ఆర్టీసీ యూనియన్ నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో యూనియన్‌లకు ఎన్నికలు కావాలా? లేదా ప్రభుత్వంలో విలీనమా తేల్చుకోవాలంటూ సీఎం జేఏసీ నేతలకు ఆఫర్ ఇచ్చారు. ఆప్షన్ రూపంలో చెప్పాలని ఆదేశించగా అదే సమయంలో మారు ఆలోచన లేకుండా విలీనమే చేయాలని, యూనియన్లు కావాలనే డిమాండ్ను వదులుకుంటున్నామని ముక్తకంఠంతో నేతలు సమ్మతి తెలిపారు. అయితే రవాణాశాఖ మంత్రి దృష్టికి తెస్తే ఆ ప్రక్రియ మొదలవుతుందని అందరూ సమ్మతించిందే జరుగుతుందని సీఎం ఈ సమావేశంలో స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఇవాళ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ నేతల భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

## మా ఇల్లెందుకు కూల్చారు?

**నేపాల్ ప్రధానికి 11 ఏళ్ల చిన్నారి లేఖ**

**ఖాట్మండ్ ,మే 15 :** నేపాల్ రాజధాని నగరం ఖాట్మండ్‌లో ప్రభుత్వం చేపట్టిన ఆక్రమణల తొలగింపు చర్యలు తీవ్రమైన చర్చలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా 11 ఏళ్ల బాలిక రాధిక మహతో ప్రధాని బాలేంద్ర షాకు రాసిన లేఖ దేశవ్యాప్తంగా భావోద్వేగ స్పందనను రేకెత్తిస్తోంది. ''మా కుటుంబం మీ పార్టీకి ఓటు వేసింది. మీరు మా ఇల్లు కూల్చేశారు. ఇప్పుడు మేమెక్కడ ఉండాలి. ఎక్కడ చదవాలి?'' అంటూ ఆ చిన్నారి ప్రశ్నలు సంధించింది. ఇలా సుమారు 15 వేల మందికి పైగా పేదలు ఇళ్లను కోల్పోయినట్లు సమాచారం. దాదాపు నాలుగు వేల తాత్కాలిక నిర్మాణాలను బుల్డోజర్లతో కూల్చివేశారు. ఖాట్మండ్‌కు 75 కి.మీ.ల దూరాన ఉన్న బనేపా మున్సిపాలిటీ పరిధిలోని తాత్కాలిక శిబిరానికి వీరందరినీ తరలించారు. కొత్త ప్రాంతానికి వెళ్లడంతో మూడో తరగతిలో ఉన్న రాధిక చదువు ఆగిపోయింది. దీంతో ఆమె తన బాధను నేరుగా ప్రధానికి లేఖ రూపంలో తెలియజేసింది. ఈ లేఖను ఓ ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ ప్రచురించడంతో వైరల్ అయ్యింది. రాధికకు మద్దతుగా అనేకమంది స్పందిస్తున్నారు. నదీ తీర ప్రాంతాలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయని, వరద ముప్పు నివారణతోపాటు పట్టణ ప్రణాళిక కోసం ఈ చర్యలు తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. చివరకు ఈ వివాదం నేపాల్ సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లి.. సరైన పునరావాస ప్రణాళిక లేకుండా ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## ఆ గాయకుడిపై నోట్ల వాన

**జునాగఢ్, మే 15 :** ప్రముఖ గుజరాతీ జానపద గాయకుడు గోపాల్ సాధుపై అభిమానులు కరెన్సీ నోట్ల వర్షం కురిపించారు. ఒక భజన కార్యక్రమంలో ఆయన ఆలపించిన గానానికి పరవశించి పోయిన అభిమానులు కరెన్సీ నోట్లు వెదజల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. దీంతో ఆయన కరెన్సీ నోట్లలో మునిగిపోయారు. జునాగఢ్ లోని ఖంభాలియా గ్రామంలో గురువారం రాత్రి జరిగిన ప్రత్యేక భజన కార్యక్రమంలో భాగంగా గాయకుడు గోపాల్ సాధు హార్మోనియం వాయిస్తూ పాటలు పాడాడు. ఆయన గాత్రానికి ముగ్ధులైన ప్రజలు వేదిక పైకి వచ్చి డబ్బు సంచులు ఆయనపై కుమ్మరించారు. ఈ డబ్బును సామాజిక సేవ కోసం వినియోగించనున్నట్లు నిర్వహకులు వెల్లడించారు.

# అమెరికా క్షీణిస్తున్న దేశం

(మొదటి పేజీ తరువాయి)
జో బైడెన్ హయాంలో అంటూ విమర్శలు చేశారు. తన పరిపాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్లో ఆయన పోస్టు పెట్టారు.

అధ్యక్షుడు జిన్పింగ్ అమెరికాను క్షీణిస్తున్న దేశంగా అభివర్ణించారని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, నిద్రమత్తులో ఉండే జో బైడెన్ (ఒ్ఫా ఆజీఛ్ఛీ) పరిపాలనను ఉద్దేశించి ఆయన ఆ వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ విషయంలో చైనా అధ్యక్షుడితో తాను 100% ఏకీభవిస్తానని తెలిపారు. బహిరంగ సరిహద్దులు, అధిక పన్నులు, దారుణమైన వాణిజ్య ఒప్పందాలు, పెరిగిన నేరాలతో సహా అనేక కారణాలతో అమెరికా అపారంగా నష్టపోయిందంటూ బైడెన్ పరిపాలనను విమర్శించారు. తన 16 నెలల అద్భుతమైన పదవీకాలంలో దేశం అసాధారణమైన పురోగతి సాధించిందని ట్రంప్ వెల్లడించారు. రికార్డ్ స్థాయి స్టాక్మార్కెట్లు, కొత్త పెట్టుబడి నిబద్ధతలు, వెనెజువెలాలో సైనిక విజయం, సైనిక చర్యతో ఇరాన్ను నాశనం చేయడం (ఇది ఇంకా కొనసాగుతోంది) వంటివి ఎన్నో జరిగాయన్నారు. నిజానికి ఇంత తక్కువ సమయంలో ఇన్ని అద్భుతమైన విజయాలు సాధించినందుకు జిన్పింగ్ తనను అభినందించాలని వ్యాఖ్యానించారు.

ఈసందర్భంగా రెండేళ్ల క్రితం తమ దేశం నిజంగానే పతనం అంచున ఉందని ట్రంప్ తెలిపారు. కానీ, ఇప్పుడు అమెరికా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న దేశమని వెల్లడించారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఊరట

- తన కుమారుడి కేసులో తనపేరు ప్రస్తావించడంపై పిటిషన్
- కీలక ఆదేశాలు జారీ చేసిన సిటీ సివిల్ కోర్టు

**హైదరాబాద్,మే 15(మనం, ప్రత్యేక ప్రతినిధి):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో సాగుతున్న రాజకీయ ప్రచారానికి హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బ్రేక్ వేసింది. వివరాల్లోకి వెళితే.. తన కుమారుడి కేసులో తరచూ తనపేరును ప్రస్తావిస్తున్నారంటూ శుక్రవారం బండి సంజయ్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. తన కుమారుడిపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించిన వ్యవహారంలో భవిష్యత్తులో మీడియా, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో తన పేరు వాడకుండా నిలువరించాలని, అలాగే ఇప్పటివరకు తన పేరుతో సర్క్యులేట్ అయిన వీడియోలను తక్షణమే తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఆయన కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన కుమారుడిపై నమోదైన కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కాబట్టి ఈ వివాదంలో తన పేరును ఎక్కడా ఉపయోగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలని బండి సంజయ్ కోరారు.దీంతో స్పందించిన కోర్టు.. 'బండి భగీరథ్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ లక్ష్యంగా కొనసాగిస్తున్న దుష్ప్రచారాన్ని వెంటనే ఆపేయండి. ఇప్పటి వరకు బండి సంజయ్‌ను టార్గెట్ చేస్తూ ప్రసారం చేసిన వీడియో, పత్రికా క్లిప్పింగులను, డిజిటల్ కంటెంట్, వాల్ పోస్టర్లను తొలగించాలని ఆదేశాలిచ్చింది. ఈనెల 26లోపు ఆయా వీడియో క్లిప్పింగ్‌లను డిజిటల్, పత్రికా కథనాలను, పోస్టర్లను తొలగించకపోతే చర్యలు తప్పవని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై బండి సంజయ్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించింది.

# 18-23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలు

## బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి జూపల్లి

**హైదరాబాద్, మే 15(మనం బ్యూరో):** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 18-23 వరకు రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రత్యేక బ్రోచర్‌ను శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక రంగానికి ఉన్న అపార అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ వారోత్సవాలు దోహదం చేస్తాయన్నారు. రాష్ట్రంలోని చారిత్రక, వారసత్వ సంపద, సంస్కృతి, ఎకో టూరిజంను ప్రమోట్ చేయడంతో పాటు పర్యాటక రంగం ద్వారా లభించే ఉపాధి అవకాశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి చెప్పారు.




# ఐ..హేట్... ఫోర్ వైట్స్

## ఉప్పు, చక్కెర,రైస్,మైదాకు దూరం

## ఇదే... నా ఆరోగ్యం రహస్యం

## డీజీపీ సీవి ఆనంద్ వెల్లడి

**హైదరాబాద్,మే 15(మనం,ప్రత్యేక ప్రతినిధి):** తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తన ఫిట్నెస్ రహస్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈక్రమంలో శుక్రవారం ఒక మీడియా కాన్క్లేవ్‌లో తన ఆరోగ్య రహస్యాన్ని వెల్లడించారు. తాను గత 32 ఏళ్లుగా కేవలం 75 నుంచి 76 కిలోల స్థిరమైన బరువును కొనసాగిస్తున్నానని, ఈ క్రమశిక్షణ వెనుక కఠినమైన ఆహార నియమాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా చక్కెర, ఉప్పు, రైస్, మైదా వంటి నాలుగు పదార్థాలను తన ఆహారం నుండి పక్కన పెట్టడం వల్లే ఈ వయసులో కూడా ఇంత ఫిట్‌గా ఉండగలుగుతున్నానని ఆయన గుట్టు విప్పారు. పోలీసు శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరికీ ఫిట్నెస్ అనేది ప్రాథమిక అవసరమని, ఇది కేవలం విధులకు మాత్రమే కాకుండా వ్యక్తిగత ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని డీజీపీ అభిప్రాయపడ్డారు. సరైన ఆహార నియమాలను పాటించడం ద్వారా దీర్ఘకాలిక అనారోగ్యాల బారిన పడకుండా ఉండవచ్చని, తద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని ఆయన సూచించారు. నిరంతరం ఒత్తిడితో కూడిన విధుల్లో ఉండే పోలీసులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవరుచుకోవాలని డీజీపీ పిలుపునిచ్చారు.

# ప్రమాదంలో కోమా స్థితికి వెళ్లిన అక్టోపస్ కానిస్టేబుల్

## కానిస్టేబుల్ కుటుంబానికి రూ. 64 లక్షల బీమా చెక్కు అందజేత



**హైదరాబాద్,మే 15(మనం,ప్రత్యేక ప్రతినిధి):** విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమా స్థితిలో చికిత్స పొందుతున్న ఆక్టోపస్ కానిస్టేబుల్ జి. రజనీకాంత్ కుటుంబానికి ఎస్‌బీఐ పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద రూ. 64 లక్షల బీమా పరిహారం మంజూరైంది. ఈక్రమంలో బేగంపేటలోని ఆక్టోపస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో.. డిజి ,(ఆపరేషన్స్) డాక్టర్ అనిల్ కుమార్ చేతుల మీదుగా ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును కానిస్టేబుల్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అందజేశారు.వివరాల్లోకి వెళితే..టి.జి.ఎస్.పి 3వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ జి. రజనీకాంత్ 2025 నుండి ఆక్టోపస్‌లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. గతేడాది అక్టోబర్ 2వ తేదీన ఇబ్రహీంపట్నంలోని కమాండో ట్రైనింగ్ సెంటర్‌లో ఆపరేషనల్ విధులు ముగించుకుని వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అప్పటి నుంచి సదరు కానిస్టేబుల్ బంజారాహిల్స్‌లోని రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఫిజియోథెరపీ, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీ నుండి మంజూరైన రూ. 64 లక్షల చెక్కును డీజీ డాక్టర్ అనిల్ కుమార్ చేతుల మీదుగా రజనీకాంత్ తండ్రి కొమరయ్య, తల్లి నాగమణి, సోదరుడు నరేష్, సోదరి శిరీషలకు అందజేశారు.

# ప్రజలపై భారం వద్దు

## ధరల పెంపుపై భగ్గుమన్న బీఆర్ఎస్,సీపీఐ

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ ఎల్బీనగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నిరసన

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** పెట్రోల్, డీజిల్ ధరల పెంపునకు నిరసనగా ఎల్బీనగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. నిరంతరం అడ్డగోలుగా ధరను పెంచుతూ ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరుగుతున్న ఇంధన ధరల వల్ల సామాన్య ప్రజల జీవనం తీవ్రంగా దెబ్బతింటోందని, కేంద్ర ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. ఇలాంటి అన్యాయ ధరల పెంపులను అడ్డుకునేందుకు ప్రజలను చైతన్యవంతం చేస్తూ భవిష్యత్తులో కూడా ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ చైర్మన్లు, నియోజకవర్గ సీనియర్ నాయకులు, పలు డివిజన్ల అధ్యక్షులు, మహిళ అధ్యక్షులు, ఉద్యమకారులు, యువ నాయకులు, మహిళా నాయకులు, వివిధ విభాగాల అనుబంధ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

**పెట్రోల్, డీజిల్ ధరలు కేంద్రమే తగ్గించాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం వలన సామాన్య ప్రజలపై తీవ్రమైన భారం మోపుతున్నాయని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినా, దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం భారీ పన్నులతో ప్రజలను దోచుకుంటోందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్




ధరల పెరుగుదల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగి సామాన్యులు, రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రవాణా ఛార్జీలు పెరగడంతో అన్ని రంగాలపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని, ప్రజలపై భారాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.



# వైద్య విద్యార్థికి హెల్పింగ్'హ్యాండ్'

- పుస్తకాల కొనుగోలుకు ఆర్థిక సాయం

**హైదరాబాద్,మే 15(మనం,ప్రత్యేక ప్రతినిధి):** హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ సేవా దృక్పథంతో ఓ వైద్య విద్యార్థికి సాయం అందించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన జి. నవీన్ ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కాలేజీ, మంచిర్యాలలో నాల్గవ సంవత్సరం వైద్య విద్యను అభ్యసిస్తున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో అవసరమైన వైద్య విద్యా పుస్తకాలు కొనుగోలు చేయడానికి ఆర్థిక సహాయం చేయవలసిందిగా విద్యార్థి హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ను ఆశ్రయించాడు.విద్యార్థి పరిస్థితిని గుర్తించిన హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ చారిటీ అధ్యక్షులు గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్ ఆధ్వర్యంలో, సభ్యుల సమక్షంలో రూ.8వేల చెక్కును సంఘం కోశాధికారి బి. గుణవంత్ రావ్ (ప్రభుత్వ ఉప కార్యదర్శి, ఆర్థిక శాఖ) ప్రధాన కార్యదర్శి జె.ప్రేమ్ (దేవేందర్) చేతుల మీదుగా జి. నవీన్‌కు అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ చారిటీ సభ్యులు ఎం. రాధాకృష్ణ, సి.హెచ్. గంగ లక్ష్మి, ఎం. సూరజ్ బిన్ని, ఏ. తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు. ఇదే విద్యార్థికి ల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ మొదటి సంవత్సరంలో రూ.25వేలు, ద్వితీయ సంవత్సరంలో రూ.7వేలు, మూడవ సంవత్సరంలో రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు.

# 'బండి' కేసులో సోషల్ మీడియాకు వార్నింగ్

- బాధితుల ఫోటోలు షేర్ చేస్తే చర్యలు
- సైబరాబాద్ పోలీసుల హెచ్చరికలు

**హైదరాబాద్,మే 15(మనం,ప్రత్యేక ప్రతినిధి):** బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో మైనర్ బాధితుల, వారి కుటుంబాల వివరాలు, ఫోటోలు షేర్ చేయడం తీవ్ర నేరమని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని సైబరాబాద్ పోలీసులు హెచ్చరించారు. ఈక్రమంలో పోక్సో కేసులో బాలిక వివరాలు సోషల్ మీడియాలో ప్రసారం చేసిన వారికి పోలీసులు షాకిచ్చారు. సోషల్ మీడియాలో బాలిక ఫోటోలు, వీడియోలు, తల్లిదండ్రుల వివరాలు ప్రసారం చేసిన సోషల్ మీడియా నిర్వాహకులపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఫిర్యాదు మేరకు జువెనైల్ జస్టిస్ యాక్ట్ - సెక్షన్ 74 (మైనర్ల గుర్తింపును బహిర్గతం చేయడంపై నిషేధం), జువెనైల్ జస్టిస్ యాక్ట్ - సెక్షన్ 74 (మైనర్ల గుర్తింపును బహిర్గతం చేయడంపై నిషేధం) సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. బాలిక ఆమె కుటుంబ వివరాలు బహిర్గతం చేసేలా కంటెంట్ను ప్రసారం చేస్తున్న ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాల ఐడీలు, సంబంధిత్త ఖిఔల ద్వారా ఆయా ఖాతాలను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులకు పంపినట్లు పోలీసులు తెలిపారు.

**పోలీసుల వార్నింగ్ :**

పోక్సో కేసులలో బాధితులుగా ఉన్న మైనర్ పిల్లల, వారి కుటుంబ సభ్యుల వివరాలను, ఫోటోలను ఎలాంటి పరిస్థితుల్లోనూ బయటకు వెల్లడించకూడదని, అలా చేయడం అత్యంత తీవ్రమైన చట్టపరమైన నేరమని పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి చర్యల వల్ల బాధితులు, వారి కుటుంబాలు తీవ్రమైన మానసిక వేదనకు, అవమానానికి గురవుతారని తెలిపారు. ఈ క్రమంలోనే సైబరాబాద్ పోలీసులు ప్రజలకు, సోషల్ మీడియా వినియోగదారులకు కీలక విజ్ఞప్తి చేశారు. బాధితురాలి గుర్తింపునకు సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని, ఫోటోలను షేర్ చేయవద్దని, ఒకవేళ ఎవరైనా అలా చేస్తే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

# నిఘా పెంచండి... డ్రగ్స్ భరతం పట్టండి

## రాష్ట్రంలో నాటుసారాను నామరూపాల్లేకుండా చేయాలి

## ఎస్టీఎఫ్ టీంలతో ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతి సమీక్ష



**హైదరాబాద్, మే 15(మనం బ్యూరో):** డ్రగ్స్, గంజాయి, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాటు సారా తయారీ, రవాణాపై నిఘా పెంచాల్సిన అవసరం ఉందని ఎక్సైజ్, ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతి అన్నారు. శుక్రవారం డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు, ఎస్టీఎఫ్ టీంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ కంట్రోల్ అధికారులు, ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ టీంలు సంయుక్తంగా సింథటిక్ డ్రగ్స్ తయారీ ప్రాంతాలను గుర్తించి వాటిని నిలువరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్సైజ్ ఆదాయంపై ఎంతో ప్రభావం చూపిస్తున్న నాటు సారాను రాష్ట్రంలో నామరూపాలు లేకుండా చేయాల్సిన లక్ష్యంతో ఎక్సైజ్ శాఖ టీంలు ముందుకు సాగాలన్నారు. ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, గోవా ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్న ఎన్డీపీఎల్‌ను రాష్ట్రంలోకి రాకుండా దాడులు చేపట్టాలని సూచించారు. మిక్సింగ్ లిక్కర్ ముఠాలపై ప్రత్యేకంగా నిఘా పెంచి దాడులు నిర్వహించి వాటిని నిర్వీర్యం చేయాలనీ, ఈ బాధ్యత ఎస్టీఎఫ్ టీంలపైనే ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో ఎక్సైజ్, ఎన్ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషర్ అంజన్ రావు, డిప్యూటీ కమిషనర్ ప్రణవి, అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర బాబు, డీఎస్పీలు తులా శ్రీనివాసరావు, తిరుమతి యాదవ్, ఈఎస్‌లు, సీఐలు పాల్గొన్నారు.

**ఎక్సైజ్ ట్రైనీలకు ఆయుధ శిక్షణ**

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ట్రైనీలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించింది. గండిపేటలోని గ్రేహౌండ్స్ ఫైరింగ్ గ్రౌండ్స్‌లో ఏఈఎస్, ఎస్సైలకు శిక్షణను ప్రారంభించారు. ఇందులో భాగంగా పిస్తోల్ వినియోగంపై ఐదు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్సైజ్ అకాడమీలో శిక్షణలో మంచి నైపుణ్యం పెంపుదించుకోవడంలో భాగంగా ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ చేపట్టిన కీలక మార్పులలో భాగంగా ఈ ఆయుధ శిక్షణను ప్రారంభించారు. కాగా, ఈనెల 18 నుండి 24 వరకు ఇండోర్ ఔట్ డోర్ పరీక్షలు జరుగనుండగా, జూన్ 11తో ఈఎస్, ఎస్ఐలకు శిక్షణ ముగియనుంది.

# ఇక...ఎఫెక్టివ్ పోలీసింగ్




- మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం
- రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి
- ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు పెద్దపీట
- డీజీపీ సీవి ఆనంద్ వెల్లడి

**హైదరాబాద్,మే 15(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో ఎఫెక్టివ్ పోలీసింగ్ చేస్తామని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవి ఆనంద్ వెల్లడించారు. ఈక్రమంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ఫ్రెండ్లీ పోలీసింగ్ కూడా ఎఫెక్టివ్ పోలీసింగ్ లో భాగంగా ఉంటుందన్నారు. అదేవిధంగా,రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం ఒక పోరాటం తరహాలో ముందుకు సాగుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంప్రదాయ పోలీసు పద్ధతులను వీడి, సరికొత్త సవాళ్లయిన నార్కోటిక్స్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై శాఖను సమూలంగా సన్నద్ధం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.విద్యాసంస్థల్లో డ్రగ్స్ విస్తరిస్తుండటం అత్యంత ఆందోళనకరమని, దీని అడ్డుకట్టకు ప్రతి పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయంలో 'యాంటీ డ్రగ్ కమిటీలు' (సేఫ్టీ క్లబ్బు) ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేయనుందన్నారు. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి స్థాయిలో చర్చలు జరిగాయని, త్వరలోనే సరికొత్త జీవో తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. విద్యాసంస్థల చుట్టుపక్కల ఉండే పాన్ షాపులపై ఇప్పటికే నిరంతర నిఘా ఉంచి తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మహమ్మారిపై రాష్ట్రంలోని కమిషనర్లు, ఎస్పీలు అందరూ గట్టిగా పోరాడాలన్నారు.16 గంటలకు పైగా శ్రమిస్తున్న పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడటం తన బాధ్యతని డిజిపి అన్నారు. గతంలో తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు 'హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్' ఎన్జీఓ సహకారంతో 20 వేల మంది సిబ్బందికి హెల్త్ ప్రొఫైలింగ్ చేయించి 'ఫిట్ కాప్' ప్రోగ్రాం ప్రారంభించానని గుర్తు చేశారు. ఇప్పుడు అదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా విధుల్లో ఉన్న 75,000 మంది సిబ్బందికి ఒక ప్రత్యేక యాప్, సాంకేతికత ద్వారా ఆరోగ్యాన్ని మానిటర్ చేయబోతున్నట్లు వెల్లడించారు.

**రోడ్డు భద్రతపై :**


రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల కారణంగా ఏటా 7,500 మంది, దేశవ్యాప్తంగా 1.75 లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండటం పట్ల డిజిపి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు, రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన ట్రాఫిక్ విధానాలను (స్టాండర్డైజ్ ప్రాక్టీసెస్) అమలు చేయడానికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు త్వరలోనే 'ట్రాఫిక్ మేనేజ్మెంట్ అండ్ రోడ్డు సేఫ్టీ బ్యూరో'ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఇందులో ఆర్అండ్‌బీ, రవాణా శాఖల ఇంజనీర్లు, నిపుణులు ఉంటారని, ప్రమాదాలు జరిగే హాట్‌స్పాట్‌లను గుర్తించి మార్పులు చేస్తామని చెప్పారు. సీట్ బెల్ట్ ధరించడం కేవలం ముందు సీటు వారికే కాకుండా వెనుక సీటు వారికి కూడా తప్పనిసరి అని, ప్రమాదాల్లో ఎక్కువ శాతం వెనుక కూర్చున్న వారే చనిపోతున్నారని స్పష్టం చేశారు.

**పోలీసు పరువు :**

పోలీసు శాఖలోకి వచ్చే యువతపై డీజీపీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు సేవ చేయాలనే నిబద్ధత, కడుపులోంచి వచ్చే తపన ఉంటేనే పోలీసు శాఖలోకి రావాలని పిలుపునిచ్చారు. కేవలం అధికారం చలాయించడానికో, డబ్బు సంపాదించడానికో వస్తే మాత్రం ఏదో ఒక రోజు ఏసీబీ ట్రాప్ దొరికిపోవడం, సస్పెండ్ కావడం ఖాయమన్నారు. అలాంటి ఆలోచన ఉన్నవారు పాన్ షాప్ పెట్టుకుంటే దీనికంటే ఎక్కువ సంపాదించుకోవచ్చని, దయచేసి డిపార్ట్‌మెంట్‌కు వచ్చి ప్రభుత్వానికి, శాఖకు చెడ్డపేరు తేవద్దని హితవు పలికారు. ప్రస్తుతం కానిస్టేబుల్ ఉద్యోగాలకు కూడా పీహెచ్‌డీ, పీజీలు, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు వస్తున్నారని, ప్రత్యామ్నాయాలు ఉన్నా ఇక్కడికి వస్తున్నప్పుడు వృత్తి పట్ల నిబద్ధత అవసరమన్నారు.గత రెండు మూడు ఏళ్లుగా సిబ్బందిలో ఆత్మస్థైర్యం తగ్గినట్లు గమనించానని, లండన్, యూఎస్ విధానాలను ఇక్కడ రుద్దడం సరికాదని డిజిపి అభిప్రాయపడ్డారు. సమాజం ఎప్పుడూ 'స్ట్రాంగ్ అండ్ ఎఫెక్టివ్ పోలీసింగ్'ను కోరుకుంటుందని, 5 శాతం ఉన్న రౌడీషీటర్లు, క్రిమినల్స్, సంఘ వ్యతిరేక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తేనే మిగతా 95 శాతం ప్రజలకు ప్రశాంతత లభిస్తుందని స్పష్టం చేశారు. చట్ట ప్రకారం విధులు నిర్వర్తించే ప్రతి కానిస్టేబుల్, హోమ్ గార్డులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గతంలో పెద్ద పెద్ద వీఐపీలు ఫోన్లు చేసినా భయపడకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేసిన సిబ్బందిని తాను కాపాడుకున్నానని, ఒక్కరిని కూడా సస్పెండ్ కానివ్వలేదని డీజీపీ గుర్తుచేశారు.

# సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

## డా. బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్



**హైదరాబాద్,మే 15(మనం,ప్రత్యేక ప్రతినిధి):** సచివాలయ ఉద్యోగులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు కీలక అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డా. బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ అధ్యక్షులు గిరి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. సచివాలయంలో పెరుగుతున్న పనిభారం దృష్ట్యా కొత్త పోస్టుల సృష్టి, కోర్టు కేసుల కారణంగా పెండింగ్‌లో ఉన్న డిపార్ట్మెంటల్ ప్రమోషన్ కమిటీలు నిర్వహించాలన్నారు. సచివాలయంలో ఉద్యోగులకు సరిపడా స్థల కేటాయింపు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల పరిశీలన పరిమితిని రూ.2 లక్షలకు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలలో హెల్త్ కార్డుల తక్షణమే జారీ చేయాలని, పెండింగ్ బిల్లుల క్లియరెన్స్, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ సెలవులను 730 రోజుల వరకు పెంచాలన్నారు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం మానవీయ దృక్పథంతో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయ సంఘం జనరల్ సెక్రటరీ జె. ప్రేమ్ (దేవేందర్) పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలో ప్రపంచస్థాయి వైద్యం

- తెలంగాణ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించినం
- ముందు చూపు భారీ హంగులతో టిమ్స్ ఏర్పాటు చేసినం: కేటీఆర్
- ఎర్రగడ్డలో టిమ్స్ ఆస్పత్రి పనులను పరిశీలించిన కేటీఆర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఈ గడ్డపై పుట్టిన తెలంగాణ ప్రజలు ప్రతి ఒక్కరికి ప్రపంచ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో.. నాడు బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ టిమ్స్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. గతంలో గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ ఆసుపత్రులే ప్రధాన ఆధారమైతే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యాధునిక టిమ్స్ హాస్పిటల్స్ అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎర్రగడ్డలో టిమ్స్ ఆస్పత్రి పనులను శుక్రవారం కేటీఆర్ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందించేలా టిమ్స్‌కు రూపకల్పన చేసినట్లు ఆయన తెలిపారు. సనత్ నగర్ టిమ్స్ కోసం 22 ఎకరాల విస్తీర్ణాన్ని వినియోగించామని పేర్కొన్నారు. అత్యాధునిక టెక్నాలజీ, ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం టిమ్స్‌ను తీసుకువచ్చిందన్నారు. కేవలం ఒక్క హైదరాబాద్‌లోనే సనత్ నగర్, ఎల్బీనగర్, అల్వాల్ ప్రాంతాల్లో టిమ్స్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తంగా సనత్‌నగర్ టిమ్స్‌లో మూడు బ్లాకులు నిర్మించామన్నారు. 300 ఐసీయూ బెడ్స్‌తో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

## నవరసాల నవచైతన్యం

వెన్నెల వీణలు మీటగా
విరహమే వసంతమౌతుంది,
చూపుల చినుకులు జారగా
శృంగారం జయగీతమౌతుంది
చిరునవ్వు చిందినంతనే చీకటి చెదిరిపోతుంది
ముచ్చట్ల మధురిమలో
హాస్యం హరివిల్లౌతుంది
కన్నీటి తడి పలుకుల్లో
కరుణ కల్పవల్లౌతుంది,
పరబాధ పంచిన హృదయం
మానవత్వ దీపమౌతుంది
అన్యాయ చీకట్ల మధ్య
అగ్నిశిఖలా కోపం లేస్తుంది,
ధర్మరక్షణ దిక్సూచిగా
రౌద్రం రణభేరియౌతుంది
పర్వతమై కష్టం వచ్చినా
పడిపోని ధైర్యమే వీరత్వమౌతుంది,
పరాజయ బూడిదలోనూ
పరాక్రమ జ్యోతి వెలుగౌతుంది
చీకటి గాలి చప్పుడు కూడా
చిత్తాన్ని కంపింపజేస్తుంది,
జాగ్రత్త నేర్పే గురువై
భయానకం దీపమౌతుంది
కపటపు కలుషం చూసి
మనసు కలవరపడుతుంది,
మలినాలను దహింపజేసే
బీభత్సం బోధనౌతుంది
అణువులో విశ్వం చూసే
ఆశ్చర్యమే అద్భుతమౌతుంది,
పసినవ్వు పరిమళంలో
ఆనందదీపం వెలుగౌతుంది
అలజడి అలలు ఆగగా
ఆత్మసరోవరం నిర్మలమౌతుంది,
నిశ్శబ్ద నాదాల మధ్య
శాంతం శశిధారౌతుంది
నవరసాల నవనీతంతో
నరజీవితం నాట్యమాడుతుంది,
సుఖదుఃఖ రాగాల నడుమ
నవోన్మేషం జీవనకావ్యమౌతుంది

**- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**

# సింగపూర్ విద్యావిధానం స్ఫూర్తిదాయకం



తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రాబోతున్నాయా అంటే అవుననే అంటున్నారు విద్యావేత్తలు,నిపుణులు. ఇప్పటికే కేంద్రం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానాన్ని అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కూడా నూతన విద్యా విధానం అమలు కాబోతోందా? అసలు విద్యా విధానం ఎలా ఉండ బోతోంది అనేది మేథావి వర్గంగా పిలవబడే ఉపాధ్యాయుల్లో చర్చనీయాంశం అయ్యింది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఇతర దేశాల్లో అమలవుతున్న విద్యా విధానాలను పరిశీలించాలని నిపుణులైన ఉపాధ్యాయులు, అధికారుల బృందాన్ని ఇటీవలే ఫిన్లాండ్ దేశానికి పంపింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ కూడా ఉపాధ్యాయుల బృందాన్ని సింగపూర్‌కు పంపినది. ఇతర దేశాల్లో అమలవుతున్న ఉపయోగ కరమైన విద్యా విధానాలను మన రాష్ట్రంలో ప్రవేశ పెట్టాలనదే విద్యాశాఖ మంత్రి, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సంకల్పంగా కనబడుతున్నది. రాబోయే రోజుల్లో మరి కొంత మంది ఉపాధ్యాయ బృందాన్ని జపాన్ వియత్నం పంపే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నది. నేపథ్యంలో సింగపూర్ అమలవుతున్న విద్యా విధానాన్ని గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఉపాధ్యాయుడికి ఉన్నది.

శిక్షణ,ఒత్తిడి లేని తరగతులు, క్రిటికల్ థింకింగ్,డిజిటల్ అక్షరాస్యత సింగపూర్ పాఠశాల విద్యావ్యవస్థ బలాలు.ఆ దేశంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బడుల్లోనే చదవాలి. ప్రైవేటు స్కూళ్లలో చేరి చదువుకోవాలనుకుంటే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. మాతృభాషను ఒక సబ్జెక్టుగా బోధిస్తారు. సింగపూర్లో మూడు సంవత్సరాల వయస్సు నుండి ప్రీ-స్కూల్ విద్యను, సుమారు ఏడు సంవత్సరాల వయస్సు నుండి ప్రాథమిక విద్యను అందిస్తారు.ప్రాథమిక పాఠశాల తర్వాత, పిల్లలు సెకండరీ పాఠశాలకు వెళ్తారు,ఇది సుమారు 12 నుండి 16 లేదా 17సంవత్సరాల వయస్సు గల విద్యార్థుల కోసం ఉంటుంది. విశ్వవిద్యాలయానికి వెళ్లాలంటే, టీనేజర్లు రెండు లేదా మూడు సంవత్సరాల ప్రిపరేషన్ కోర్సుకు హాజరు కావాలి. ఇది ఐచ్ఛికం, మరియు ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

సింగపూర్‌లో ఆరేళ్ల వయస్సు నుండి ప్రాథమిక పాఠశాలకు హాజరు కావడం తప్పనిసరి. ఈ పాఠశాల విద్య ఉచితంగా



అందించబడుతుంది మరియు దీనిని పాటించని తల్లిదండ్రులకు జరిమానాలు ఉంటాయి. మీరు మీ బిడ్డకు ఇంట్లోనే విద్యను అందించాలనుకుంటే, లేదా విద్యా మంత్రిత్వ శాఖచే నిర్వహించబడని మతసంస్థలో వారిని చేర్పించాలనుకుంటే, అందుకు మీరు అధికారుల నుండి అనుమతి కోసం దరఖాస్తు చేసు కోవాలి.

సింగపూర్‌లో సైన్యం, వైద్యం తర్వాత ఉపాధ్యాయ వృత్తికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. నియామక ప్రక్రియ ఎంతో పకడ్బందీగా ఉంటుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా టీచర్లకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తారు. ఫలితంగా బోధనలో నాణ్యత పెరిగింది. పనితీరు ఆధారంగా ఉపాధ్యాయులకు గ్రేడింగ్ ఇస్తారు. పదోన్నతులకు ఆ గ్రేడింగే ప్రామాణికం. పదోన్నతి పొందాక ఆరు నెలలు శిక్షణ తప్పనిసరి. ప్రతి ఉపాధ్యా యుడూ ఏడాదికి వంద గంటలు తప్పనిసరిగా శిక్షణ పొందాల్సిందే.

ఉపాధ్యాయులు కేవలం ఫెసిలిటేటర్లుగానే ఉంటారు. విద్యార్థులకు తెలిసిన విషయాల ద్వారా వారిని సబ్జెక్టులోకి తీసుకువెళ్లే విధానంలో బోధన సాగుతోంది. ప్రాథమిక పాఠశాల ఆరవ తరగతి వరకు ఉంటుంది. దీనిని నాలుగు సంవత్సరాల పునాది కాలంగా, మరియు పిల్లలను మాధ్యమిక విద్యకు సిద్ధం చేయడానికి రెండు సంవత్సరాల 'పరిచయ కాలం'గా విభజించారు. ప్రాథమిక సంవత్సరాల ముఖ్య ఉద్దేశ్యం ఆంగ్ల భాష, స్థానిక మాతృభాష మరియు గణితంపై పట్టు సాధించడం. విద్యార్థులు ఈ ప్రధాన రంగాలకు మించి, తమ బలానికి తగిన సబ్జెక్టులను ఎంచుకోవచ్చు.

మాధ్యమిక విద్య యొక్క తప్పనిసరి దశ నాలుగు లేదా ఐదు సంవత్సరాల పాటు కొనసాగుతుంది.ఈ కాలం ముగింపులో, విద్యార్థులందరూ ఒక పరీక్ష రాస్తారు. అందులో మంచి స్కోరు సాధిస్తే ప్రీ-యూనివర్సిటీ విద్యను కొనసాగించడానికి ఎంచుకోవచ్చు. ప్రీ-యూనివర్సిటీ విద్య అనేది రెండు లేదా మూడు సంవత్సరాల కోర్సును కలిగి ఉంటుంది, ఇది విశ్వవిద్యాలయానికి హాజరు కావాలనుకునే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడింది. ఉత్తమ సంస్థలలో, ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించబడతాయి మరియు పోటీ చాలా తీవ్రంగా ఉంటుంది. మరిన్ని వృత్తి నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో, సాంకేతిక సంస్థ లేదా పాలిటెక్నిక్లో 'పోస్ట్-సెకండరీ' విద్యను కొనసాగించడం దీనికి ప్రత్యామ్నాయం. విద్యార్థులు ఎంచుకోగల అనేక రకాల విద్యాసంస్థలు ఉన్నాయి.

సింగపూర్ ప్రభుత్వ విద్యా వ్యవస్థలో విద్యా సంవత్సరం సెమిస్టర్లుగా విభజించబడింది. మొదటి సెమిస్టర్ సాధారణంగా జనవరి నుండి మే వరకు కొనసాగుతుంది, ఆ తర్వాత సెలవులు ఉంటాయి. అనంతరం జూలై నుండి రెండవ సెమిస్టర్ ప్రారంభమై, నవంబర్ మరియు డిసెంబర్లలో విరామంతో ముగుస్తుంది. ప్రతి సెమిస్టర్ మధ్యలో ఒక చిన్న విరామం కూడా ఉంటుంది.

డిజిటల్ లిటరసీలో సింగపూర్ ముందంజలో ఉంది. పిల్లలకు పరీక్షలు తగ్గించి, ఒత్తిడి లేకుండా చేశారు.టర్మ్‌లు పూర్తయ్యాక 10 రోజుల చొప్పున సెలవులు ఉంటాయి. టర్మ్ ఏ పాఠం ఎప్పుడైనా చెప్పొచ్చు. పూర్వ ప్రాథమిక విద్యలో నాణ్యమైన బోధనకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. పసితనంలోనే పిల్లలకు బలమైన పునాది వేస్తే ప్రాథమిక తరగతుల్లో ఇబ్బందులు ఉండవని భావిస్తారు.పిల్లలకు మార్కులు ఉండవు. గ్రేడ్లు ఇస్తారు. వెనుకబడిన విద్యార్థులను వదిలేయరు. ఏ సబ్జెక్టులో వెనుకబడ్డారో దానిపై ప్రత్యేక దృష్టిపెడతారు. ప్రతి ఒక్కరి వద్ద ల్యాప్‌టాప్ ఉంటుంది. పిల్లలే పీపీటీలు చేసి, తరగతిలో ప్రజంటేషన్ ఇస్తారు. డిజిటల్ లెర్నింగ్ కు ప్రాధాన్యం ఎక్కువ. ఇంటి దగ్గరా అభ్యసన కొనసాగుతుంది. 6-12 ఏళ్ల మధ్య ప్రాథమిక విద్య ఉంటుంది. తర్వాత పరీక్ష నిర్వహించి, గ్రేడ్ల ఆధారంగా సెకండరీ విద్యకు పంపిస్తారు.

సింగపూర్‌లో రూపొందించబడే అకడమిక్ క్యాలెండర్ కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తిస్తుందని గమనించాలి - ప్రైవేట్ మరియు అంతర్జాతీయ పాఠశాలల్లో, సుదీర్ఘ వేసవి సెలవులు మరియు క్రిస్మస్ సమయంలో అనేక వారాల సెలవులతో కూడిన పాశ్చాత్య ప్రామాణిక క్యాలెండర్‌ను అనుసరించే అవకాశం చాలా ఎక్కువగా ఉంది.

**- సుధాకర్.ఏ.వి**
9000674747

# నైతిక నాయకత్వం లేకపోతే?



చరిత్ర నిశ్శబ్దంగా ఒక భయానక సత్యాన్ని పలుకు తుంది. వ్యవస్థల పనితీరులో వచ్చే మార్పుల వెనుక నాయకత్వ స్థాయిలోని 'నిర్ణయాధికార కేంద్రీకరణ' ఒక ప్రాథమిక కారణం కావచ్చని పలువురు భావిస్తుం టారు. అధికారం బాధ్యత కంటే వ్యక్తిగత ప్రతిష్ఠకు ప్రాధాన్యతనిచ్చినప్పుడు, అది వ్యవస్థాగత సమతుల్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

రాజ్యాంగాలు చట్టబద్ధమైన చట్టాన్ని అందిస్తే, వాటి అమలు స్వతంత్ర సంస్థల స్వయం ప్రతిపత్తిపై ఆధారపడి ఉంటుంది. నాయకత్వ వైఖరి వ్యవస్థాగత పరిమితులను దాటినప్పుడు, అది ప్రజాస్వామ్య పునాదులపై చూపే ప్రభావంపై అంతర్జాతీయ వేదికలపై నిరంతరం చర్చ సాగుతూనే ఉంటుంది.

ప్రపంచ చరిత్రలో అపరిమిత అధికార కేంద్రీకరణ, అది వ్యవస్థలపై చూపే ప్రభావం ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తాయో గత శతాబ్దపు కొన్ని రాజకీయ పరిణామాలు ఉదాహరణలుగా నిలుస్తాయి. నేడు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో సాగుతున్న సంఘటనలు కూడా ఇటువంటి ఆందోళనలను రేకెత్తిస్తున్నట్లు అంతర్జాతీయ సమాజం గమనిస్తోంది. పశ్చిమాసియా వంటి ఘర్షణ ప్రాంతాల్లో గణనీయమైన సంఖ్యలో ప్రాణ నష్టం నమోదైనట్లు నివేదికలు సూచిస్తున్నాయి.

క్షేత్రస్థాయి పరిస్థితుల దృష్ట్యా ఈ గణాంకాలను స్వతంత్రంగా ధృవీకరించడం ప్రస్తుతం సవాలుగా మారింది. మృతుల్లో ఎక్కువ శాతం సామాన్య పౌరులే ఉన్నారనే అంశంపై ప్రపంచ వ్యాప్త చర్చ సాగుతోంది.

మరోవైపు, సంబంధిత దేశాలు ఈ చర్యలను తమ భద్రతా అవసరాలకు అనుగుణంగా జరిగిన ప్రతిస్పందనలుగా పేర్కొం టున్నాయి. భిన్నమైన వాదనల మధ్య మానవతా దృక్పథం, అంతర్జాతీయ ప్రమాణాల అమలుపై మేధావుల మధ్య లోతైన విశ్లేషణ జరుగుతోంది. అమెరికా వంటి దేశాల్లో గతంలో చోటుచేసుకున్న కొన్ని రాజకీయ సంఘటనలు కూడా ప్రజాస్వామ్య సంస్థలపై నాయకత్వ వైఖరి చూపే ప్రభావాన్ని సూచిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతుంటారు. అటు ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో అంతర్జాతీయ నిబంధనలు, దేశాల మధ్య భద్రతా ఆందోళనలకు సంబంధించిన భిన్నమైన దృక్కోణాలు నిరంతరం తెరపైకి వస్తున్నాయి.

నిర్ణయాధికారాల్లో ఉండే దృఢమైన వైఖరి, విస్తరణ కాంక్ష ప్రపంచ శాంతిపై ప్రభావం చూపుతున్నట్లు నేటి పరిణామాలు ప్రతిబింబిస్తున్నాయి. గతంలో సంభవించిన యుద్ధాలు మిగిల్చిన శరణార్థి సంక్షోభం, వివిధ దేశాల్లో కనిపిస్తున్న రాజకీయ అస్థిరత అంతర్జాతీయంగా ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న ఆర్థిక-సైనిక విస్తరణ విధానాలు, శక్తి సమీకరణాల్లో వస్తున్న మార్పులు భవిష్యత్తుపై అప్రమత్తతను పెంచుతున్నాయి. మేధస్సు, నిర్ణయాధికారాలు సామాజిక ప్రయోజనాలకు విరుద్ధమైన దిశలో పయనించినప్పుడు కలిగే నష్టంపై చారిత్రక విశ్లేషణలు ఉన్నాయి. ఉన్నత విద్యావంతులైన కొందరు వ్యక్తుల వైఖరి, నిర్దిష్ట సిద్ధాంతాలు ప్రపంచ శాంతికి సవాలుగా మారిన ఉదాహరణలు చరిత్రలో అనేకం ఉన్నాయి. వ్యక్తిగత ప్రతిష్ఠ, భావజాలం వ్యవస్థల కంటే గొప్పదని భావించినప్పుడు సంభవించే మానవతా సంక్షోభాలు నాయకత్వ బాధ్యతపై నిరంతరం చర్చను లేవనెత్తుతున్నాయి. ముఖ్యంగా సంక్షోభ సమయాల్లో నాయకులు వ్యవహరించిన తీరుపై అంతర్జాతీయంగా వెలువడే అభిప్రాయాలు, నైతిక నాయకత్వ ప్రాధాన్యతను గుర్తుచేస్తున్నాయి.

భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో గతంలో చోటు చేసుకున్న కొన్ని పరిణామాలు, రాజ్యాంగ హక్కుల పరిమితిపై ఒక గంభీరమైన పాఠంగా మిగిలిపోయాయి.

ప్రస్తుత ఆర్థిక గణాంకాలను పరిశీలిస్తే ఆందోళనకరమైన మార్పులు కనిపిస్తున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ గణాంకాలతో కూడిన వివిధ నివేదికల ప్రకారం.. 2019 నుండి 2024 మధ్య కాలంలో భారతీయ కుటుంబాల అప్పుల నిష్పత్తిలో గణనీయమైన పెరుగుదల ఉన్నట్లు సమాచారం. అలాగే కొన్ని ప్రాజెక్టుల అమలులో ముందస్తు ఆర్థిక అనుమతుల ప్రక్రియపై వస్తున్న గణాంకాలు వ్యవస్థాగత పర్యవేక్షణ అవసరాన్ని వెల్లడిస్తున్నాయి.

వివిధ రాష్ట్రాల్లోనూ పాలనా విధానాలపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తిగత నిర్ణయాధికారం కంటే వ్యవస్థల మధ్య ఉండాల్సిన సమతుల్యతకే ప్రాధాన్యత ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

సామ్రాజ్యాల పతనానికి బాహ్య శత్రువుల కంటే అంతర్గత వ్యవస్థాగత బలహీనతలు, నిర్ణయాధికారాల్లో ఉండే లోపాలు ప్రధాన కారణాలుగా చరిత్రకారులు విశ్లేషిస్తుంటారు. చరిత్ర మిగిల్చిన ఆధారాలను, వివిధ అంతర్జాతీయ నివేదికలను, ప్రస్తుత సామాజిక-రాజకీయ పరిణామాలను గమనించినప్పుడు.. వ్యవస్థల కంటే వ్యక్తిగత ప్రతిష్ఠకే అధిక ప్రాధాన్యత ఇచ్చే ధోరణి అంతిమంగా ప్రజాస్వామ్యానికి సవాలుగా పరిణమించవచ్చనే అభిప్రాయం బలోపేతమవుతోంది.

అధికారం అనేది ప్రజలు అప్పగించిన పవిత్రమైన నమ్మకం. నాయకత్వం తన మేధస్సును వ్యవస్థల నిర్మాణానికి, ప్రజా సంక్షేమానికి వినియోగించినప్పుడే అది స్థిరమైన గుర్తింపును పొందుతుంది. వ్యక్తులు తాత్కాలికం, వ్యవస్థలే శాశ్వతం అనే మూలసూత్రాన్ని ప్రామాణికంగా తీసుకోనప్పుడు సంక్షోభాలు మొదలయ్యే అవకాశం ఉంటుంది.

చరిత్ర వ్యక్తుల పేర్ల కంటే ఆయా నిర్ణయాల వల్ల సమాజంపై పడిన ప్రభావాలనే ఎక్కువగా గుర్తుంచుకుంటుంది. చివరికి మిగిలేది అధికార వైభవం కాదు. మానవీయ విలువల పరిరక్షణే.

**- ఫిరోజ్ ఖాన్**
9640466464

# సమాజం సవాళ్లు ..బాధ్యతలు



ఆధునిక మానవుడు సాంకేతిక శిఖరాలను అధిరోహిస్తున్నాడు. అరచేతిలో ప్రపంచం. అంగార కుడిపైకి అడుగులు పడుతున్నాయి. కానీ, మరోవైపు మన కంటి ముందే సమాజం పల్చబడుతోంది. పర్యావరణ వినాశనం, సామాజిక వివక్ష, నైతిక విలువల పతనం వంటి సమస్యలు మౌనంగా మన పునాదులను తొలిచేస్తున్నాయి. ప్రగతి అంటే భవనాల నిర్మాణం కాదు. పచ్చని ప్రకృతితో కూడిన ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం అని మనం గుర్తించాల్సిన సమయం ఆసన్న మైంది.

నేడు మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే తిండి.... అన్నీ కలుషితమే. ముఖ్యంగా ప్లాస్టిక్ మహమ్మారి మన భూమిని శ్మశానంగా మారుస్తోంది. ఏటా ప్రపంచవ్యాప్తంగా సుమారు 400 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి, అందులో కేవలం 9% మాత్రమే రీసైకిల్ అవుతోంది. వాతావరణ మార్పుల వల్ల అకాల వర్షాలు, తీవ్రమైన ఎండలు మనల్ని హెచ్చరిస్తున్నాయి. జల సంరక్షణ కోసం ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు, చెరువుల పునరుద్ధరణ తప్పనిసరి. ప్లాస్టిక్ బదులు జనపనార సంచులు, మట్టి పాత్రల వాడకాన్ని ఒక జీవనశైలిగా మార్చుకోవాలి. మహిళా సాధికారత అంటే కేవలం ఉద్యోగం చేయడం కాదు, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం పొందడం. నేడు మహిళలు అంతరిక్షంలోకి వెళ్తున్నారు, సొంతంగా స్టార్టప్‌లు పెట్టి పారి శ్రామికవేత్తలుగా రాణిస్తున్నారు. అయితే, క్షేత్ర స్థాయిలో ఇంకా అనేక సవాళ్లు ఉన్నాయి. పని ప్రదేశాల్లో భద్రత (POSH Act) వంటి చట్టాలపై ఇంకా పూర్తిస్థాయి అవగాహన కొరవడింది.

నేటి డిజిటల్ యుగంలో సైబర్ వేధింపులు మహిళలకు పెద్ద ముప్పుగా మారాయి. చట్టపరమైన రక్షణలతో పాటు, బాలికలకు ఆత్మరక్షణ విద్య, సమానత్వ భావనను చిన్నప్పటి నుండే నేర్పించాలి. ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళకు



నిజమైన గౌరవం లభిస్తుంది. ఒకవైపు అభివృద్ధి గురించి మాట్లాడుకుంటూనే, మరోవైపు బాల్య వివాహాలు వంటి దురాచారాలు ఇంకా కొనసాగడం సిగ్గుచేటు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, అవగాహన లేమి వల్ల బాల్యం చితికిపోతోంది. దీనికి తోడు, నేటి యువతను మాదకద్రవ్యాల అలవాటు పట్టి పీడిస్తోంది. గంజాయి, సింథటిక్ డ్రగ్స్ వల్ల ఎంతోమంది మేధావులు, విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

మరో బాధాకరమైన విషయం ఏమిటంటే వృద్ధుల సమస్యలు. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై, 'న్యూక్లియర్' ఫ్యామిలీలు పెరగడంతో వృద్ధులు ఒంటరితనం అనుభవిస్తున్నారు. సంపాదించే శక్తి ఉన్నంతకాలం చూసి, ఆ తర్వాత వారిని వృద్ధాశ్రమాలకు పంపడం సమాజ నైతిక పతనానికి నిదర్శనం. ప్రస్తుత సమాజం ఒక సంధి కాలంలో ఉంది. ఏఐ వంటి సాంకేతికతలు వస్తున్న తరుణంలో, మనం మానవత్వాన్ని మర్చిపో కూడదు. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన ప్రాథమిక కర్తవ్యం. మహిళలకు రక్షణ ఉన్నచోటే అభివృద్ధి సాధ్యం. యువత వ్యసనాలకు దూరంగా ఉండి, వృద్ధులను గౌరవించే సంస్కృతిని పునరుద్ధరించుకోవాలి.

ప్రభుత్వాలు చట్టాలు చేస్తాయి, కానీ మార్పు మన ఇంటి నుండే మొదలవ్వాలి. స్వచ్ఛమైన గాలి, సమానత్వంతో కూడిన సమాజం, వ్యసన రహిత యువత ఉన్నప్పుడే మనం రేపటి తరానికి నిజమైన సంపదను అందించిన వాళ్లమవుతాం. మేల్కొందాం.. మార్పు వైపు అడుగు వేద్దాం!

**- కాళేశ్వరం కృష్ణమూర్తి**
9705196097

# శనీశ్వర పూజతో అంతా శుభమే

'నీలాంజన సమాభాసం ! రవిపుత్రం యమాగ్రజం! ఛాయా మార్తాండ సంభూతం ! తం నమామి శనైశ్చరమ్' !

భారతీయుల జ్యోతిష శాస్త్రం ప్రకారం 'శనీశ్వరుడు', నవగ్రహాలలో ఒక గ్రహం. సూర్యుడు, చంద్రుడు, ఛాయా గ్రహాలైన రాహువు మరియు కేతువులతో కలిపి గ్రహాలు తొమ్మిది. గగన మండలంలో ఉన్న గ్రహాలకు భూమితో సంబంధం ఉంది. కాబట్టి తొమ్మిది గ్రహాల ప్రభావం భూమి మీద భూమిపై ఉన్న ప్రతి చరాచర జీవుల పైన, నిర్జీవ, ఝడ, నిర్లిప్త వస్తువుల మీద వుంటుంది.

నవగ్రహాలలో ఒకటైన శని గ్రహం ఇందుకు భిన్నం కాదు. శని, శనిగ్రహం, శనేశ్వరుడు, శనీశ్వరుడు, అని పలు నామములతో పిలువబడి, గ్రహ రూపంలో పూజింపబడే 'శని' ఒక గ్రహదేవుడు. వారంలో ఏడవవారం శనివారం. శనికి మందగమనుడు అని కూడా పేరు. శనై: క్రమతీతి అనగా అతి నెమ్మదిగా కదిలేవాడు అని అర్థం. ఒకసారి సూర్యుని చుట్టి రావడానికి శనికి 30 సంవత్సరాలు పడుతుంది. శానైస్కర్య, అసిత, సప్తర్చి, క్రూరదృష్ట, క్రూరలోచనుడు, పంగుపాదుడు, గృధ్ర వాహనుడు మొదలైన పేర్లుకూడా ఉన్నాయి. సంఖ్యలలో 'ఎనిమిది' శనికి ప్రీతికరమయిన సంఖ్య.

ఛాయదేవికి పుట్టిన సంతానం శనిదేవుడు. ఆయనకు ఛాయాపుత్రుడు అనే పేరు కూడా ఉంది. జీవుల జాతక చక్రాలపైన తన ప్రభావాన్ని ఎలా చూప బోతున్నాడో అని నిరూపించడానికి ఆయన జననం సూర్య గ్రహణములో జరిగింది.

దేవతల్లో శని దేవుడికి విశిష్టమైన స్థానముంది. జీవులు చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం కల్పించి, శిక్షించి, ధర్మాన్ని నిలిపే శని భగవానుడు యమధర్మరాజుకు అన్న. యముడు మరణానంతరం దండనలు విధిస్తే, శనిదేవుడు వారి వారి కర్మ ఫలములను బట్టి జీవులు బ్రతికి ఉండగానే హింసించి, యాతనలకు గురిచేసి శిక్షిస్తాడు. శనీశ్వరుడు గోచారస్థితి ఫలితంగా ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని, ప్రభావం పడితే అనేక ఇబ్బందులను కలిగిస్తాడు. హిందూ క్యాలెండర్ ప్రకారం వైశాఖ చతుర్దశి అనంతరం వచ్చే అమవాస్య రోజు శని జయంతి జరుపు కుంటారు. సూర్యదేవుని కుమారుడైన శని.. జ్యోతిష శాస్త్రం ప్రకారం మానవుల జీవితంపై తీవ్ర ప్రభావం చూపిస్తాడు. శనీశ్వరుడిని భక్తి శ్రద్ధలతో కొలిచి ఆయన అనుగ్రహం పొందితే కష్టాలు దూరమై.. అదృష్టం కలిసి వస్తుంది.

దుష్టశక్తుల నుంచి మనల్ని మనం కాపాడు కోవడానికి శని దేవున్ని ప్రసన్నం చేసుకోవాలి. అంటే తైలాభిషేకం చేసి శాంతి పూజలు నిర్వహించాలి. బ్రహ్మ వైవర్త పురాణం ప్రకారం, పార్వతీ దేవి, నలుగు పిండి బొమ్మకు ప్రాణం పోసినప్పుడు, వినాయకుడు జన్మించాడు. సకల దేవతలు, నవగ్రహాలు ఆ బాల వినాయకుడిని చూడటానికి వచ్చారు. ఆ ముగ్ధమోహన బాలుడిని అక్కడకు విచ్చేసిన దేవ తలు, మునులు కనులార చూసి, దీవెనలు అందించి, పార్వతీ దేవికి మోదం కలిగించారు. శని భగవానుడు మాత్రం తల ఎత్తి ఆ బాలుని చూడలేదు. అందుకు పార్వతీదేవి కినుక వహించి, తన బిడ్డను చూడమని శనిని ఆదేశించింది. అయినా శని తన దృష్టి, ఆ బాల గణపతిపై సారించలేదు. తన దృష్టి పడితే ఎవరికైనా కష్టాలు తప్పవని ఎంత నచ్చచెప్పినా, మాతృగర్వంతో శనీశ్వరుడి సదుద్దేశం తెలుసుకో లేక, పార్వతీ దేవి తన కుమారుని చూడమని పదే పదే శనిని ఆదేశించింది. శని తలఎత్తి చూసిన కారణంగా బాలగణపతి మానవ రూపంలో ఉండే తలను కోల్పోయినాడని బ్రహ్మ వైవర్త తదితరాలు తెలుపు తున్నాయి.

శని భగవానుని జన్మ వృత్తాంతం విన్న విక్రమాదిత్యుడు ఆయనను పరిహాసమాడాడట! ఆ పరి హాసాన్ని విన్న శని కోపగ్రస్తుడై విక్రమాదిత్యుని శపించాడట. శనిని కించపరిచే విధంగా మాటలాడి, అవమానించి నందుకు ఫలితంగా విక్రమాదిత్యుడు కష్టాలు అనుభవించాడు. రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు, చేయని దొంగతనపు నింద మోపబడి, పొరుగు రాజుచే కాళ్ళు,చేతులు నరికివేయ బడ్డాడు. చివరికి, విసిగి వేసారి పోయి, బాధలు ఏమాత్రం భరించే ఓపికలేక, నిర్వీర్యుడై, భ్రష్టుడై, చేసేదిలేక, తనను కనికరింపమని శనిదేవుని అత్యంత శ్రద్ధతో, ఆర్తితో, భక్తితో ప్రార్థించగా, విక్రమాదిత్యుని భక్తికి సంతృప్తి చెందిన శనీశ్వ రుడు తిరిగి అతని పూర్వ వైభవం ప్రాప్తింప చేసాడు.

శని దశ దుష్ప్రభావాలతో బాధపడే వారు, భక్తితో శని దేవునికి నూనెసమర్పిస్తే చెడు ఫలితాలు పోతాయని విశ్వాసం. శని దేవతను ప్రతిబింబించే నల్ల వస్తువులను... నల్ల ధాన్యాలు, నల్లమినప్పప్పు, నల్లనూనెలు, నల్లఆవులు, నల్ల బట్టలు, మొదలైనవి దానం చేస్తే చెడు ప్రభావాలు తొలగి పోతాయి.

చీమలకు బెల్లాన్ని ఆహారంగా ఇస్తే శని సంతుష్టుడై ఉంటాడు. శని స్తోత్రాన్ని నిత్యం పఠిస్తే భగవంతుడి ఆశీర్వాదాలు పొందుతారు. జీవితంలో క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కొంటోన్న సమయంలో సూర్య దేవుడి కుమారుడైన, శని దేవుడికి పూజ చేస్తే మంచి ఫలితాలుంటాయి. శనివారం ఉపవాసం ఉండి, శనీశ్వరుడి అనుగ్రహం పొందితే అదృష్టం కలిసి వస్తుంది.

శని మనిషి చేసిన చెడు కర్మ ఫలితాన్ని తొలగిస్తాడు. జాతక రీత్యా శని పన్నెండవ ఇంట, ఒకటవ ఇంట, రెండవ ఇంట సంచరిస్తున్నప్పుడు, దానిని 'ఏలినాటి శని' లేదా 'సాడే సాతి' అంటారు. అయితే ఈ సమయంలో శని ఇచ్చే ఫలితం తాత్కాలికంగా చెడు అనిపించినా, అది ఆ వ్యక్తి భవిష్యత్తుకు ఎంతో సహాయ కారిగా ఉంటుంది. పూర్వ జన్మలో చేసిన పాపాల ప్రయత్నాన్ని కష్టాల రూపంలో శని ఈ సమయంలో తొలగిస్తాడు. తద్వారా ఆ వ్యక్తికి మంచి భవిష్యత్తు కలుగుతుంది.

మనం ఎంత కష్టం చేస్తే శని అంతా సంతృప్తి చెందుతాడు. కాబట్టి జాతకంలో కానీ, గోచారంలో కానీ, శని అనుకూలంగా లేని వ్యక్తులు శారీరకంగా కష్ట పడటం, అంటే ఇతరులకు సహాయం చేయడం మొదలైనవి చేస్తే ఆ చెడు ఫలితం తగ్గిపోయి శుభ ఫలితాలను శని ఇస్తాడు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494



# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



జగిత్యాల మే 15( మనం ప్రతినిధి ): జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ, నిల్వలు మరియు మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలనే ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ధర్మపురి మండలం, జైన, రాజారాం గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, దుబ్బల గూడెం గ్రామంలో మొక్కజొన్న గోదాం అలాగే దమ్మన్న పేట గ్రామంలోని పరమేశ్వర రైస్ మిల్, ధనలక్ష్మి రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో మరియు జిల్లాలో అకాల వర్షాలు ఉన్నందున వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు గన్ని సంచులు, టార్ఫలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు.

ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్ఫాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు వస్తున్న వరి ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా అన్లోడ్ చేసిన వెంటనే లారీలను త్వరితగతిన పంపించాలని మిల్లర్లను ఆదేశించారు. రైతులు మరియు రవాణాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం దిగుమతి, నిల్వ, మిల్లింగ్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. మిల్లుల్లో ధాన్యం నిల్వలు, తేమ శాతం, మిల్లింగ్ సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిల్లర్లు హమాలీలను అందుబాటులో ఉంచుకొని వచ్చిన ధాన్యాన్ని దింపుకోవాలని అలాగే మిల్లర్లు, ట్రాన్స్పోర్టర్లు, అధికారులు సమన్వయం చేసుకొని కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ , సివిల్ సప్లైస్ డిఎం జితేంద్ర ప్రసాద్ , తహసీల్దార్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## డివిజనల్ పోలీస్ అధికారిని కలిసిన మాల మహానాడు నాయకులు



జగిత్యాల మే 15( మనం న్యూస్ ): జగిత్యాల నూతన సబ్ - డివిజనల్ పోలీస్ అధికారిగా నియమించబడి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డి ఎస్ పి కార్యాలయంలో ఉదయం 11:00 పదకొండు గంటలకు వారిని మర్యాద పూర్వకంగా ఇజితుఛిజి మాల మహానాడు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు చిత్తారి ప్రభాకర్, డిక్కి జిల్లా కో - ఆర్డినేటర్ నల్ల శ్యామ్, మాల మహానాడు అఫ్ ఇండియా డివిజన్ అధ్యక్షులు తోట జగన్, మట్టిపూలు పత్రిక సంపాదకులు, తక్కళ్ళ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## లోడింగ్-అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి



జగిత్యాల మే 15(మనం ప్రతినిధి): జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, రవాణా మరియు మిల్లులలో లోడింగ్-అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా సివిల్ సప్లై అధికారులు, ధర్మపురి నియోజకవర్గ స్థాయి అధికారులు మరియు రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, మిల్లుల వద్ద ఎక్కడా వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోకుండా చూడాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మిల్లులలో లోడింగ్ మరియు అన్లోడింగ్ పనులు నిరంతరాయంగా కొనసాగించేలా మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి రోజు కొనుగోలు, రవాణా, అన్లోడింగ్ ప్రక్రియలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, పెండింగ్లో ఉన్న లారీలను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. ధాన్యం నిల్వలు ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా వేగంగా మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ఏ చిన్న నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏదైనా సమస్యలుంటే ఉన్నతధికారుల దృష్టికి తీసుకువచ్చి త్వరగా పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై అధికారులు, ధర్మపురి నియోజకవర్గానికి చెందిన తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదుప్రారంభించిన కలెక్టర్



జగిత్యాల మే 15(మనం న్యూస్): జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు అందించేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం 15-05-2026 నుండి 15-06-2026 వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజలు అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేసుకుని రెడ్ క్రాస్ సేవలకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు మరియు రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా



- **రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు**
- **జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

జగిత్యాల, మే 15(మనం ప్రతినిధి): రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు భద్రంగా కొనసాగేందుకు, పశువుల అక్రమ రవాణా మరియు గోవధ నివారణ పై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన రాయపట్నం, రాజారాం పల్లె, చిల్వకోడూర్ చెక్పోస్టును జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల సమయంలో విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా పశువులను తరలిస్తున్న వాహనాల పత్రాలను పూర్తిగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి వాహనానికి సంబంధించిన వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని ,అనుమానాస్పదంగా సంచరించే వాహనాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.

అక్రమంగా గోవులను రవాణా చేస్తున్నారనే పేరుతో కొందరు వ్యక్తులు లేదా సంఘాలు బృందాలుగా ఏర్పడి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం, అల్లర్లు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా పోలీసు శాఖదేనని, ఎవరూ స్వచ్ఛందంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని అన్నారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా ఉపేక్షించబోమని, ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు. ఎస్పి వెంట డిఎస్పి పురుషోత్తం రెడ్డి, ధర్మపురి సి.ఐ రామ్ నరసింహ రెడ్డి, ఎస్. ఐ లు మహేష్, ఉదయ్ కుమార్, కృష్ణ సాగర్, మరియు సిబ్బంది ఉన్నారు.

# బదిలీపై వెళ్తున్న డీఎస్పీలకు ఘన సన్మానం

- **సేవలను కొనియాడిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



జగిత్యాల, మే 15(మనం న్యూస్): శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసింగ్ కార్యక్రమాల అమలులో విశేష సేవలందించిన డీఎస్పీలు రఘు చందర్, శ్రీనివాస్ లు బదిలీపై వెళ్లనున్న సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బదిలీపై వెళ్లనున్న అధికారులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లాలో విధులు నిర్వహించిన కాలంలో అధికారులు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. ముఖ్యంగా పండుగలు, ఎన్నికలు, ప్రత్యేక బందోబస్తు విధులు,నేర నియంత్రణ, యువతలో మత్తు పదార్థాల నిర్మూలన వంటి అంశాల్లో అధికారులు సమర్థవంతంగా పనిచేశారని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో ప్రతి అధికారి తన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తూ ప్రజల భద్రతకే ప్రాధాన్యత ఇవ్వాలని, అదే పోలీసింగ్కు అసలైన గుర్తింపని ఎస్పీ తెలిపారు. విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావం ఉంటే ప్రజల ఆదరణతో పాటు ఉన్నతాధికారుల ప్రశంసలు కూడా లభిస్తాయని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సర్వసాధారణమని ఎక్కడ విధులు నిర్వహించిన అంకిత భావంతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కొత్తగా బదిలీ అయిన ప్రాంతాల్లో కూడా ఇదే విధమైన సేవా తత్వంతో పనిచేసి ప్రజలకు మరింత చేరువ కావాలని, తమ అనుభవంతో పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లనున్న డీఎస్పీలు కూడా జగిత్యాల జిల్లాలో పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో పనిచేయడం గర్వంగా భావిస్తున్నామని తెలిపారు. జిల్లాలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సహకారం ఎల్లప్పుడూ లభించిందని పేర్కొన్నారు. జిల్లాలో పని చేసే అవకాశం రావడం సంతోషాన్ని ఇచ్చిందని, సమర్థవంతంగా పనిచేసిన మధుర స్మృతులతో బదిలీ పై వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ చేతన్ నితిన్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, రఘు చందర్, శ్రీనివాస్, సీఐలు, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## నేటి యువత పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

జగిత్యాల మే 15( మనం ప్రతినిధి ): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యావారోత్సవాల సందర్భంగా జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనబట్ల దినేష్ అధ్యక్షతన శుక్రవారం గ్రంథాలయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి-శ్రీనివాస్, జిల్లా విద్యాధికారి కె. రాము, స్థానిక కౌన్సిలర్ మమత, యం.ఈ.వో చంద్రకళ హాజరై ప్రసంగించారు. వారు మాట్లాడుతూ - విద్యార్థులు, యువత, ప్రజలు పుస్తకాల పఠనంపై దృష్టి సారిస్తే చదువుతో వచ్చిన జ్ఞానం జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని తెలిపారు. మొబైల్ ఫోన్లను పక్కనపెట్టి పుస్తకాలను అలవాటు చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని, క్రమబద్ధమైన అధ్యయనం ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులు, యువత కోసం అందిస్తున్న గ్రంథాలయ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయాలు ఎందరినో ఐఎఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థాయి అధికారులను తయారు చేశాయని వారు గుర్తుచేశారు. ప్రతి ఒక్కరికి మార్గదర్శి గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిల్వ కేంద్రాలు మాత్రమే కాదు, అవి జ్ఞాన సంపదకు నిలయాలు. విద్యార్థులలో చదువుపై ఆసక్తిని పెంపొందిస్తాయి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి మార్గదర్శకంగా నిలుస్తాయి సమాజంలో అవగాహన, విజ్ఞానం పెంచుతాయి వ్యక్తిత్వ వికాసానికి, ఆత్మవిశ్వాసానికి దోహదం చేస్తాయి. సృజనాత్మకత, ఆలోచనా శక్తిని అభివృద్ధి చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమానికి ముందు పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులను సత్కరించడం జరిగింది. తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం టి జి యు యస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు నునావత్ రాజు ను జిల్లా గ్రంథాలయ చైర్మన్, డిఈఓ, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్, యం.ఈ.వో ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నూనావత్ రాజు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు నూనావత్ రాజు,ఆర్ యూ పి పి జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ ,ఎస్.టి.యు జిల్లా అధ్యక్షులు భైరం హరికిరణ్, ఎస్.యస్.టి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు నకుమల్ల నర్సయ్య, తపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయినిపెల్లి ప్రసాద్ రావు, రాజేష్, రాష్ట్ర బాధ్యులు బోనగిరి దేవయ్య, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



- **రైస్ మిల్లుల వద్దా ధాన్యం 24 గంటల్లో అన్‌లోడింగ్‌చేయాలి**
- **జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్**

జగిత్యాల / ఇబ్రహీంపట్నం మే 15( మనం న్యూస్ ): ఇబ్రహీంపట్నం మండలం గోధూరు గ్రామం లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరియు శ్రీ రాజ రాజేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. అనంతరం రైస్ మిల్లులను తనిఖీ చేసి మిల్లర్లు హమాలీల సంఖ్య పెంచాలని ధాన్యం తో వచ్చిన లారీలను 24 గంటల్లోగా అన్లోడ్ అయ్యే విధంగా చూడాలని రైస్ మిల్లర్లు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోళ్లు సజావుగా, వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ధాన్యం అన్లోడింగ్ లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వర ప్రసాద్, ఎంపిడివో గణేష్, ఎంపివో రామ కృష్ణ రాజు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల కట్టడికి వ్యూహాలు

- **కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టిటిఇ**

హైదరాబాద్,మే 15(మనం,ప్రత్యేక ప్రతినిధి): వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాద విపత్తులపై రాష్ట్ర స్థాయి మాక్ ఎక్సైజ్‌లో భాగంగా శుక్రవారం టీజీఐసిసిసిలో ఒక టేబుల్ టాప్ ఎక్సైజ్ నిర్వహించారు. ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ మాన్, ఐపీఎస్, డీజీ ఫైర్ సర్వీసెస్, ఎమర్జెన్సీ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ పర్యవేక్షణలో, రెవెన్యూ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) కార్యదర్శి హరి చందన దాసరి కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో భారత ప్రభుత్వ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ లీడ్ కన్సల్టెంట్, మేజర్ జనరల్ సుధీర్ బహల్ టీటీఇ విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరహా విన్యాసాలు ఎస్డిఎంఏ, టిజిఐసిసిసి, ఎస్డిఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం, పోలీస్, అగ్నిమాపక సేవలు, ఇతర సంబంధిత శాఖల మధ్య సమన్వయానికి ప్రాధాన్యత నిస్తాయన్నారు. వివిధ విపత్తు పరిస్థితులు, ప్రతిస్పందన వ్యూహాలు, సమాచార ప్రసార నియమావళి, వనరుల సమీకరణ యంత్రాంగాలపై చర్చించామన్నారు.ఈ విన్యాసంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన 47 శాఖల అధిపతులు, ప్రతినిధులు చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. వరదలు, కార్చిచ్చులు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి విపత్తులను ఎదుర్కోవడంలో, సంబంధిత శాఖలన్నింటి మధ్య సంసిద్ధత, సమన్వయంతో పాటు బలోపేతం చేయడంపై టిటిఇ దృష్టి సారించిందన్నారు. ఈ సందర్భంగా యువ ఆపద మిత్రాలకు చెందిన కొందరు వాలంటీర్లను కూడా సన్మానించామని తెలిపారు.




## బీటీ రోడ్డును పరిశీలించిన అధికారులు



భీమదేవరపల్లి మే 15 మనం న్యూస్: ముత్తారం బీటీ ఎక్స్ రోడ్ నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఎస్ ఇ శ్రీనివాసరావు పరిశీలించారు. శుక్రవారం రోజున ముత్తారం నుండి గట్ల నర్సింగపూర్ గ్రామాల 3.77 కిలోమీటర్ల పొడవు బీటి ఎక్స్ రోడ్ గలసంబంధించిన గ్రామీణ అభివృద్ధి శాఖ జారీచేసిన జీవో ప్రకారం గత 2024 పరిపాలన అనుమతులు లభించాయని, నిర్మాణ పనులు చేపట్టేందుకు బాధ్యతలను కరీంనగర్ చెందిన ధరణి కన్స్ట్రక్షన్ సంస్థకు అప్పగించినట్లు పనుల గడువును గత సెప్టెంబర్ 20 25 నుండి 23 సెప్టెంబర్ 20 26 వరకు నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. బీటీ రోడ్ నిర్మాణం పూర్తయితే ముత్తారం లంబడి తండా గట్ల నర్సింగాపూర్ ప్రాంత ప్రజలకు మరిరైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు. రహదారి నిర్మాణ పనులు పరిశీలించిన ఉన్నతాధికారులతో పాటు డిపిఆర్ఈ సైదులు రెడ్డి, ఆర్ అండ్ బి డి ఈ శిరీష పంచాయతీరాజ్ ఏఈ వినయ్ రెడ్డి, ముత్తారం గ్రామ ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్ , ప్రొఫెసర్ వీరన్న నాయక ఈపాల్గొన్నారు

# మమ్మల్ని వారిలా గుర్తించండి

- **రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పనిభారం తగ్గించండి**
- **సెంట్రల్ గవర్నమెంట్‌లాగా మమ్మల్ని చూడండి**
- **వారంలో 5 రోజుల పనిదినాలను అమలుచేయాలి?**
- **తెలంగాణ ప్రభుత్వానికి ఉద్యోగ జేఏసీ లేఖ**

హైదరాబాద్, మనం ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు అమలు చేస్తున్న 5 రోజుల పనిదినాలను తెలంగాణలోనూ అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ,గెజిడెట్, వర్కర్స్, పెన్షర్ల జేఏసీ ప్రభుత్వానికి లేఖ రాసింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తం నెలకొన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కేంద్రం ఇచ్చిన పిలుపు మేరకు ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం కూడా వారంలో ఐదురోజుల పనిదినాలను అమలు చేయాలని జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావులు కోరారు. ఈ విధానం వల్ల ఇంధన పొదుపుతో పాటు కాలుష్యం నివారణ, ఉద్యోగుల భద్రతను కాపాడుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం ఉద్యోగులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బదులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విధులు నిర్వహించే అవకాశముంటుందని వెల్లడించారు. ఈ పనిదినాల గురించి ఉద్యోగ జేఏసీ నాయకులు ప్రభుత్వాలకు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నామని, ఇప్పటి నుంచైనా రాష్ట్రంలో 5 దినాల పని విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ,గెజిడెట్, వర్కర్స్, పెన్షర్ల జేఏసీ నేతలు ముఖ్యమంత్రిని కోరారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తెలంగాణ రూపు దిద్దుకుంటోంది

**650 కోట్లతో 44 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం**
**1500 మంది మహిళలకు ఉపాధి**
**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**
**వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు రావాలి**
**యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించే దిశగా పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి.**
**మంత్రి దామోదర్ రాజనర్సింహ**
**కెజెఎస్ ఇండియా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్-2 కు శంకుస్థాపనచేసిన మంత్రులు**

సంగారెడ్డి, మే 15 మనం న్యూస్ ప్రతినిధి : రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తో కలిసి సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తోగారపల్లి గ్రామ శివారులో కే జేఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్-2 కు శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేపడుతున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 1500 మందికి, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో భారీ స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ హబ్లు ఏర్పాటుకానున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 9 ట్రిలియన్ డాలర్ల మార్కెట్గా ఎదగనున్న నేపథ్యంలో తెలంగాణ కూడా ఈ రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. జహీరాబాద్ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని నిమ్జ్ ను అతిపెద్ద పారిశ్రామిక కారిడార్గా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం అంతర్జాతీయ పారిశ్రామిక కారిడార్గా రూపుదిద్దు కుంటుందని





పేర్కొన్నారు. 65 శాతం పైగా యువత నైపుణ్యాలను వినియోగించుకొని తెలంగాణను మరింత శక్తివంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతాలను గుర్తించి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు.తెలంగాణ దేశంలో అత్యధిక వరి ధాన్యం ఉత్పత్తి చేసే రాష్ట్రంగా నిలిచిందని, పాలు, పండ్లు, కూరగాయలు, పసుపు వంటి ఉత్పత్తులలో కూడా రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు విలువను పెంచే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటవడం రైతులకు, యువతకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా పటాన్చెరు గుర్తింపు పొందిందన్నారు. అదే తరహాలో వెనుకబడిన ప్రాంతాల్లో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో ఇంత పెద్ద స్థాయిలో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న కే జేఎస్ ఇండియా యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు.పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని పేర్కొన్నారు. మెదక్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి స్వర్గీయ ఇందిరా గాంధీ ఎంపీగా ఉన్న సమయంలో ఏర్పడిన పారిశ్రామిక ప్రోత్సాహక చర్యలే కారణమన్నారు. సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందేందుకు





ఇంకా అనేక ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, టి జి ఐ ఐ సి చైర్మన్లు నిర్మల జగ్గారెడ్డి, గిరిధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్, టీజీఐఐసి ఎండి శశాంక్ , మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కంపెనీ చైర్మన్ గిరీష్ జైన్,ఎండి సి.పి. రాంకా , అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇన్స్టాగ్రామ్ కాల్స్ దొంగలను పట్టివేత

- **టెక్నాలజీతో పట్టుకున్న గౌరారం సర్కిల్ పోలీసులు**
- **ప్రత్యేకంగా అభినందించిన సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్**

ములుగు, మే 15(మనంన్యూస్): సిద్దిపేట జిల్లా ములుగు మండలం చిన్నతిమ్మాపూర్ గ్రామంలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఇంటి తాళాలు పగులగొట్టి 24ట తులాల బంగారం, 44 తులాల వెండి ఆభరణాలు, రూ.2 లక్షల నగదు దొంగతనం చేసిన ముగ్గురు నిందితుల్లో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. శాలివాహిని నర్సింలు కుటుంబ సభ్యులు వివాహ కార్యక్రమానికి వెళ్లిన సమయంలో నిందితులు ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. గజ్వేల్ రూరల్ సీఐ డి. రవిరాజు ఆధ్వర్యంలో ములుగు ఎస్సై రఘుపతి మరియు పోలీసులు, సీసీఎస్ సి ఐ రవీందర్, ఐటీ సెల్, ఫింగర్ ప్రింట్స్ బృందాలు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించారు.విచారణలో నిందితులు సాధారణ ఫోన్ కాల్స్ చేస్తే పోలీసులకు చిక్కిపోతామని భావించి, ఇన్స్టాగ్రామ్ కాల్స్ ద్వారా పరస్పరం మాట్లాడుకుంటూ నేరానికి పాల్పడినట్లు బయటపడింది.

అయినప్పటికీ ఆధునిక టెక్నాలజీతో పోలీసులు వారిని పట్టుకుని భారీ మొత్తంలో బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. కేసును వేగంగా ఛేదించిన పోలీసు అధికారులను సిద్ధిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మి పెరుమాళ్ అభినందించారు.





# ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోంది

**బాన్సువాడలో నూతన సబ్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం ప్రారంభం**
**ప్రారంభించిన ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**
**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**



కామారెడ్డి, మే 15 (మనం జిల్లా ప్రతినిధి): ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించాలనే లక్ష్యంతో బాన్సువాడలో నూతనంగా నిర్మించిన ఆర్డీఓ/సబ్ కలెక్టర్ నివాసం, క్యాంపు కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం ప్రారంభించారు. ఆధునిక వసతులతో నిర్మించిన ఈ భవనం ద్వారా రెవెన్యూ సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ., ప్రజల సమస్యలను అధికారులు బాధ్యతాయుతంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను సకాలంలో అందించాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలే లక్ష్యం, ఇబ్బందులు లేకుండా రెవెన్యూ వ్యవస్థ పని చేయాలని అన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలకు ఆధునిక కార్యాలయం: ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు... జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ, బాన్సువాడ డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు ఆధునిక కార్యాలయాల ఏర్పాటు అవసరమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ., రెవెన్యూ వ్యవస్థను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దేందుకు ఈ నూతన క్యాంపు కార్యాలయం దోహదపడుతుందని తెలిపారు. ప్రజల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, జగిత్యాల అదనపు కలెక్టర్ రాజా గౌడ్, బాన్సువాడ ఆర్డీఓ ఎడ్ల రవీందర్ రెడ్డి, బోధన్ ఆర్డీఓ, ఏఎంసీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జనగణన పనులపై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్

**తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు దిశానిర్దేశం**
**గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారుల సహకారం**
**పట్టణ ప్రాంతాల్లో వార్డ్ అధికారులు, బిల్ కలెక్టర్లు ఎన్యూమరేటర్లకు తోడ్పాటు అందించాలి**
**జనగణనపై విస్తృత ప్రచారం నిర్వహించి, ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో వివరాల సేకరణ చేపట్టాలి.**

కామారెడ్డి, మే 14 (మనం జిల్లా ప్రతినిధి): జనగణన-2027లో భాగంగా చేపడుతున్న ఇంటి గణన, ఇంటి జాబితా తయారీ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు పలు సూచనలు చేశారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ పరిధిలో 'హెచ్ఎల్ఓ' యాప్ ద్వారా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు, పట్టణాల్లో వార్డ్ అధికారులు, బిల్ కలెక్టర్లు సహకరించాలని సూచించారు. జనగణనపై టామ్టామ్, శానిటేషన్ వాహనాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని డీపీవో, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా



ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో వివరాల సేకరణ చేపట్టాలని సూచించారు.

ప్రజలు సరైన సమాచారం అందించి జనగణన విజయవంతానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

# బాన్సువాడలో ఆసుపత్రి సేవలు, జొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**రోగులు, సిబ్బందితో మాట్లాడి వైద్య సేవలపై వివరాల సేకరణ**
**వైద్య సేవల నాణ్యత మెరుగుపర్చాలని ఆదేశం**
**ఆసుపత్రిలో పరిశుభ్రత, సేవల నాణ్యత, సమయపాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**
**ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని కలెక్టర్ వ్యాఖ్య**



కామారెడ్డి, మే 15 (మనం ప్రతినిధి): బాన్సువాడలోని మాతా శిశు ఆసుపత్రి (ఎంసీహెచ్ హాస్పిటల్)ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలు, పరిశుభ్రత, సిబ్బంది పనితీరును పరిశీలించి రోగులు, సిబ్బందితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న చికిత్స, మందుల సరఫరా, సేవల నాణ్యతపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, మెరుగైన సదుపాయాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోగులకు అవసరమైన చికిత్స, మందులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రులలో పరిశుభ్రత, సమయపాలన, సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.అనంతరం నూతన ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఏరియా ఆసుపత్రి పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యత, ప్రగతి స్థితిని సమీక్షించి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ విద్య, టీఎస్ఎంఎస్ఐడీసీ ఏఈ సాగర్ రెడ్డి, ఏరియా ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. కొనాపూర్లో బోర్లం పీఏసీఎస్ ఆధ్వర్యంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రం పరిశీలన... కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బాన్సువాడ మండలంలోని కొనాపూర్ గ్రామంలో బోర్లం పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు మొత్తం 15,383 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు, అందులో 11,683 క్వింటాళ్లను ఇప్పటికే కేటాయించిన గోదాములకు తరలించినట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు. ప్రస్తుతం 3,700 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన పంటను ఎలాంటి ఆలస్యం లేకుండా గోదాములకు తరలించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మిగిలిన మొక్కజొన్న తరలింపునకు తగిన సంఖ్యలో లారీలను వెంటనే ఏర్పాటు చేయాలని డీఎం మార్క్ఫెడ్కు సూచించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న మొక్కజొన్న తడవకుండా రక్షణ చర్యలు చేపట్టాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఓ, ఏడీఏ, తహసీల్దార్, ఎంఏఓ, సర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్, పంచాయతీ కార్యదర్శి, జీపీఓ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# బిజెపి ప్రభుత్వం పేదల నడ్డి విరుస్తుంది

- **పెట్రోల్ డీజిల్ ధరలు ఒకేసారి 3 రూపాయలు పెంచారు.**
- **ఎన్నికల తర్వాత వసూలు మొదలుపెట్టారు**
- **కేంద్రంపై విమర్శలు చేసిన మంత్రి శ్రీధర్ బాబు**

సంగారెడ్డి మే 15 మనం న్యూస్ ప్రతినిధి.. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు ఒకేసారి మూడు రూపాయలు పెంచడం ప్రజలపై భారంగా మారిందని విమర్శించారు. శుక్రవారం నాడు సంగారెడ్డి లో నిర్మల జగ్గారెడ్డి నివాసం లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు ఈ సమావేశంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఎంపీ సురేష్ షెట్కర్ పాల్గొన్నారు . ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ ధరలు మూడు రూపాయలు పెంచడం ప్రజలపై భారంగా మారిందని విమర్శించారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం ధరలు పెంపు చేపట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లేనని అన్నారు. ముఖ్యంగా పేద మధ్యతరగతి ప్రజలపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. బెంగాల్ తమిళనాడు ఎన్నికల చివరి దశకు ముందు పెట్రోల్ డీజిల్ ధరలు పెరగవని అధికార వర్గాలు చెప్పి, ఇప్పుడు పెంపు చేయడం ద్వారా ఓటర్లను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురుదారులు తగ్గిన సమయంలో కేంద్రం ప్రజలకు ఎప్పుడైనా ఉపశమనం కల్పించిందా అని బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏకంగా 3 రూపాయలు పెంచి ధరలు పెరిగే సంకేతాలు ఇస్తున్నారు నిత్యావసర వస్తువులు ధరలపై అదనపు భారం మోపి పేదల సామాన్య ప్రజల నడ్డి విరుచడమే బిజెపి అసలు స్వరూపమని ఆయన వ్యాఖ్యానించారు. గత 12 ఏళ్లలో అంతర్జాతీయంగా చమురు ధరలు అత్యల్ప స్థాయికి చేరిన కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ప్రయోజనం కల్పించలేదని విమర్శించారు రాజకీయ అంశాలపై స్పందిస్తూ ప్రజలను విభజించడం ప్రజల మధ్య



చిచ్చు పెట్టడం బిజెపి లక్ష్యమని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలు స్నేహపూర్వకంగా జీవించాలని రాహుల్ గాంధీ కోరుతున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజలు విజ్ఞానవంతులని బిజెపి కుట్రపూరిత రాజకీయాలను అంగీకరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధి సంక్షేమకే కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు అంశంపై మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ఈసారి భారీగా ధాన్యం మార్కెట్ కు వస్తుందని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు సీఎం రేవంత్ రెడ్డి ప్రతి రెండు రోజులకు ఒకసారి ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు హామీ ఇచ్చారు.

**నీట్ పరీక్ష లీకేజ్ ఘటనపై బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించాలి**

దాదాపు 23 లక్షల విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రంలోని ఎన్డీఏ బిజెపి ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు ఎన్నో సంవత్సరాలు కష్టపడి చదివిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, లేదా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు చట్టాలను చుట్టాలుగా బిఆర్ఎస్ ఉపయోగించినట్లు మేము చెయ్యమని చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు

# పారిశ్రామల స్థాపన లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుంది

- **సంగారెడ్డి ప్రాంతానికి మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి కల్పించే లక్ష్యంతో పని చేస్తున్నాం**
- **కేజీ ఎస్ పరిశ్రమ వల్ల 1600 మందికి ఉపాధి.**
- **సంగారెడ్డి ప్రజలు ఓడగొట్టినందుకు నిర్మల కి చైర్మన్ పదవి వచ్చింది.**
- **టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు.**

సంగారెడ్డి మే 15 మనం న్యూస్ ప్రతినిధి.. సంగారెడ్డి నియోజకవర్గం కొండాపూర్ మండలం తొగర్ పల్లి గ్రామంలో కే జి ఎస్ పరిశ్రమ నిర్మాణానికి శుక్రవారం నాడు భూమి పూజ నిర్వహించారు ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ ఎంపీలు, ఎమ్మెల్యే సంజీవరెడ్డి చర్చి చైర్మన్ గిరిధర్ రెడ్డి జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ లతో కలిసి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ. సంగారెడ్డి ప్రజలు నన్ను ఓడించినందుకే తన భార్య నిర్మల





జగ్గారెడ్డికి టీజీ ఐసీ చైర్ పర్సన్ పదవి వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు శ్రీధర్ బాబు దామోదర్ రాజనర్సింహ నన్ను అడగకుండానే ఈ నిర్ణయం తీసుకున్నారని జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి ప్రాంతంలో పరిశ్రమలు స్థాపన జరగాలి ఎక్కువమందికి ఉపాధి దొరకాలి అనే లక్ష్యంతో ఏడాది కాలంగా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తూ వచ్చానని ప్రజాప్రతినిధులు అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు ఈ క్రమంలో పాము పారిశ్రమ పెడతామని కే జి ఎస్ సంస్థ ఎండి గిరీష్ ముందుకొచ్చారని ఈ పరిశ్రమ వల్ల ఎంతోమందికి ఉపాధి వస్తుందని అన్నారు. ఈ పరిశ్రమ వల్ల ప్రధానంగా తొగర్పాలి అలియాబాద్ కొండాపూర్ ప్రాంతాల వారికి ఉపాధి దొరకడంతో పాటు సంగారెడ్డి చుట్టుపక్కల వారికి కూడా ఉపాధి లభిస్తుందని అన్నారు. ఇదొక చక్కని అవకాశం అని దీనివలన తనకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు సీఎం రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు కూడా మాకు ఫ్రీడం ఇవ్వడం వాళ్ళని పనులు వేగంగా జరిగేలా అధికారులకు సూచనలు చేశామని అన్నారు దీంతో పరిశ్రమ స్థాపన వేగంగా జరుగుతుందని పేర్కొన్నారు సంగారెడ్డికి చాలా పెద్ద చరిత్ర ఉందని ఆనాడు ఇందిరాగాంధీ మెదక్ ఎంపీగా ప్రధానిగా, ఉంటూ ఈ ప్రాంతంలో బిడిఎల్, లాంటి పరిశ్రమలు ఎన్నో స్థాపించారని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాగా రెడ్డి, పి రామచంద్రారెడ్డి దామోదర్ రాజనర్సింహ తండ్రికి కూడా ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు, ప్రజలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు . సంగారెడ్డి జిల్లాలో ఇంకా చాలా చోట్ల పరిశ్రమలు నెలకొల్పా, స్థానికులకు ఉపాధి కల్పించేలా కృషి కొనసాగిస్తామని అన్నారు.

# ఐదేళ్లు దాటినా సెన్సస్ డ్యూటీ ముసుగులో తిష్ట వేస్తున్నఅధికారులు

పాలకొల్లు, మే 15,మనం ప్రతి నిధి ఒకే గ్రామంలో ఐదేళ్లు దాటినా సెన్సెస్ డ్యూటీ పేరుతో కొందరు అధికారులు తిష్ట వేస్తున్నారు. కొందరు అధికారులు ఐదేళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తూ కొన్ని అవకతవకలకు పాల్పడు తున్నట్లు ప్రచారం జరుగుతుంది. 5ఏళ్ళు ఒకేచోట ఉండటంతో అక్కడ పట్టు సాధించి ప్రజలను వేధిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి అధికారులు వల్ల కూటమి ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు వస్తుందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇటువంటి అక్రమార్కులకు ఎన్నికల కమిషన్ సెన్సెస్ డ్యూటీ ఒక వరంగా మారిందని పలువురు చెబుతున్నారు. ఈ డ్యూటీని అడ్డం పెట్టుకొని ఆ గ్రామం గాని, మండలం గాని కదలకుండా తిష్ట వేసి డబ్బులు సంపాదించుకోవడానికి బంగారు బాటగా ఎంచుకుంటున్నారని ఆరోపణలు వెళ్ళు వెతుతున్నాయి.

ఇలాంటి వారు కొన్ని డిపార్ట్మెంట్ ల లో వున్నారని సమాచారం.కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన, ఐదేళ్లు దాటిని డ్యూటీ ఒకే గ్రామం గాని, మండలంలో గాని చేస్తున్న ఉద్యోగిని సెన్సెస్ డ్యూటీ నుంచి తప్పించి తక్షణమే బదిలీ చేయాలని, ప్రజలును కాపాడాలని కోరుతున్నారు.



# మంత్రి తుమ్మలని సన్మానించిన దమ్మపేట, అశ్వారావుపేట నాయకులు

దమ్మపేట, మే 15 (మనం న్యూస్) : దమ్మపేట మండల.గండుగులపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం మొట్టమొదటిసారి మంత్రిగా ప్రమాణం స్వీకారం చేసి 40.వసంతాలు పూర్తి చేసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని పలువురు కలుసుకొని తమ శుభాకాంక్షలు తెలిపారు. 40 సంవత్సరాలుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా లో తుమ్మల చేసిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకి ఆయురారోగ్యాలు ఆ భగవంతుడు కలగజేయాలని, భవిష్యత్తులో మరింత ప్రజాసేవ చేయాలని వారు కోరారు. మంత్రి తుమ్మలను కలిసిన వారిలో తెలంగాణ ఆయిల్ ఫామ్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, మాజీ జడ్పీటీసీ పైడి వెంక టేశ్వరరావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, దొడ్డ ప్రసాద్, కె.వి సత్యనారాయణ, మన్యం అప్పారావు, కాసాని నాగ ప్రసాదు, ఎర్ర వసంతరావు, బొల్లికొండ ప్రభాకర్, నిమ్మల పుల్లారావు, సత్తుపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు తదితరులు ఉన్నారు.

# బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలపై సమీక్ష



కొత్తగూడెం సింగరేణి, మే 15(మనం న్యూస్): కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో శుక్రవారం మల్టీ డిపార్ట్మెంటల్ టిమ్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సంస్థ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఉద్యోగుల బద్రతా ప్రమాణాలు కంపెనీ ముందున్న సవాళ్ళు నాణ్యతతో కూడిన బొగ్గును సరఫరా చేయడం వంటి విషయాలు చర్చించడం జరిగింది. అలాగే 2026-27 సంవత్సరానికి గాను సింగరేణి సంస్థ వ్యాప్తంగా 680 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి ని నిర్దేశిచడం జరిగిందని, అందులో భాగంగా కొత్తగూడెం ఏరియాకు గాను 22.50,(పీవీకేకి 2.50, వికేసిఎంకి 20.00 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించారని తెలియజేశారు. సింగరేణి వ్యాప్తంగా అన్నీ ఏరియాలలో ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్య సాధన గురించి ఈ నెల18వ తేదీ నుండి అన్ని గనులు విభాగాలలో మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్ లు సమావేశాలను నిర్వహించి అధికారులు ఉద్యోగుల సలహాలు సూచనలు తీసుకొని వాటి ద్వారా భద్రతతో కూడిన వార్షిక లక్ష్యాలను చేదించే దిశగా ప్రణాళిక సిద్ధం చేయడం జరుగుతుందని ఏరియా జీఎం ఎం.షాలెమ్ రాజు తెలిపారు.

ఈ సమావేశంలో జీఎంతో పాటు ఎస్.ఓ.టు జీఎం కోటిరెడ్డి, ఏజీఎం(సివిల్)రామకృష్ణ, డిజీఎం(ఐఈడి) యోహన్, ఏజీఎం (ఫైనాన్స్) బీబత్స, పీవీకే ఏజెంట్ రామ్ భరోస్ మెహతో, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ముక్కపాటి వెంకటేశ్వర్లు, డిజీఎం(ఈ అండ్ఎం) ఏరియా వర్క్ షాప్ క్రిస్టోఫర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఆర్.సి.హె.చ్.పి ఇంచార్జ్ ఆజ్మీరా శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున రావు, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఇతర విభాగాల అదికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరదలు, అటవీ, అగ్నిప్రమాదాల నియంత్రణపై టేబుల్ టాప్ ఎక్సయిజ్

## మే 18న బూర్గంపాడులో మాక్ ఎక్సజ్ నిర్వహణ



భద్రాద్రి కొత్తగూడెం, మే 15 (మనంప్రతినిధి): జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ (ఎన్డిఎంఏ) ఆధ్వర్యంలో వరదలు, అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణ, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై శుక్రవారం జిల్లా కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టేబుల్ టాప్ ఎక్సజ్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సీఆర్పీఎఫ్ కమాండెంట్ రితికేష్ ఠాగూర్, జిల్లా ఫైర్ అధికారి క్రాంతి కుమార్తో పాటు డీఎఫ్ఓ, పోలీస్, రెవెన్యూ, ఎస్డీఆర్ఎఫ్, సాగునీటి శాఖ, వైద్య ఆరోగ్య శాఖ మరియు ఇతర లైన్ డిపార్ట్మెంట్ల అధికారులు ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్డిఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బహాల్ మాట్లాడుతూ జిల్లాల్లో వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు లేదా ఇతర విపత్తులు సంభవించిన సమయంలో అధికార యంత్రాంగం వేగంగా, సమన్వయంతో స్పందించేందుకు ముందస్తు సిద్ధత ఎంతో అవసరమని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వరద ప్రభావిత ప్రాంతంగా గుర్తించబడిన నేపథ్యంలో వరదలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు, సహాయక చర్యలు, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై ఈ కాన్ఫరెన్స్లో విస్తృతంగా చర్చించారు. జిల్లాలో అటవీ అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాదాలు సంభవించిన సమయంలో వివిధ శాఖలు సమన్వయంతో ఎలా స్పందించాలి, అగ్నిమాపక చర్యలను ఎలా చేపట్టాలనే అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ నెల 18న బూర్గంపాడు మండలంలో నిర్వహించనున్న మాక్ ఎక్సజ్ను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఎన్డిఎంఏ ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. మాక్ డ్రిల్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

# సాహిత్యమే తెలంగాణ ఉద్యమానికి ఊపిరి

## ఘనంగా ఐదవరోజు విద్యా వారోత్సవాలు



ఖమ్మం, మే 15(మనం న్యూస్): సాహిత్యమే తెలంగాణ ఉద్యమానికి ఊపిరి గా నిలిచిందని ప్రముఖ కవి విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్ అన్నారు. ప్రజాపాలన-ప్రజాప్రణాళిక లో భాగంగా విద్యా వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో స్థానిక ఎస్ ఆర్ బి.జి.ఎన్.ఆర్ కళాశాల తెలుగు విభాగం -ఎన్.ఎస్.ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నాడు తెలంగాణ ఉద్యమం -సాహిత్యం అనే అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా అధ్యక్షతన జరిగిన విస్తృతోపన్యాసంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని సాహిత్య సాంస్కృతిక రంగమే పైలట్గా నిలిచిందన్నారు . ఖమ్మం లో జరిగిన తెలంగాణ రచయితల వేదిక సభలో తెలంగాణ సిద్ధాంత కర్త జయశంకర్ చెప్పిన రావెళ్ల వెంకటరామారావు రాసిన తెలంగాణ వీరులకు కాణాచిరా.. తొలిదశ ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందని చెప్పిన అంశాన్ని పునరుద్ఘాటించారు మలిదశ ఉద్యమానికి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ మాతృగీతంగా పేర్కొన్నారు ఉద్యమ సాహిత్యంలోభావజాలం ముఖ్యాంశంగా ఉంటుందన్నారు పాట వచన కవిత్వం,నవల నాటకం సినిమా అన్ని ప్రక్రియల్లో తెలంగాణ ఉద్యమ ప్రభావంతో అద్భుతమైన సాహిత్యం వెలువడిందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ ఏఎల్ఎన్ శాస్త్రి,డా.శ్రీనివాస్ తెలుగు విభాగాధిపతి కన్వీనర్ డా.పి.రవికుమార్ ,ఐ.క్యూ.ఏసి కోఆర్డినేటర్ డా.సునంద, విభాగ అధ్యాపకులు డా.జె.అనురాధ, డా.కిరణ్ కోటమ్మ, ఎం.వి.రమణ శ్రీనివాస్ పాటు ఎన్.ఎస్.ఎస్ పిఓలు డా.ఎం.పిచ్చయ్య, డా.ధర్మయ్య వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో కానిస్టేబుల్కు 30 ఏళ్ల జైలు శిక్ష..!

హైదరాబాద్,మే 15(మనం,ప్రత్యేక ప్రతినిధి) : హైదరాబాద్ నగర పరిధిలోని బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ లో నమోదైన పోక్సో కేసులో పోక్సో స్పెషల్ కోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఈ కేసులో దోషిగా తేలిన కానిస్టేబుల్ కు 30ఏళ్ల జైలు శిక్ష విధించడంతో పాటు బాధిత మైనర్ కు లక్ష రూపాలయ పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ వరదరాజ్పై పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడైన కానిస్టేబుల్ వరదరాజ్ సుదేశ్ ను పై నమోదు అత్యాచారం కేసులో నేరం రుజువైంది. దీంతో కానిస్టేబుల్ వరదరాజ్ సుదేశ్ కు 30 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ12వేల జరిమానా విధించింది. బాధితురాలికి 1లక్ష రూపాయలు పరిహారంగా ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.



# నవశకం ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు సన్మానం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబు

మధిర, మే15( మనం న్యూస్): మధిర పట్టణంలో రేక్రియేషన్ క్లబ్ నందు మధిర నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలలో ఉన్న అనాధ మరియు వృద్ధ ఆశ్రమాల నిర్వాహకులు మరియు వివిధ స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవను గుర్తించి నవశకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారికి ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రముఖ వైద్యులు డా.కోట రాంబాబు పాల్గొన్నారు. మధిర లో అనేక సేవా కార్యక్రమాలను చేస్తున్న నిర్వాహకులను అభినందించి వారికి ఘన సన్మానం చేసి మెమెంటో లను అందచేసారు. ఈ కార్యక్రమంలో మాధవరపు నాగేశ్వరరావు, పలు వార్డుల కౌన్సిలర్లు , మేకల రమేష్, మధిర మండల అధ్యక్షులు కూరపాటి సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల రమణగుప్త, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు వనమా కిరణ్, పుతుంబాక శ్రీ కృష్ణ ప్రసాద్, రామాలయం చైర్మన్ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు , నకిరికంటి గోవిందు, పాత్రికేయ మిత్రులు మరియు వివిధ హోదాలలో ఉన్న పెద్దలు పాల్గొన్నారు.

# 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు

- తప్పుడు వార్తలతో రైతుల్లో ఆందోళన సృష్టించవద్దు
- రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు...
- పూర్తి స్థాయిలో పంటను కొనుగోలు
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, మే 15(మనం బ్యూరో): ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.వివిధ దినపత్రికల్లో మే 15న శుక్రవారం రోజున మొక్కజొన్న కొనుగోలు, లిఫ్టింగ్లో జాప్యం జరుగుతోందంటూ ప్రచురితమైన వార్తలు అసంపూర్ణ సమాచారం ఆధారంగా ప్రచురించబడినవని జిల్లా కలెక్టర్ రిజాయిండర్ జారీ చేశారు. జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లా యంత్రాంగం, టీజీ మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో సజావుగా కొనసాగుతోందని తెలిపారు. యాసంగి సీజన్ 2025-26లో భారీ స్థాయిలో దిగుబడులు రావడంతో కొన్ని కొనుగోలు కేంద్రాల వద్ద లోడెడ్ వాహనాల కదలికలో తాత్కాలిక ఒత్తిడి ఏర్పడిందన్నారు. అధిక స్టాక్ నిల్వలు, పరిమిత అన్లోడింగ్ స్థలాల కారణంగా కొంత ఆలస్యం చోటుచేసుకున్నప్పటికీ, సమస్య పరిష్కారానికి యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు జరిగిందని, గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో కొనుగోళ్లు జరగలేదని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అదనపు రవాణా వాహనాలు ఏర్పాటు చేయడం, ప్రత్యామ్నాయ గోదాములు, నిల్వ కేంద్రాలు సిద్ధం చేయడం జరుగుతోందన్నారు.కొనుగోలు కేంద్రాల పనితీరును జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాల ప్రకారం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలో మొక్కజొన్న, వరి పంట పండించిన రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే తెలియజేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1077 ను ఏర్పాటు చేశామని, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యం, మొక్కజొన్న పంటకు ఎవరైనా కోతలు విధించిన లేక ఏ ఇతర సమస్య ఉన్న వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు అసత్య, అసంపూర్ణ వార్తలను నమ్మవద్దని, ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని ఆ రిజాయిండర్ లో స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన ఎస్పీ



సుజాతనగర్, మే 15 (మనం న్యూస్ ): సుజాతనగర్ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం సందర్శించి రైతులతో సమావేశమయ్యారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేసి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో గన్నీ బ్యాగులు, తార్పాలిన్ పట్టాలు, రవాణా వంటి అంశాల్లో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రైతులకు నష్టం కలగకుండా తెలంగాణ ప్రభుత్వం అన్ని శాఖల అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు.

శాంతిభద్రతల సమస్యలు లేకుండా కొనుగోలు కేంద్రాల వద్ద పోలీసులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. రైతులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులతో పాటు పోలీసులకు కూడా సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ఎస్పీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం గ్రేడింగ్ విధానం, కొనుగోలు ప్రక్రియను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులు తమ సమస్యలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఎం ఆర్ ఓ కృష్ణ ప్రసాద్, ఎస్పీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రమాదేవి, రవి, సొసైటీ చైర్మన్ వీర హనుమంతరావు, 21 వ డివిజన్ కార్పొరేట్ దంపతులు చింతలపూడి సాయికుమార్, శ్రావణి, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.



# ఒక్క మొక్క ఉంటే ఒట్టు !!

## తాలిపేరు కెనాల్స్ పై అటవీశాఖ కనికట్టు
## నీరు లేక ఎండిపోయిన ఎవెన్యూ ప్లాంట్ మొక్కలు
## తూతూ మంత్రంగా ఫెన్సింగ్ ఏర్పాటు
## స్థానికంగా దొరికిన మొక్కలు నాటిన వైనం
## రూ. 70 లక్షల హరిత నిధి నగదు వృధా?





చర్ల, మే 15 (మనం న్యూస్) : అటవీశాఖ అధికారుల ధన దాహానికి ప్రభుత్వ నిధులు వృదా అయ్యాయి. హరితనిధి ద్వారా తాలిపేరు ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాల్వలపై 2024 - 25 అర్థిక సంవత్సరంలో ఆరు వేల నాలుగు వందల మొక్కలను నాటడంతో పాటు వాటిని రెండేళ్ల పాటు నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది. మొక్కలను నాటడం, సంరక్షించడం, నీటి సరఫరాకు ప్రభుత్వం సుమారు కోటి రూపాయలను కేటాయించింది. నిర్వహణా లోపం కారణంగా 70 శాతంకు పైగా మొక్కలు చనిపోయాయి. అదికారులు ఏడాదిన్నరలోనే సుమారు రూ.70 లక్షలను ఖర్చు చూపినట్లు తెలుస్తోంది. ఇంత ఖర్చయినా మొక్కలు చనిపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతోంది. దీనిపై'మనం' అందిస్తున్న ప్రత్యేక కథనం ఏకాలంలోనైనా పచ్చదనం కనిపించి పకృతి ఆహ్లాదకరంగా ఉండేందుకు రాష్ట్ర అటవీశాఖ హరితనిధి పథకం ద్వారా చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్ట్ కుడి ఎడమ కాల్వలపై ఎవెన్యూ ప్లాంటేషన్ వేసేందుకు ఎంపిక చేసింది. ఇందుకు గాను చర్ల అటవీశాఖ రేంజ్ పరిధిలోని తేగడ సెక్షన్ పెద్దమిసిలేరు బీట్ పరిధిలోని పెద్దమిడిసిలేరు గ్రామం నుండి బట్టిగూడెం గ్రామం వరకు ఎనిమిది కిలోమీటర్ల మేర, చర్ల సెక్షన్ పరిధి చర్ల బీట్ పరిధిలోని తాలిపేరు ప్రాజెక్ట్ వద్ద నుండి సి కత్తిగూడెం గ్రామం వరకు గల మరో 8 కిలోమీటర్ల వరకు ఎవెన్యూ ప్లాంటేషన్ వేసారు. కుడి ఎడమ కాలువలకు ఇరువైపులా సుమారు 6,400 రావి, మర్రి, వేప, చక్రేసియా, మహాగని, పూసుగ, నెమలినార మొక్కలను నాటారు. వీటిని నాటడం మొదలుకొని మొక్కలకు రక్షణ కల్పించడం, నీరు పోసేందుకు గాను మూడేళ్ల కాల పరిమితికి ప్రభుత్వం సుమారు కోటి రూపాయల వరకు కేటయించినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఎవెన్యూ ప్లాంటేషన్ వేసేందుకు హైదరాబాదులోని అటవీశాఖ నర్సరీ నుండి మొక్కలను తేవాల్సి ఉంది. మొదటి సారి అక్కడి నుండి మొక్కలు తెచ్చినప్పటికీ అందులో ఎక్కువ భాగం చనిపోయాయి. దీంతో అప్పటి ఇన్ చార్జ్ రేంజ్ అధికారి భద్రాచలం డివిజనల్ అదికారి అక్రమానికి తెరలేపారు. ఇద్దరూ కుమ్ముక్కయి స్థానికంగా దొరికిన నాసిరకం మొక్కలను నాటారు. నిబంధనల ప్రకారం ఒక్కో మొక్క సుమారు రెండున్నర మీటర్ల ఎత్తు ఉండాల్సి ఉండగా ఇవేమి పట్టించుకోకుండా స్థానికంగా దొరికిన నాసిరకం మొక్కలను నాటినట్లు విమర్శలు వస్తున్నాయి. మొక్కలు నాటిన వెంటనే వాటికి రక్షణగా కొయ్యపాతి పక్కాగా ఫెన్సింగ్ వేయాల్సి ఉంటుంది. పక్కనే గల పత్తిచేలలో ఎండిపోయిన పత్తి మొక్కలు, అందుబాటులో ఉన్న పిచ్చి పుల్లలతో ఫెన్సింగ్ వేసారు. దీంతో వాటిని పశువులు తినడం, తొక్కివేయడం వంటి కారణాలతో సగం మొక్కలు చనిపోయాయి. మొక్కలకు వాటరింగ్ చేయాల్సి ఉండగా అడపాదడపా నీరు పోయడంతో మిగిలిన నీరు అందక మొక్కలు చనిపోయాయి. వీటి నిర్వహణ నిమిత్తం ఇద్దరు అధికారులు కలసి ఇప్పటి వరకు సుమారు 70 లక్షల నిధులను డ్రా చేసినట్లు తెలుస్తోంది. మొక్కల పెంపకంలో తప్పుడు లెక్కలను చూపి సగం సొమ్ము కాజేసినట్లు విమర్శలు వినవస్తు న్నాయి. కుడికాల్వపై మొక్కలు నాటిన కూలీలకు నగదు, ట్రాక్టర్ కిరాయి సైతం ఈ అధికారులు ఇవ్వకపోవడంతో ఒక క్రింది స్థాయి ఉద్యోగి తల తాకట్టు పెట్టి చెల్లించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చి సొమ్ము కాజేసిన ఇద్దరు అధికారు లపై సమగ్ర విచారణ చేస్తే మరిన్ని నిజాలు భయటప డతాయని ప్రజలు కోరుతున్నారు. దుర్వినియోగం అయిన నిధులను వారి వద్ద నుండి రికవరీ చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



# విద్యాదాన్ స్కాలర్షిప్కు దరఖాస్తు చేసుకోండి

- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా

ఖమ్మం, మే 15(మనం న్యూస్): ఇంటర్, పాలిటెక్నిక్లలో మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందే విద్యార్థుల కోసం సరోజిని దామోదర్ ఫౌండేషన్ వారు అందిస్తున్న 'విద్యాదాన్' స్కాలర్షిప్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదవ తరగతిలో 90% సాధించి, సంవత్సర ఆదాయం 2 లక్షలు కలిగిన వారు ఈయొక్క స్కాలర్షిప్ లు పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. వెబ్సైట్ నందు జూన్ 20 వ తేదీలోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలని అన్నారు. అర్హులైనవారికి జులై 5, వ తేదీన ఆన్లైన్లోపరీక్ష మరియు ఇంటర్వ్యూ నిర్వహించ బడుతుందని దీంట్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రతి ఏటా 10 వేల నుండి 75 వేలు డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి ఉన్నత చదువు పూర్తి అయ్యేంత వరకు ఈ స్కాలర్షిప్ లు అందుతాయని, అన్నీ కులాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8520860785, 9663517131అనే నంబర్ను సంప్రదించాలని సూచించారు.

మనం Manam Mahabubnagar
మహబూబ్ నగర్

# ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లు

- జూన్ 1 నుంచి అమలులోకి
- ఎపిఎస్ పిడిసిడిఎల్ పరిధిలో 1.17 లక్షల ప్రీ-పెయిడ్ మీటర్లు

**తిరుపతి, మే 15మనం న్యూస్:** ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు మెరుగైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ఆ సంస్థ కృషి చేస్తోంది. సంస్థ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర సర్వీసులకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల విద్యుత్ వినియోగం, బిల్లింగ్లో పాదర్శకతను పెంపొందించేందుకు వీలుగా స్మార్ట్ మీటర్లను ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లుగా మార్చాలని సంస్థ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల బకాయిల ఉపశమనంతోపాటు విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ కొనుగోలు సామర్థ్యంపై ఒత్తిడిని అధిగమించేందుకు ప్రీ-పెయిడ్ మీటర్లను తప్పనిసరిగా అమర్చాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా సంస్థ ఈ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ప్రీ-పెయిడ్ మీటరింగ్ ద్వారా విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవడం, విద్యుత్తు పొదుపు, బిల్లును ఆదా చేసుకునేందుకు అవకాశం వుంటుంది. అంతేకాకుండా ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారుల్లో జవాబుదారీతనం మరింత పెరుగుతుంది.ఈ యేడాది జూన్ 1వతేదీ నుంచి ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లను అమలులోకి తీసుకువచ్చేందుకు సంస్థ అవసరమైన చర్యలు తీసుకుంటోంది. సంస్థ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు/మున్సిపాలిటీలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర సర్వీసులకు సంబంధించి నెల్లూరు జిల్లాలో 17,067, తిరుపతి 19,545, చిత్తూరు 14,622, అన్నమయ్య 14,346, కడప 16,261, అనంతపురం 8,422, శ్రీ సత్యసాయి 7,002, కర్నూలు 10,603, నంద్యాల జిల్లాలో 9,945, సర్వీసులు ఈ ప్రీ-పెయిడ్ విధానంలోకి మారుతున్నాయి.

ఈ మొత్తం 1.17 లక్షల సర్వీసుల్లో సింగిల్ ఫేజ్ సర్వీసులు 91,306, త్రీఫేజ్ సర్వీసులు 26,507 వున్నాయి. ఈ సర్వీసులన్నింటినీ కొన్ని గ్రూపులుగా ఏర్పాటు చేసి, ఈ-వాలెట్ ద్వారా రీచార్జ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించడం జరుగుతోంది. ఆయా విభాగాలు బిల్లింగ్ సైకిల్ కు సంబంధించిన విద్యుత్ చార్జీలు, స్థిర చార్జీల అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించాల్సి వుంటుంది. ప్రతినెలా 5వతేదీలోగా ఆయా సంస్థలు చెల్లించాల్సిన అడ్వాన్స్ మొత్తం వివరాలను విద్యుత్ పంపిణీ సంస్థలు ఆర్థిక శాఖకు తెలియజేయాల్సి వుంటుంది. రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఎపిఇఆర్సి) ఆమోదించిన యూనిట్ ధరల ప్రకారం ప్రీ-పెయిడ్ విధానం ద్వారా రోజువారీ విద్యుత్ వినియోగ చార్జీలను బ్యాలెన్స్ నుంచి మినహాయించడం, ఆ బ్యాలెన్స్ నిర్దిష్ట కనిష్ట పరిమితి దిగువకు చేరిన వెంటనే సంబంధిత అధికారులకు ఈ-మెయిల్/ఎస్ఎంఎస్ రూపంలో సమాచారాన్ని తెలియజేయడం జరుగుతుంది. బ్యాలెన్స్ సున్నాకు చేరినపుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకే ప్రీ-పెయిడ్ మీటర్లు:


ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి శివశంకర్‌లోతేటి

ఎపిఎస్ పిడిసిఎల్ పరిధిలోని 9 జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగం పట్ల జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకే ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని ఆ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. సంస్థ పరిధిలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపాలిటీలు/కార్పొరేషన్లు, వాటర్ వరక్స్ తదితర ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల నుంచి రూ.9,507 కోట్ల బకాయిలను ఎపిఎస్పిడిసిఎల్ కు చెల్లించాల్సి వుంది. ఈ బకాయిల చెల్లింపు, భవిష్యత్తులో విద్యుత్తు వినియోగంలో పారదర్శకతను పెంపొందించడం, విద్యుత్ బిల్లును ఆదా చేయడంతోపాటు విద్యుత్ వినియోగాన్ని నియంత్రించుకునేందుకు ప్రీ-పెయిడ్ మీటర్లు ఉపయోగపడుతాయి. మొబైల్ రీచార్జ్ తరహాలోనే ఈ-వాలెట్ ద్వారా ప్రీ-పెయిడ్ మీటర్లను రీచార్జ్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

## పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- డిఇఓ,రాజేంద్రప్రసాద్

**చిత్తూరు మే 15మనం న్యూస్:** జిల్లాలో ఈనెలలో నిర్వహించనున్న ఎస్.ఎస్.సి అడ్వానస్డ్ సప్లిమెంటరీ పరీక్షలు,ఏపీఓఎస్ఎస్, ఎస్.ఎస్.సి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో గుర్తించబడిన పరీక్షా కేంద్రాలలో మే 25 నుండి జూన్ 4వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.భౌతిక శాస్త్రం,జీవశాస్త్రం పరీక్షలు ఉదయం 09.30 గంటల నుండి 11.30 గంటల వరకు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

**జిల్లాలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ సి అడ్వానస్డ్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాలు:**

జిల్లాలో మొత్తం 32 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు. చిత్తూరు మండలంలో డా. వరదప్ప నాయుడు మున్సిపల్ హైస్కూల్, విజ్ఞాని దీప్తి హైస్కూల్, నారాయణ ఈఎంహెచ్ఎస్, శ్రీ చైతన్య ఈఎం హైస్కూల్, ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, కంఫర్ట్ ఈఎంహెచ్ఎస్, గండ్లపల్లె మున్సిపల్ హైస్కూల్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. అలాగే ఎస్.ఆర్.పురం, బంగారుపాళ్యం, పలమనేరు, బైరెడ్డిపల్లె, వి.కోట, రామకుప్పం, రాళ్లబుడుగూరు, కుప్పం, పుంగనూరు, చౌడేపల్లె, కార్వేటినగరం, నగరి మరియు పులిచెర్ల మండలాల్లో కూడా పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**ఏపీఓఎస్ఎస్ ఎస్ ఎస్ సి సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాలు:**

ఏపీఓఎస్ఎస్ ఎస్.ఎస్.సి సప్లిమెంటరీ పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 13 కేంద్రాలుఏర్పాటు చేయగా, చిత్తూరు, నగరి, పలమనేరు, పుంగనూరు, కుప్పం, పులిచెర్ల ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే ఏపీఓఎస్ఎస్ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల కోసం మొత్తం 7 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిత్తూరు, జి.డి.నెల్లూరు, నగరి, పలమనేరు, పుంగనూరు మరియు కుప్పం ప్రాంతాల్లో ఈ కేంద్రాలు పనిచేయనున్నాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. హాల్టికెట్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో నిషేధిత వస్తువులు తీసుకురాకూడదని, పరీక్షా నియమావళిని కచ్చితంగా పాటించాలని కోరారు. జిల్లాలోని విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ప్రజలకు పరీక్షల తేదీలు, సమయాలు మరియు కేంద్రాల వివరాలపై అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

## 5వ విడత రీసర్వే గ్రౌండ్ ట్రూతింగ్ ,ఈ-కేవైసీ పనులను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలన

- జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు




**తిరుపతి మే 15 మనం న్యూస్:** సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో తడ మండలం పూడి గ్రామంలో జరుగుతున్న 5వ విడత రీసర్వే గ్రౌండ్ ట్రూతింగ్ మరియు ఈ-కేవైసీ పనులను సూళ్లూరుపేట ఆర్డీవో దేవేందర్ రెడ్డి తో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించి, భూ వివరాలు, సరిహద్దులు, రికార్డుల ధృవీకరణ వంటి అంశాలను అధికారులతో సమీక్షించారు. గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అలాగే ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తెలిపారు. రీసర్వే ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైన కార్యక్రమమని పేర్కొన్న జాయింట్ కలెక్టర్, ప్రతి వివరాన్ని ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, గ్రామ స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## గోమాతల పరిరక్షణలో దాతల సహకారం ప్రశంసనీయం

- టిటిడి జేఈవో డా. ఎ. శరత్
- అకాల వర్షాల నుండి ఎండుగడ్డిని సంరక్షించాలి

**తిరుపతి మే15 మనం న్యూస్:** టిటిడి ఎస్వీ గోశాలకు భక్తులు, దాతలు విరాళంగా అందించిన 180 లారీల ఎండుగడ్డిని అకాల వర్షాల నుండి రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని టిటిడి జేఈవో (వైద్యం విద్య) డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అధికారులతో కలిసి ఎస్వీ గోశాలను పరిశీలించిన ఆయన, గోవుల సంరక్షణ, ఎండుగడ్డి నిల్వలు, మౌలిక సదుపాయాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా గోమాతల సేవలో భాగంగా ఎండుగడ్డి దానాన్ని అందించిన టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, నెహ్రూ ఫౌండేషన్, శ్రీనివాస సేవా ట్రస్ట్ ఛైర్మన్ టి. సత్యనారాయణలను జేఈవో ప్రత్యేకంగా అభినందించారు. గోసంరక్షణ మహోన్నతమైన ధార్మిక సేవ అని పేర్కొంటూ, గోవుల పరిరక్షణకు మరింత మంది దాతలు ముందుకు వస్తే టిటిడి సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు.



గోశాలకు దానంగా వచ్చిన ఎండుగడ్డిని శాస్త్రీయ విధానంలో విభజించి నిల్వ చేయాలని, వర్షాల ప్రభావం లేకుండా టార్పాలిన్ కవర్లతో భద్రపరచాలని అధికారులకు సూచించారు. గోవులకు ఎటువంటి ఆహార కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పరిశీలన**

టిటిడి ఆధ్వర్యంలో స్వదేశీ ఆవుల జన్యు పరిరక్షణ, అభివృద్ధి లక్ష్యంగా నిర్మాణంలో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జేఈవో సూచించారు. సెంటర్ పూర్తయిన అనంతరం పాలు ఇచ్చే ఆవుల సంఖ్య, భవిష్యత్తులో అవసరమయ్యే పాల ఉత్పత్తి సామర్థ్యం, పాలు సేకరణ, నెయ్యి తయారీ, పెరుగు-మజ్జిగ పంపిణీ, మానవ వనరుల వినియోగం తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పూర్తయితే ప్రతి షెడ్లో 250 ఆవుల సామర్థ్యంతో గోవులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. అలాగే గోవుల మేటర్నిటీ షెడ్, ఆధునిక మిల్కింగ్ పార్లర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎస్వీ గోశాల డైరెక్టర్ డా. ఏవీఎన్ శివకుమార్, డిఈ దామోదర్, మేనేజర్లు మృదుల, గౌరి, అసిస్టెంట్ డైరెక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనుల నిర్మాణం కొరకు మాస్టర్ ప్లాన్




- కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి, మే 15 మనం న్యూస్:** తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికు వచ్చు భక్తుల సౌకర్యం కొరకు రాక పోకలు సజావుగా ఉండేలా ట్రాఫిక్ సమస్య తీర్చుట కొరకు మాస్టర్ ప్లాన్ లో భాగంగా తిరుచానూరు రోడ్డు విస్తరణ, పార్కింగ్ కు సంబంధించిన పనుల పై టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సి వి ఎస్ ఓ మురళి కృష్ణ తో కలిసి తుడా, టిటిడి వారు తయారు చేసిన మాస్టర్ ప్లాన్ ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్.. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలు, సాధారణ రోజుల్లో కూడా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని ఎక్కువ శాతం భక్తులు దర్శించుకుంటారని తెలిపారు. అందులో భాగంగానే తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికు వచ్చు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఉండేందుకు ఆలయ పరిసరాలలో రద్దీని తగ్గించేందుకు భక్తులకు మెరుగైన దర్శన అనుభూతి కలిగించేలా రోడ్డు నిర్మాణా, పార్కింగ్ పనులను చేపట్టాలని తెలిపారు. రోడ్డు నిర్మాణం, పార్కింగ్ పనులు చాలా ముఖ్యమైనవి అనీ ప్రణాళిక బద్ధంగా పనులు పూర్తి కావాలన్నారు. టిటిడి జేఈవో, తుడా సిపిఓ రోడ్డు నిర్మాణం, పార్కింగ్ కు సంబంధించి సుదీర్ఘంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ప్లాన్ గురించి జిల్లా కలెక్టర్ కు విపులంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంచార్జీ కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అడిషనల్ ఎస్పీ రవి మనోహరచారి, తిరుపతి ఆర్టీవో రామ్మోహన్, ఏ డి సర్వేయర్ అరుణ్ కుమార్, సూపర్డెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, ఆర్ అండ్ బి ఎస్ ఈ సుధాకర్ నాయక్, తుడా ఎస్ఈ రవీంద్ర, తుడా సి పి ఓ దేవి , టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు, పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలు

- వాహనసేవలతో పాటు భక్తులకు మూలమూర్తి దర్శనం కల్పించాలి
- జేఈవో వి. వీరబ్రహ్మం



**తిరుపతి(టిటిడి),మే 15,మనం న్యూస్:** తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించాలని టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం ఆలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ మే 23న ధ్వజారోహణంతో ప్రారంభమై, మే 31న ధ్వజావరోహణంతో ముగియనున్న బ్రహ్మోత్సవాలకు రాజీలేని విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు వాహనసేవలతో పాటు మూలమూర్తి దర్శనం సైతం సాఫీగా కల్పించేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక పుష్పాలంకరణలు, ఇంజినీరింగ్ విభాగం ద్వారా క్యూలైన్లు, చలువపందిళ్లు, కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ విభాగం ఆధ్వర్యంలో ఆలయం పరిసరాలను దేదీప్యమానంగా విద్యుద్దీపాలతో అలంకరించడంతో పాటు ఆర్చీలు, కటౌట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాలలో అవసరమైనంత మంది శ్రీవారి సేవకులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాలల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు, వాహనసేవల ముందు భజనలు, కోలాటాలు నిర్వహించి భక్తులను ఆధ్యాత్మిక వాతావరణంలో ముంచెత్తాలని సూచించారు. అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని ఆరోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా టిటిడి విజిలెన్స్, పోలీస్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈవో శ్రీమతి వి.ఆర్. శాంతి, విజివో గిరిధర్, ఏఈవో నారాయణ చౌదరి, అదనపు ఆరోగ్య అధికారి డా.సునీల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష

- రూ.3లక్షల జరిమానా
- తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి

**తిరుపతి మే15 మనం న్యూస్:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ హెడ్ ఎల్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 27/2019 కేసులో ఈ ముద్దాయి తిరుపతి-చెన్నై రోడ్ లోని గాజులమండ్యం జంక్షన్ వద్ద



అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, వేలూరు జిల్లా ఆర్కాట్ తాలూకా,మొస్సూర్ పాళ్యం గ్రామానికి చెందినవాడు, కాగా ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 3లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ కులశేఖర్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.

## పెట్రోలు కొనలేం.. ఇక మాకు సైకిలే దిక్కు



వాహనానికి కర్ర కట్టి మోసుకెళ్తూ

**సైకిల్ తొక్కుతూ వినూత్న నిరసన తెలిపిన సిపిఎంనేతలు**

**తిరుపతి. మే15 మనం న్యూస్:** పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నేడు శుక్రవారం సాయంత్రం సిపిఎం కార్యాలయం నుంచి సుందరయ్య నగర్ సర్కిల్ వరకు వినూత్న నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెరుగుతున్న ఇంధన ధరలతో ఇక వాహనానికి పెట్రోలు కొనలేని పరిస్థితి వచ్చిందని, సామాన్యుడు బండి నడపడం భారంగా మారిందని తెలియజేస్తూ వాహనానికి కర్ర కట్టి మోసుకెళ్తూ, మరోవైపు సైకిల్ తొక్కుతూ నిరసన తెలిపారు. పెట్రోలు కొనలేం.. బండి నడపలేం, ఇక మాకు సైకిలే దిక్కు, ధరలు తగ్గించాలి అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా ప్రజలపై భారాలు పెంచుతోందని విమర్శించారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతున్నాయని, దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు జీవనం మరింత కష్టంగా మారిందన్నారు. రైతులు, ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులు, కార్మికులపై ఈ భారం తీవ్రంగా పడుతోందని తెలిపారు.

## చెరువు మట్టిని యదేచ్ఛగా దోచేస్తున్న మట్టి మాఫియా

- అధికారుల మౌనం వెనుక రాజకీయ అండా..? అవినీతి నీడలా..?
- అక్రమాలను బయటపెడుతున్న జర్నలిస్టులపై దౌర్జన్యాలు

**గంగాధర నెల్లూరు, మే-15 మనం న్యూస్:** వినాయకపురం - కార్వేటినగరం పరిధిలోని చినపబ్బనాయుడు కండ్రిగ సరిహద్దు చెరువులో జరుగుతున్న అక్రమ మట్టి తరలింపు వ్యవహారం రోజురోజుకు తీవ్రమవుతోంది. గత మూడు రోజులుగా భారీ టిప్పర్లు, ట్రాక్టర్ల సహాయంతో రాత్రింబవళ్లు చెరువు మట్టిని యథేచ్ఛగాతరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లుగావ్యవహరిస్తుండటం స్థానికుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది.గ్రామస్తుల ఆరోపణల ప్రకారం ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే చెరువు ప్రాంతంలో భారీ స్థాయిలో మట్టితవ్వకాలుకొనసాగుతున్నాయి. చెరువు భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేలా జరుగుతున్న ఈ తవ్వకాల వల్ల భూగర్భ జలాలు దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించే ఈ చర్యలను అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం మౌనంగా ఉండడం అనుమానాలకు తావిస్తోంది.రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలకు పలుమార్లు సమాచారం అందించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం ప్రజలను మరింత ఆవేదనకు గురిచేస్తోంది. ఇంత బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు..? రాజకీయ అండదండలున్నాయా..? లేక అధికారులే అవినీతికి పాల్పడుతున్నారా..? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే ఈ అక్రమాలను వీడియోలతో సహా ప్రజల ముందుకు తీసుకువస్తున్న జర్నలిస్టులు, న్యూస్ ఛానళ్ల ప్రతినిధులపై ఒత్తిళ్లు, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాణాలకు తెగించి ఆధారాలతో అక్రమాలను బయటపెడుతున్న మీడియాపై దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి మచ్చగా స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



## రీ సర్వే తప్పులు జరగకుండా పారదర్శకంగా రీ సర్వే పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు మే 15మనం న్యూస్:** గ్రామాలలో జరిగే రీ సర్వేలో తప్పులు జరగకుండా పారదర్శకంగా రీ సర్వే పూర్తి చేయాలని, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబందితఅధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు పలమనేరు నియోజకవర్గానికి సంబందించిన పెద్దపంజాని, గంగవరం, బైరెడ్డిపల్లి, వీకోట, పలమనేర్ వివిధ మండలాలలో గ్రామాలకు సంబంధించిన రి సర్వే పై సమీక్షించారు, అనంతరం పెద్దపంజాణి మండలంలోనివీరప్పపల్లి, గనకొండ, బొమ్మరాజుపల్లి, కొల్లత్తురు, నెలపల్లి గ్రామాలకు సంబందించిన రీ సర్వే అమలు పై జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ రాజేంద్రన్, పలమనేరు ఆర్. డి. ఓ భవానీ, సర్వేయర్ డి. డి జయరాజ్, మండల సర్వేయర్లు, వి. ఆర్. ఓ లు తదితరులతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల లోని భూ సమస్యలు పరిష్కరించడా లో మండల సర్వేయర్లు, వి ఆర్ ఓ లు ప్రముఖ పాత్ర పోషించాలని ఆదేశించారు. ఈ కేవైసీ యాప్ ద్వారా తప్పనిసరిగా చేయాలని గ్రామ సర్వేయర్లకు ఆదేశించారు.

గ్రామాలలో రాజకీయాలు పక్కన పెట్టి పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పలమనేరు డివిజన్ నందు ప్రతి ఒక సర్వే నెంబర్లపై సమగ్రంగా అవగాహన కలిగి ఉండాలని పలమనేర్ ఆర్ డి ఓ, డి ఐ ఓ ఎస్ ఆదేశించారు, వివిధ గ్రామాలలో జరిగే రీసర్వే కార్యక్రమం ఆర్డీవో పర్యవేక్షణ కలిగి ఉండాలని ఆదేశించారు.వి. ఆర్. ఓ లాగిన్ సర్వేయర్ లాగిన్ఎప్పటికప్పుడు పరిశీలి ంచుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి. ఐ. ఓ. ఎస్ రమణా రెడ్డి, ఏ. డి పుల్లయ్య , ఆయా మండల సర్వేయర్లు రెవెన్యూ డిప్యూటీ తహశీల్దారులు ఆయా గ్రామాలకు సంబందించిన వి. ఆర్. ఓ లు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో అదానీపై కేసుల ఉపసంహరణ?



**వాషింగ్టన్,మే 15:** అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీపై నమోదైన కేసులను రద్దు చేసుకోవడానికి అమెరికా న్యాయశాఖ ప్రయత్నాలు ప్రారంభించినట్లు బ్లూమ్‌బర్గ్, ద న్యూయార్క్ టైమ్స్ తదితర అంతర్జాతీయ పత్రికలు కథనాలు ప్రచురించాయి. ఈ వారాంతంలోగా దీనిపై అధికారిక ప్రకటన వెలువడొచ్చు. దీనితో పాటు 2024 నవంబరులో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) దగ్గర నమోదైన కేసునూ మూసేసే అవకాశముంది. అమెరికాలో భారీ పెట్టుబడి పెట్టేందుకు అదానీ సంస్థల తరఫు న్యాయవాది ప్రతిపాదించడంతో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నట్లు 'ద న్యూయార్క్ టైమ్స్' ఎక్స్‌లో పేర్కొంది.

# 'హర్మూజ్'ను దాటిన 2 భారత ఎల్పీజీ నౌకలు

**ఢిల్లీ ,మే 15 :** ఎల్పీజీని భారత్‌కు రవాణా చేస్తున్న రెండు ట్యాంకర్ నౌకలు సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటాయని అధికారులు గురువారం వెల్లడించారు. దీంతో పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన నాటి నుంచీ జలసంధిని దాటి భారత్‌కు చేరిన సరకు రవాణా నౌకల సంఖ్య 13కు చేరింది. ఎల్పీజీతో నిండిన ట్యాంకర్ నౌక సైమి బుధవారం జలసంధిని దాటగా, ఎన్వీ సన్‌షైన్ అనే మరో ట్యాంకర్ గురువారం సంక్షుభిత జలాలను దాటింది. పశ్చిమాసియాలో జరిగిన మరో ఘటనలో సోమాలియా నుంచి షార్జాకు వెళ్తున్న ''హాజీ అలీ'' అనే భారతీయ ఢౌ నౌక ఒకటి ఒమాన్ సముద్ర జలాల్లో బుధవారం దాడికి గురై మునిగిపోయిందని కేంద్ర రేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగల్ ప్రకటించారు. దాడికి బాధ్యులెవరన్నది ఆయన వెల్లడించలేదు. అయితే హాజీ అలీలో ప్రయాణిస్తున్న 14 మంది సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారని ఆయన తెలిపారు.

సిబ్బందిని ఒమాన్‌లోని డిబ్బా రేవుకు తరలించారని, త్వరలో వారు భారత్ చేరుకుంటారని వివరించారు. జలసంధి దిగ్బంధనంపై కొనసాగుతున్న చర్చల ప్రతిష్టంభన నేపథ్యంలో భారతీయ ఎల్పీజీతో కూడిన ట్యాంకర్ నౌకలు జలసంధిని సురక్షితంగా దాటుకోవడం గమనార్హం. సైమి, ఎన్వీ సన్‌షైన్ ట్యాంకర్ నౌకలు తమ ట్రాన్స్‌పాండర్లను పూర్తిగా ఆపివేసిన కారణంగా జలసంధి నుంచి బయటపడగలిగాయని ముకేశ్ మంగల్ తెలిపారు. దాదాపు 19,965 టన్నుల ఎల్పీజీ కలిగివున్న సైమి ట్యాంకర్ ఈనెల 16 నాటికి గుజరాత్‌లోని కాండ్లా రేవును చేరనుంది. ఈ నౌక మార్షల్ దీవులకు చెందినది. అలాగే వియత్నాంకు చెందిన ఎన్వీ సన్‌షైన్ 46,427 టన్నుల ఎల్పీజీతో ఈనెల 18న మంగళూరు రేవును చేరుకుంటుంది. ఈ రెండు నౌకల్లోని వంటగ్యాసు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందినదని అధికారులు తెలిపారు. ఒమన్ తీరానికి సమీపంలోని సముద్ర జలాల్లో భారత వాణిజ్య నౌక ''హాజీ అలీ''పై జరిగిన దాడిని విదేశాంగ శాఖ ఖండించింది.

**30 చైనా నౌకలకు అనుమతి**

హర్మూజ్ నుంచి చైనాకు చెందిన 30 నౌకలకు ఇరాన్



అనుమతినిచ్చింది. జలసంధి నిర్వహణ విధానాలకు అనుగుణంగా బుధవారం నుంచి చైనాకు చెందిన నౌకల సముద్రయానానికి అనుమతి మంజూరు చేసినట్టు ప్రకటించింది. మరోవైపు జలసంధి అన్ని రకాల వాణిజ్య నౌకల ప్రయాణం కోసం తెరిచే ఉంచామని, అయితే ఈ జలమార్గం గుండా పయనించే నౌకలు తమ నావికాదళానికి సహకారం అందించాల్సి ఉంటుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు.


## అ'సాధారణ' ప్రసవం..
## 5 రోజుల్లో నలుగురికి జన్మ..!



**లఖ్‌నవూ , మే 15 :** వైద్యరంగంలోనే అసాధారణ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో చోటుచేసుకుంది. మొరాదాబాద్‌లోని తీర్థంకర్ మహావీర్ యూనివర్సిటీ ఆస్పత్రిలో అమీనా అనే మహిళ నలుగురికి జన్మనిచ్చింది. వీరిలో ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. అయితే, ఈ నలుగురు శిశువులకు ఐదు రోజుల వ్యవధిలో ఆమె జన్మనిచ్చినట్లు వైద్యులు వెల్లడించారు. సాధారణంగా ఇటువంటి ప్రసవాలకు సిజేరియన్ శస్త్రచికిత్స అవసరమవుతుందని అయితే ఆ నాలుగూ సాధారణ ప్రసవాలే కావడం అసాధారణమని ఆశ్చర్య వ్యక్తంచేశారు. తల్లి, నవజాత శిశువులు వైద్య పర్యవేక్షణలో ఉన్నారని, వారి పరిస్థితి మెరుగ్గా ఉందని పేర్కొన్నారు.

అమీనా గర్భం దాల్చిన అనంతరం చేసిన అల్ట్రాసౌండ్ స్కాన్‌లలో నాలుగు పిండాలు ఉన్నట్లు నిర్ధరణ కావడంతో ఆమె ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఇందులోభాగంగా ప్రసవించే సమయంలో ఇబ్బంది కాకుండా ఉండేందుకు పిండాల సంఖ్యను తగ్గించుకోవాలని సూచించామన్నారు. కానీ ఆమె కుటుంబసభ్యులు నాలుగు గర్భాలనూ కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆమెకు మే 8న మొదటిసారి నొప్పులు రావడంతో మే 9న తన మొదటి కుమారుడికి జన్మనిచ్చింది. కాన్పు కష్టం కావడంతో మిగిలిన ప్రసవాలను వైద్యులు వాయిదా వేశారు. ఐదు రోజుల తరువాత మే 14న ఆమెకు మళ్లీ నొప్పులు రావడంతో ఆస్పత్రికి తీసుకురాగా ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది.

# సుప్రీంకోర్టు పొదుపు చర్యలు



**ఢిల్లీ ,మే 15 :** పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఇంధనం వాడకాన్ని తగ్గించుకోవాలని దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుప్రీం కోర్టు కూడా పొదుపు చర్యలు చేపట్టింది. వారానికి రెండు రోజులు (సోమ, శుక్రవారం) పూర్తి స్థాయిలో వర్చువల్ విధానంలో విచారణ జరపాలని నిర్ణయించింది. అంతేకాదు, మంగళవారం నుంచి గురువారం వరకు హైబ్రిడ్ విధానంలో విచారణ చేపడతామని, కక్షిదారులు వీలును బట్టి ఎలాగైనా పాల్గొనవచ్చని పేర్కొంది. ఈ మేరకు సుప్రీం కోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేసింది.

కొత్త ఏర్పాట్ల ప్రకారం.. ఇంధనం పొదుపులో భాగంగా న్యాయమూర్తులు కూడా కార్ పూలింగ్‌ను ప్రోత్సహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సుప్రీం కోర్టు వెల్లడించింది. రోజువారీ కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకోవడంతో పాటు ప్రతి రిజిస్ట్రీ లేదా సెక్షన్‌లోని 50 శాతం సిబ్బందికి వారానికి గరిష్ఠంగా రెండు రోజులు వర్క్-ఫ్రం-హోమ్‌కు అనుమతించాలని సూచించింది.

# ఉన్నావ్ అత్యాచార కేసు..
# కుల్‌దీప్ సెంగర్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ

**ఢిల్లీ ,మే 15 :** ఉన్నావ్ అత్యాచారం కేసులో జీవితఖైదు పడిన బీజేపీ బహిష్కృత నేత కుల్‌దీప్ సెంగర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సెంగర్ జైలు శిక్షను నిలిపివేస్తూ గతంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తాజాగా అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై మరోసారి విచారణ జరపాలని హైకోర్టును సుప్రీం ధర్మాసనం ఆదేశించింది.



ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ , జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా తనను దోషిగా తేల్చడం, యావజ్జీవ కారాగార శిక్ష విధించడంపై సెంగర్ వేసిన అప్పీల్‌ను రెండు నెలల్లోగా పరిష్కరించాలని హైకోర్టును ఆదేశించింది. ఒకవేళ దోషిగా తేల్చడంపై నిర్ణయం తీసుకోలేకపోతే యావజ్జీవ శిక్షను నిలిపివేయాలని కోరుతూ అతడు దాఖలు చేసిన పిటిషన్‌పైనా ఉత్తర్వులు ఇవ్వాలని తెలిపింది. ఈ కేసు అర్హతలపై తాము ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయడం లేదని, హైకోర్టు కొత్తగా విచారణ కొనసాగించవచ్చని పేర్కొంది. పోక్సో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఒక ఎమ్మెల్యేను ప్రభుత్వ ఉద్యోగిగా పరిగణించవచ్చా, లేదా అనే అంశాన్ని కూడా పునఃపరిశీలించాలని సీజేఐ హైకోర్టుకు సూచించారు.

2017లో ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడ్డారని కుల్‌దీప్ సెంగర్‌పై అభియోగాలు నమోదయ్యాయి. దీనిపై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. సెంగర్‌ను దోషిగా తేలుస్తూ జీవితఖైదు విధించింది. ఆ తర్వాత సుప్రీం ఆదేశాలతో ఈ కేసు ఉత్తరప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ అయ్యింది. దీనిపై గతేడాది చివర్లో విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు సెంగర్ శిక్షను నిలిపివేస్తూ తీర్పు వెలువరించింది. కోర్టు తీర్పును బాధితురాలి తరఫు న్యాయవాదులు, సీబీఐ అధికారులు సుప్రీంలో సవాల్ చేశారు. దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం సెంగర్ విడుదలపై స్టే విధించింది. తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది.

# భోజ్‌శాల ఆలయం హిందువులదే
## మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు

**ధార్ ,మే 15 :** దశాబ్దాలుగా కొనసాగుతున్న మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలోని వివాదాస్పద భోజ్‌శాల/కమల్ మౌలా ఆలయ వివాదంలో అక్కడి హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ వివాదాస్పద స్థలం ఆలయానికే చెందుతుందని ఇండోర్ ద్విసభ్య ధర్మాసనం హిందూ పిటిషనర్లకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ ఆలయాన్ని పురావస్తుశాఖ అధీనంలోకి తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఆలయంలో సరస్వతి విగ్రహం ఏర్పాటుచేసుకోవచ్చని కేంద్రానికి సూచించింది.



ఈ ప్రదేశంలో ఎన్నోఏళ్ల పాటు దైవ ఆరాధన కొనసాగినట్లు భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) చేసిన సర్వేలో తేలిందని ధర్మాసనం పేర్కొంది. పారమార వంశానికి చెందిన రాజా భోజ్‌తో సంబంధం ఉన్న సంస్కృత విద్యాకేంద్రంగా ఇది ఉండేదని పలు చారిత్రక అంశాలు రుజువు చేస్తున్నాయని పేర్కొంది. మసీదుకు ప్రత్యామ్నాయ స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని ధర్మాసనం ముస్లిం వర్గాలకు సూచించింది. ఇండోర్ ధర్మాసనం తీర్పు నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

భోజ్‌శాల ఆలయ వివాదం దశాబ్దాలుగా కొనసాగుతోంది. భోజ్‌శాలలోని మధ్యయుగం నాటి పవిత్రస్థలాన్ని హిందూవులు వాగ్దేవి (సరస్వతి) దేవాలయంగా భావిస్తారు. ముస్లింలు దాన్ని కమల్ మౌలా మసీదుగా వ్యవహరిస్తుంటారు. 2003 ఏఎస్ఐ (అఖిఐ) ఒప్పందం ప్రకారం, హిందువులు మంగళవారాల్లో, ముస్లింలు శుక్రవారాల్లో ప్రార్థనలు కొనసాగిస్తున్నారు. అయితే ఈ ప్రదేశంలో ఆరాధన కోసం ప్రత్యేక హక్కులు కోరుతూ హిందూ వర్గం ఈ ఒప్పందాన్ని హైకోర్టులో సవాలు చేసింది. ఆలయ స్థలం మసీదుకు చెందిందని ముస్లిం వర్గాలు వాదించాయి. దీంతో ఈ ప్రాంతంలో 2024లో 98 రోజుల పాటు పురావస్తు శాఖ సర్వే నిర్వహించి 2024 జులై 15న కోర్టుకు నివేదిక సమర్పించింది. దీనిపై మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ బెంచ్ నేడు విచారణ జరిపింది.

# నీట్ నిందితుడి ఇంట గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో సీట్లు..!

**జైపూర్ ,మే 15 :** నీట్ 2026 పరీక్ష పత్రం లీకేజీపై దృష్టిపెట్టిన అధికారులకు గతేడాది లీక్ ఆనవాళ్లు బయటపడుతున్నాయి. కీలక నిందితుడైన వికాస్ బివాల్ గతేడాది యశ్ యాదవ్ నుంచి నీట్ ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు సీబీఐ అనుమానిస్తోంది. దీంతో ఈ ఏడాది కూడా యశ్ నుంచే వికాస్ ఈ పేపర్‌ను కొన్నాడు. ఈ వ్యవహారంలో యశ్ తండ్రి మంగిలాల్ బివాల్, అంకుల్ దినేశ్ బివాల్ హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వికాస్ అతడి సోదరి ప్రగతి, కజిన్స్ సానియా, గుంజన్, పలాక్‌లు కూడా గతేడాది ప్రభుత్వ కాలేజీల్లో వైద్యవిద్య సీట్లు పొందారు. వీరంతా కూడా లీకైన పేపర్ సాయంతోనే సీట్లు సాధించినట్లు తెలుస్తోంది.

**అందరికీ అత్తెసరు మార్కులే.. అయినా మేజిక్..!**

వికాస్‌కు పదో తరగతిలో 63%, 12వ తరగతిలో 55% మార్కులు వచ్చాయి. ఇక 2024లో నీట్ పరీక్ష రాస్తే కేవలం 720కి గాను 240తో సరిపెట్టుకొన్నాడు. సికార్‌లోని ఓ కోచింగ్ సెంటర్లో 46 పరీక్షలు రాస్తే సగటున 384 మార్కులు వచ్చాయి. కానీ, 2025లో మాత్రం 85.11 పర్సంటైల్‌తో గవర్నమెంట్ కాలేజీలో సీటు సాధించడం విశేషం. ఇక ఆయన సోదరి ప్రగతి 10వ తరగతిలో 69%, 12వ తరగతిలో 91% మార్కులు వచ్చాయి. 2024 నీట్లో 720కి 355 మార్కులే వచ్చాయి. కానీ, సికార్‌లోని కోచింగ్ సెంటర్లో 50 నమూనా పరీక్షలు రాస్తే మార్కులు ఏనాడు 320- 342 దాటలేదు. కానీ, 2025లో హఠాత్తుగా 92.53 పర్సంటైల్‌తో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. ఇక మరో కజిన్ సోనియాకు 10వ తరగతిలో 63%, 12వ తరగతిలో 89% మార్కులు వచ్చాయి. 2024 నీట్లో 320 మార్కులతో సరిపెట్టుకొంది. సికార్లోని కోచింగ్ సెంటర్లో 49 మాక్‌టెస్టులు రాస్తే 341-361 మధ్యే మార్కులు వచ్చాయి. అదే నీట్ పరీక్ష రాస్తే మాత్రం అలవోకగా 94.07 పర్సంటైల్‌తో ప్రభుత్వ కాలేజీలో సీటు పొందింది. ఇక పలాక్‌కు 10వ తరగతిలో 93%, 12వ తరగతిలో 89% మార్కులు వచ్చాయి. 2024 నీట్లో 512 మార్కులు మాత్రమే సాధించింది. సికార్‌లోని కోచింగ్ సెంటర్లలో నిర్వహించిన 50 నమూనా పరీక్షల్లో ఆమెకు ఏనాడు 515-550 మార్కులు దాటలేదు. కానీ, 2025 నీట్లో 98.61 పర్సంటైల్‌తో జైపూర్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. ఇప్పుడు అదే కుటుంబంలోని రిషి కోసం పేపర్ కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతడు 10వ తరగతిలో 43%, 12వ తరగతిలో గ్రేస్ మార్కులు 50% సాధించాడు.

# పసిడి ప్రియులకు ఊరట..

భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు

కొనసాగుతున్న బంగారం ర్యాలీకి బ్రేక్

10 గ్రాముల బంగారంపై రూ.2,240 వరకు తగ్గుదల

హైదరాబాద్‌లో రూ.1.60 లక్షలకు దిగివచ్చిన పసిడి

కిలో వెండి ధరలో రూ.10,000 భారీ కోత



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఇటీవల పరుగులు పెడుతున్న బంగారం ధరల జోరుకు బ్రేక్ పడింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, కేంద్రం దిగుమతి సుంకాలను పెంచడం వంటి కారణాలతో శుక్రవారం దేశీయ మార్కెట్లో పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. కొనుగోలుదారులకు ఇది కాస్త ఊరటనిచ్చే విషయమనే చెప్పాలి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ అందించిన సమాచారం ప్రకారం శుక్రవారం (మే 15) ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.2,240 తగ్గి రూ.1,60,090 వద్దకు చేరింది. ఇక, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా రూ.2,050 తగ్గి రూ.1,46,750 వద్ద ట్రేడ్ అవుతోంది. బంగారం బాటలోనే వెండి కూడా పయనించింది. కిలో వెండి ధరపై ఏకంగా రూ.10,000 కోత పడటంతో ప్రస్తుతం రూ.3.05 లక్షల వద్ద కొనసాగింది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,60,090గా ఉండగా, ఢిల్లీలో రూ.1,60,240గా ఉంది. చెన్నైలో మాత్రం కాస్త ఎక్కువగా రూ.1,63,390 వద్ద ట్రేడవుతోంది. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రధాన నగరాల్లోనూ కిలో వెండి ధర రూ.3.05 లక్షల వద్దనే కొనసాగుతోంది. నిన్న, మొన్నటితో పోలిస్తే దేశవ్యాప్తంగా పసిడి, వెండి ధరల్లో భారీ తగ్గుదల నమోదైంది.

# పరాన్న జీవుల్లా వ్యవస్థపై దాడి చేస్తున్నారు

## కొందరు సోషల్ మీడియా, ఆర్టీఐ కార్యకర్తలపై సీజేఐ తీవ్ర వ్యాఖ్యలు

## న్యాయవాదిని మందలించిన జస్టిస్ సూర్యకాంత్

**ఢిల్లీ, మే 15 :** కొంత మంది బొద్దింకల్లా మారి వ్యవస్థపై దాడి చేస్తున్నారని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఉద్యోగాల్లేని యువత.. సోషల్ మీడియా, ఆర్టీఐ కార్యకర్తలుగా మారి, వ్యవస్థపై దాడి చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. సీనియర్ అడ్వకేట్ హోదాను కోరుతున్న ఓ న్యాయవాదిని (పిటిషనర్) మందలిస్తున్న సమయంలో ఈ వ్యాఖ్యలు చేశారు. వ్యవస్థపై దాడి చేసే 'పరాన్నజీవులు' సమాజంలో ఇప్పటికే ఉన్నారని, వారితో చేతులు కలపాలనుకుంటున్నారా? అంటూ పిటిషనర్ ను ధర్మాసనం ప్రశ్నించింది.

సీనియర్ న్యాయవాదుల హోదాకు సంబంధించిన సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయడంలో ఢిల్లీ హైకోర్టు జాప్యం చేస్తోందని, ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యాయవాది సంజయ్ దుబే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. సీనియర్ అడ్వకేట్ హోదా అనేది కోర్టు ప్రసాదించే విశిష్ట గౌరవమని వ్యాఖ్యానించింది. వ్యాజ్యాల ద్వారా దానిని సాధించుకోలేరని స్పష్టం చేసింది. 'ఈ సీనియర్ హోదాను ప్రపంచంలో ఎవరికైనా ఇవ్వొచ్చు. మీకు తప్ప. మీకు హైకోర్టు ఆ హోదా ఇచ్చినా గానీ.. మీ ప్రవర్తన చూసి మేం దాన్ని పక్కనపెడతాం' అని సీజేఐ ఆగ్రహం వ్యక్తంచేశారు. పిటిషనర్ సామాజిక మాధ్యమం వేదికగా వాడిన భాష గురించి ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

న్యాయవ్యవస్థను లక్ష్యంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులు తమ దృష్టిలో ఉన్నాయని, వాటిని గమనించడం లేదని అనుకుంటున్నారా? అని సీజేఐ ప్రశ్నించారు. ఢిల్లీకి చెందిన కొందరు న్యాయవాదుల లా డిగ్రీల ప్రామాణికతపై అనుమానాలున్నాయని కూడా వ్యాఖ్యానించారు. ఈ విషయంలో సీబీఐ విచారణకు ఆదేశించేందుకు తగిన కేసు కోసం ఎదురుచూస్తున్నామని అన్నారు. బార్ కౌన్సిల్ తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ విచారణ సమయంలో పిటిషనర్ కోర్టుకు క్షమాపణలు చెప్పారు. తన పిటిషన్ ను వెనక్కి తీసుకునేందుకు అనుమతి కోరగా.. అందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది.

# విమానానికి బాంబు బెదిరింపు

● **శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో హై అలర్ట్**

**హైదరాబాద్,మే 15(మనం,ప్రత్యేక ప్రతినిధి):** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వస్తున్న లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానంలో బాంబు ఉందంటూ మెయిల్ కలకలం సృష్టించింది. దీంతో విమానాశ్రయ అధికారులు, భద్రతా సిబ్బంది అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి శంషాబాద్‌కు వస్తున్న ఎల్‌హెచ్-754 విమానంలో బాంబు ఉందంటూ విమానయాన సంస్థకు ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి ఈమెయిల్ అందింది. విమానం గాలిలో ఉన్నప్పుడే ఈ బెదిరింపు రావడంతో అధికారులు వెంటనే అప్రమత్తమై హై అలర్ట్ ప్రకటించారు. అనంతరం విమానం శంషాబాద్‌లో ల్యాండ్ అయిన వెంటనే, దానిని ఐసోలేషన్ బేకు తరలించారు. బాంబు, డాగ్ స్క్వాడ్ సహాయంతో విమానం మొత్తం, ప్రయాణికుల లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల తర్వాత విమానంలో ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని అధికారులు నిర్ధారించారు. దీంతో ఆ బెదిరింపు ఈమెయిల్ ఫేక్ అని తేల్చాడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ తప్పుడు బెదిరింపు ఈమెయిల్ పంపిన వ్యక్తిని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

# బెంగాల్ ఆర్థికమంత్రి రేసులో ప్రధాని నరేంద్ర మోడీ సలహాదారు

**కోల్‌కతా,మే 15:** పశ్చిమబెంగాల్లో బీజేపీనేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా సువేందు అధికారి బాధ్యతలు స్వీకరించగా.. మరో ఐదుగురికి మంత్రి పదవులు దక్కాయి. కీలకమైన ఆర్థిక మంత్రిత్వశాఖతో పాటు హోం, విద్య, వైద్యం, వాణిజ్య, పరిశ్రమశాఖలన్నీ ప్రస్తుతం సువేందు వద్దే ఉన్నాయి. అయితే ఆర్థికశాఖను ప్రధాని మోడీకి సలహాదారుగా పనిచేసిన సంజీవ్ సన్యాల్‌కు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది.



అనుభవజ్ఞులైన అధికారులకు మంత్రి పదవులు కట్టబెట్టడం బీజేపీకి కొత్తేం కాదు. విదేశాంగమంత్రిగా ఎస్.జైశంకర్, చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురీ అలా వచ్చిన వచ్చినవారే. ఇదిలాఉంటే సంజీవ్ సన్యాల్ పశ్చిమ బెంగాల్‌కు చెందినవారే. సువేందు ప్రమాణస్వీకారానికి తన సతీమణితో కలిసి హాజరయ్యారు. బెంగాల్లో బీజేపీ విజయం, సువేందు పీఏ చంద్రనాథ్ రథ్ హత్య, బీజేపీ కార్యకర్తలు గాయపడటం వంటి వాటి గురించి తన అభిప్రాయాలను బహిరంగంగా వెల్లడించారు.

కోల్‌కతాలో జన్మించి, అక్కడే చదువు పూర్తి చేసుకున్న సన్యాల్.. ఉన్నత చదువుల కోసం ఢిల్లీ వెళ్లారు. 2017 నుంచి 2022 వరకు ఆర్థిక మంత్రికి ప్రధాన ఆర్థిక సలహాదారుగా పనిచేశారు. ఆరుసార్లు ఆర్థిక సర్వే రూపకల్పనలో పాలుపంచుకొన్నారు. 2022 నుంచి ప్రధాని ఆర్థిక సలహామండలిలో సభ్యుడిగా ఉన్నారు. ఇలాంటి ప్రొఫైల్ ఉన్న సన్యాల్.. బెంగాల్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టడానికి సరైన వ్యక్తి అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే సమయంలో ఆయనకు రాజకీయాలు కొత్తేం కాదు. భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్‌కు మెంటార్‌గా వ్యవహరించిన స్వాతంత్ర సమరయోధుడు సచీంద్ర సన్యాల్‌కు బంధువు. ముత్తాత నలినక్ష సన్యాల్ కూడా రాజకీయ పదవులు చేపట్టారు. ఇక, సువేందు ఖాళీ చేసిన నందిగ్రామ్ నియోజకవర్గంలో జరిగే ఉప ఎన్నికల్లో సంజీవ్ సన్యాల్ పోటీ పడనున్నట్లు తెలుస్తోంది.

# ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలి

- తూర్పు తెలంగాణ జిల్లాల ప్రాంతీయ సదస్సు
- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య




సూర్యాపేట మే 15 (మనం ప్రతినిధి) స్థానికంగా అందుబాటులో గల ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వానికి ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పిలుపునిచ్చారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో తూర్పు తెలంగాణా ప్రాంతీయ స్థానిక సంస్థల సదస్సులో భాగంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి కాత్యాయని దేవి, సభ్యురాలు సుజానా యాదవ్, సభ్యుడు ఎస్.సుధీర్ రెడ్డిలతో కలిసి చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సమీక్ష నిర్వహించారు. ఇందులో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తమతమ జిల్లాలలో స్థానిక సంస్థల పనితీరు గురించి చైర్మన్ కు వివరించారు. నగర పాలక సంస్థలు, మున్సిపల్ పట్టణాలు,గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ మాట్లాడుతూ... గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల ప్రజలను కూడా ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వాములు చేస్తూ, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని హితవు పలికారు. ఆదాయ వనరులు అభివృద్ధి చేసుకుని, పల్లె, పట్టణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. చైతన్యవంతమైన సమాజ నిర్మాణం జరిగి, అన్ని వర్గాల వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ఆర్థిక సంఘం ధ్యేయమని చైర్మన్ వెల్లడించారు. ఆర్థిక అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు సమసిపోయి, మానవ సంపద, వారి శక్తియుక్తులు సమాజానికి ఉపయోగపడేలా కృషి జరగాలన్నారు. ఈ దిశగా ప్రజలకు, ప్రభుత్వానికి కమిషన్ వారధిగా నిలుస్తూ సామాజిక అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఫైనాన్స్ కమిషన్ సూచనలు చేస్తుందని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో ప్రతి నివాస గృహానికి రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా, పారిశుధ్య నిర్వహణ పక్కాగా కొనసాగేలా స్థానిక సంస్థలు నిశిత పర్యవేక్షణ చేయాలన్నారు. ఇటీవలే కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, మేయర్లు, చైర్ పర్సన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, స్థానిక సంస్థల బలోపేతంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. నిధుల కోసం పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఆధారపడకుండా స్థానికంగా ఆదాయం సమకూర్చే అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని అదేవిధంగా పన్ను వసూళ్లు, ప్రకటనలపై వచ్చే రాబడి, వృత్తి పన్ను, వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి నిర్ణీత రుసుము వసూలు చేస్తూ స్థానిక సంస్థలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థలలో ఆదాయం వనరులు పెంపొందించుకునేందుకు గల అవకాశాలపై ప్రజాప్రతినిధులు, అధికారుల నుండి సలహాలు స్వీకరించారు. వీటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని చైర్మన్ సిరిసిల్ల రాజయ్య వెల్లడించారు. సదస్సులో

**అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలి**

జిల్లాలోని గ్రామాలు మున్సిపాలిటీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అధికారంతోపాటు ప్రజాప్రతినిధులు భాగస్వాములై సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ స్థాయి నుంచి అభివృద్ధి జరిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్యం రావడమే అసలైన లక్ష్యమని, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడానికి ప్రతి గ్రామం, మున్సిపాలిటీని ఒక మోడల్గా తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా యంత్రాంగం.

ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయడం ద్వారా గ్రామాలు బలోపేతం అవుతాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా స్థానికంగా ఆదాయం పెరిగేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులకు నిధులు అవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పన్నులు కట్టేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేసి గ్రామాలను ప్రగతి పథంలో నడిపించాలని జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా యంత్రాంగం పనిచేస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నగర మేయర్లు, ఛైర్పర్సన్ లు, ఎక్స్ ఎం.పి.టి.సి.లు, ఎక్స్ జడ్.పి.టి.సి లు సర్పంచులు, మునిసిపల్ కమీషనర్ లు, డిపిఓ లు, ఎంపిడిఓ లు, ఎన్జిఓస్, సూర్యాపేట అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, నల్గొండ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,సూర్యాపేట జెడ్పీ సీ.ఈ.ఓ డి. శిరీష, నల్గొండ జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీపీఓ యాదగిరి, డిఎంహెచ్వో వెంకటరమణ డీఎల్పీఓలు, ఎంపీఓలు, ఎంఈఓ లు గ్రామపంచాయతి కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దుబాయి పోలీసుల అదుపులో జగిత్యాల జిల్లా గల్ఫ్ కార్మికుడు

**ఇండియాకు వెళ్లకుండా దుబాయి ఏర్ పోర్ట్ లో నిలిపివేసిన ఇమ్మిగ్రేషన్ అధికారులు**




జగిత్యాల మే 15( మనం ప్రతినిధి ): జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాజారం గ్రామానికి చెందిన కట్టు తిరుపతిని ఇండియాకు వెళ్లకుండా దుబాయి ఏర్ పోర్ట్ ఇమ్మిగ్రేషన్ అధికారులు 'ఎగ్జిట్ క్లియరెన్స్' నిరాకరించి పోలీసులకు అప్పగించిన సంఘటన ఎప్రిల్ 12న జరిగింది. జీవనోపాధి కోసం జనవరి 10న దుబాయికి చేరుకున్న తిరుపతికి యాజమాన్యం జీతం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడంతో... కంపెనీ నుండి వెళ్ళిపోయి ఇతర చోట్ల పని కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. కాగా యజమాని అతన్ని పరారైన కార్మికుడు (ఖల్లివెల్లి) గా ప్రభుత్వం వద్ద నమోదు చేసినట్లు సమాచారం. ఇతని స్వగ్రామం ఎండపెల్లి మండలం చర్లపల్లి, కాగా అత్తవారి ఊరు రాజారంలో నివసిస్తున్నాడు. తిరుపతికి, ప్రభుత్వం పక్షాన న్యాయవాదిని సమకూర్చి 'న్యాయ సహాయం' (లీగల్ ఎయిడ్,) అందించి, విడుదల చేయించి స్వదేశానికి తెప్పించాలని అతని భార్య రజిత శుక్రవారం (15.05.2026) హైదరాబాద్ బేగంపేట లోని స్టేట్ లెవల్ 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ధర్మపురి ఎమ్మెల్యే, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ల పేరిట వినతిపత్రం సమర్పించారు. ఆయనపై ఏవో ఆరోపణలు మోపి శిక్ష విధించే అవకాశం ఉందనే భయం ఉంది. కాబట్టి, ఆయన నిర్బంధానికి గల ఖచ్చితమైన కారణం, ఏవైనా కేసులు, ఆరోపణలు ఉన్నాయా అనే విషయాలను తెలుసుకొని చెప్పాలని ఆమె కోరారు. స్పందించిన 'సీఎం ప్రజావాణి' ఇంచార్జి, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ డా. జి. చిన్నారెడ్డి తగిన చర్యలు తీసుకోవాలని జిఏడి ఎన్నారై విభాగం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' హెల్ప్ డెస్క్ లైజన్ ఆఫీసర్ భార్గవి నద్దునూరి, వాలంటీర్ ప్రీతి సువర్చల తదితరులు పాల్గొన్నారు. బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని గల్ఫ్ కార్మిక నాయకుడు అమరగొండ తిరుపతి కోరారు.

## రక్తదానం మహా దానం



- అన్నిదానాల కంటే రక్తదానం గొప్పది

కోదాడ, మే 15(మనం న్యూస్): అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు రక్తదానం చేసినట్లయితే మరి ఒకరి ప్రాణం కాపాడవచ్చు అని ఎంబీఎం ట్రస్టు సభ్యులు అన్నారు. కోదాడ పట్టణానికి చెందిన సిహెచ్ మణి చందనకు కోదాడ ధరణి హాస్పిటల్ నందు ఆపరేషన్ నిర్వహించటానికి అత్యవసరంగా ఏ పాజిటివ్ బ్లడ్ అవసరం అని డాక్టర్ చెప్పడంతో అనంతగిరి మండలం వెంకట్రాంపురం గ్రామానికి చెందిన 19 వ వార్డు మెంబర్ పర్వతం శ్రీను మణి చందనకు బ్లడ్ ఇచ్చారు.

మణి చందన కుటుంబం సభ్యుల తరపున వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంబిఎం ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ తల్లికి గుండెపోటు

కరీంనగర్, మే 15 : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తల్లి శకుంతల గుండెపోటుకు గురయ్యారు. హుటాహుటిన కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్ కు తరలించారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని మెడికవర్ ఆస్పత్రిలో శకుంతల చికిత్స పొందుతున్నారు. బండి భగీరథ్ కేసులో సోషల్ మీడియాలో గత మూడు రోజులుగా జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్ర మనస్తాపానికి శకుంతల గురయ్యారు. ఆమెకు మెడికవర్ వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలియగానే బండి సంజయ్ మెడికవర్ ఆస్పత్రికి చేరుకుని తన అమ్మ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

# నీట్ లీక్ కేసులో కీలక నిందితుడి అరెస్టు

పుణే, మే 15 : నీట్ యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ప్రొఫెసర్ పీవీ కులకర్ణిని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అరెస్టు చేసింది. నిందితుడిని పుణెకు చెందిన రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా గుర్తించిన అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) తరపున పరీక్ష ప్రక్రియలో కొన్నేళ్లుగా కులకర్ణి పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రశ్నపత్రాలను పొందే అవకాశం ఆయనకి దొరికింది. ఏప్రిల్ చివరి వారంలో మరో నిందితురాలైన మనీషా వాఘ్మారే సహాయంతో పేపర్ లీక్ కుట్రకు పాల్పడినట్లు సీబీఐ అధికారులు ఆరోపిస్తున్నారు. మహారాష్ట్రలోని పుణెలో తన నివాసంలో ఎంపిక చేసిన విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ తరగతులను కులకర్ణి నిర్వహించినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. మనీషా సహాయంతో పలువురు విద్యార్థులను సమీకరించి వారికి రహస్యంగా కోచింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీట్ ప్రశ్నపత్రాలను లీక్ చేసినట్లు ఆరోపించారు. ఈ తరగతుల్లోనే ప్రశ్నలు, సరైన జవాబులను విద్యార్థులకు చెప్పారని అధికారులు తెలిపారు. ఆ ప్రశ్నలు మే 3న నిర్వహించిన అసలు నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రాల్లో వచ్చాయని వెల్లడించారు. దీంతో మే 14న మనీషాను అరెస్టు చేయగా నేడు కులకర్ణిని అరెస్టు చేశారు. కాగా, ఈ కేసుకు సంబంధించి జైపూర్, గురుగ్రామ్, నాసిక్, పుణె, అహల్యానగర్ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఏడుగురిని సీబీఐ అరెస్టు చేసింది. వారిలో ఐదుగురిని ఇప్పటికే కోర్టులో హాజరుపర్చగా.. ఏడు రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. గురువారం అరెస్టయిన మిగిలిన ఇద్దరు నిందితులను ట్రాన్సిట్ రిమాండ్ నిమిత్తం పుణెలోని కోర్టులో హాజరుపరిచారు. తదుపరి విచారణ కోసం ఆ ఇద్దరినీ ఢిల్లీకి తరలించ.




# హైదరాబాద్ స్థాయిలో కరీంనగర్లో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు




- జిల్లా గ్రంథాలయం ద్వారా నిరుద్యోగ యువతకు ప్రత్యేక శిక్షణ
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ మే 15(మనం బ్యూరో): హైదరాబాద్ స్థాయిలోనే కరీంనగర్ జిల్లాలో యువతకు స్కిల్ డెవలప్మెంట్, ఉద్యోగ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థను కేంద్రంగా చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు అవసరమైన అన్ని రకాల శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో విద్యారంగానికి అవసరమైన మౌలిక వసతులు, వనరులు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. ఉద్యోగ శిక్షణ కోసం యువత హైదరాబాద్కు వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించేలా జిల్లాలోనే ఉన్నత స్థాయి శిక్షణ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలతో సమన్వయం చేసుకుని గ్రంథాలయ సంస్థ ద్వారా ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. నిరుద్యోగ యువత, విద్యార్థులు జిల్లా గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించిన కలెక్టర్, పుస్తక పఠనం ద్వారా జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు.

యువతలో రీడింగ్ కల్చర్ మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి నగరపాలక సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. స్మార్ట్ సిటీ నిధులతో రూ.7 కోట్ల వ్యయంతో చేపట్టిన జిల్లా గ్రంథాలయానికి నూతన భవనం సిద్ధమైందని వెల్లడించారు. త్వరలోనే భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏ అవసరం ఉన్నా తమను సంప్రదించవచ్చని సూచించారు.సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞానం, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసానికి కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకుని పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని చెప్పారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ మాట్లాడుతూ చదువుకు మనిషి గౌరవాన్ని, ఆర్థిక స్థితిగతులను మార్చగల శక్తి ఉందని అన్నారు. గ్రంథాలయం నాలెడ్జ్ హబ్లా పనిచేస్తోందని, విద్యార్థులు, నిరుద్యోగులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని జిల్లా కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ పుస్తక పఠనం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని సూచించారు. తాను చదువుకునే రోజుల్లో నిత్యం పుస్తకాలు చదివేదాన్నని, వాటి ద్వారా ఎంతో జ్ఞానం పెరిగిందని చెప్పారు. పలువురు గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారు. జిల్లా కలెక్టర్, మేయర్, సుడా చైర్మన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కలిసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థుల సౌకర్యార్థం పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ వారు అందించిన 8 కూలర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓకే మహేశ్వర్ స్థానిక కార్పొరేటర్ పడాల శ్రీజ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ అభ్యర్థుల ఇంటర్వ్యూ

భీమదేవరపల్లి మే 15 మనం న్యూస్: ఎస్సీ కార్పొరేషన్ లో దరఖాస్తు అభ్యర్థుల ఇంటర్వ్యూ పూర్తయిందని ఎంపీడీవో వీరేశం తెలిపారు. శుక్రవారం రోజున ఎంపీడీవో తెలిపిన వివరాల ప్రకారం 20 25-26 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ఎలక్ట్రికల్ టూ వీలర్ ఎలక్ట్రికల్ త్రీ వీలర్ మిల్స్ ఆనియల్ కొరకు ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులను దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూ నిర్వహించినట్లు తెలిపారు. లక్ష రూపాయల రుణం కొరకు 87 మంది అభ్యర్థులు, మూడు లక్షల రూపాయల రుణం కొరకు 118, దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

# పెండింగ్లో ఉన్న కూలీల వేతనాలు విడుదల చేయాలి

- రెండుసార్లు ఫోటోలు తీసే విధానం రద్దు చేయాలి
- పట్టణ పేదలకు ఉపాధి పని పెట్టాలి
- విబిజి రాంజీ చట్టం రద్దు చెయ్యాలి
- గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తిరిగి పునరుద్దించాలి.
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మిట్టపల్లి లక్ష్మి

తిరుమలగిరి మే14. (మనం న్యూస్). గ్రామీణ ఉపాధి హామీ కూలీల బకాయలు విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షురాలు మిట్టపల్లి లక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా మండల పరిధిలోని తాటిపాముల, వెలిశాల, మామిడాలగ్రామాలలో ఉపాధి హామీ పనులవద్ద పనిచేస్తున్న కూలీలను కలిసి పని ప్రదేశంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా చేసిన అనేక పోరాటాల ఫలితంగా పార్లమెంట్ లో వామపక్షాలు మద్దతుతో యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ పేదలకు ప్రతి కుటుంబానికి వంద రోజుల పని గ్యారెంటీ చేస్తూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని 2005లో ఆమోదించదన్నారు. 2006 అక్టోబర్ 2 నుండి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారని చెప్పారు. దీని ద్వారా కోట్లాదిమంది వ్యవసాయ కార్మికులకు , చిన్న, మధ్య తరగతి రైతాంగానికి చేతినిండా పని కల్పించబడిందన్నారు.గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు పని కోసం పేదల వలసలు తగ్గాయన్నారు. గ్రామీణ వ్యవసాయ కార్మికులు వ్యవసాయ పనులలో కనీస వేతనాలను పెంచుకోవడం జరిగిందన్నారు . ఆడ,మగ తేడా లేకుండా సమాన వేతనాలు దేశంలో మొదటిసారి అమలు జరిగాయన్నారు. కోట్లాది రూపాయలను కేంద్ర ప్రభుత్వం వేతనాల రూపంలో పేదలకు ఇవ్వడం వలన ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని చెప్పారు. పేదరికం, అప్పుల ఊబి నుండి కోట్లాది



నిరుపేద కుటుంబాలు బయటపడ్డాయని గుర్తు చేశారు. 2008లో ప్రపంచంలో ఆర్థికమాంద్యం వచ్చినప్పుడు భారతదేశాన్ని గట్టెక్కించినది గ్రామీణ ఉపాధి హామీ చట్టం అని నొక్కి చెప్పారు.˝ఎట్టణ ప్రాంతాల పేదలకు ఉపాధి పని పెట్టాలని డిమాండ్ చేశారు. 100 రోజుల పని దినాలను 200 రోజులకు పెంచాలని కోరారు.రోజు కూలి రూ. 600 ఇవ్వాలని దేశవ్యాప్తంగా ఆందోళన, పోరాటాలు ఉధృతం అవుతున్న తరుణంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసిందన్నారు. దీని స్థానంలో విబిజి రామ్ జి చట్టాన్ని తెచ్చిందని,గతంలో 90% నిధులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం 60 శాతం మాత్రమే ఇస్తాము 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని నిర్ణయం చేసిందన్నారు . పని దినాలను 125 రోజులకు పెంచినట్లే పెంచి వ్యవసాయ సీజన్ లో 60 రోజుల పనిని బంద్ చేస్తామని పేర్కొంది అన్నారు. కనీస వేతనం రోజు కూలి రూ 178 గా పేర్కొన్నదని,ఇది రాజ్యాంగబద్ధ పని హక్కును హరించడమే అని అన్నారు. పని కల్పించే బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకో చూస్తున్నదని ఆరోపించారు. రోజు కూలి రూ. 307 ఇవ్వాలి కానీ రూ 150 మించి పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు . వీటిని కూడా అనేక గ్రామాలలో గత సంవత్సరం చేసిన పనికి ఇప్పటివరకు వేతనాలు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు చేస్తున్న పనికి నాలుగు వారాలుగా వేతనాలు ఇవ్వలేదని చెప్పారు.వారం వారం కూలీల వేతనాలు ఇవ్వాలి అనే చట్టం డైరెక్షన్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని విమర్శించారు.ఎండలు తీవ్రంగా పెరుగుతున్నాయి కానీ పని ప్రదేశంలో త్రాగడానికి నీరు, నీడకు టెంటు, ఓ ఆర్ ఎస్, మెడికల్ కిట్ వంటికనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం పేదలపై కక్షగట్టి పనిని తీసివేయాలని చూస్తున్నదని అందులో భాగమే అని ప్రదేశంలో ఉదయం సాయంత్రం ఫోటోలు ఆన్ లైన్ లో అప్లోడ్ చేయడానికి నేషనల్ మొబైల్ మోనటరింగ్ సిస్టం తెచ్చిందని అన్నారు.అడవులు గుట్టలలో పని దగ్గర ఫోన్ సిగ్నల్స్ సరిగా లేక ఫోటోలు అప్లోడ్ కాకపోవడం ఫలితంగా పని చేసిన కూలీలు పనికిరాని వారుగా రికార్డులలో నమోదు అవుతున్నది. మరొకవైపు డ్రోన్ యంత్రం ద్వారా ఫోటోలు తీస్తున్న వాటిని లెక్కలోకి తీసుకోవడం లేదన్నారు. కొత్తగా ఐరిస్ ఫోటోలు తీస్తామంటున్నారని, మెట్ల వ్యవస్థను రద్దు చేశారని అన్నారు. పని దినాలు తక్కువ పేరుతో అసిస్టెంట్లను తీసి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఆధార్ కార్డు , జాబ్ కార్డు , బ్యాంకు ఎకౌంటు నంబర్ల లింకు పేరుతో లక్షలాదిమంది జాబ్ కార్డు లను తొలగించాలని అన్నారు. నిధులలో భారీ కోత విధించారని అన్నారు. ఆన్లైన్ పేమెంట్ పేరుతో వేతనాలను పెండింగ్ లో పెడుతున్నారని,తక్షణమే ఈ విధానాలను రద్దు చేయాలని,అడిగినవారికి జాబ్ కార్డు ఇవ్వాలని కోరారు.కూలీల పొట్ట కొట్టే విబిజీ రాం జీ చట్టం రద్దు చేయాలని అన్నారు.పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని అన్నారు.పట్టణ పేదలకు ఉపాధి పని కల్పిస్తాం పని దినాలను 150 రోజులకు పెంచుతాం , రోజు కూలి రూ 400 ఇస్తాం అన్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీ లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు అబ్రహం, చిత్తలూరి సోమన్న, రాములు,ఉపాధి కూలీలు మల్లమ్మ, కవిత, వెంకన్న, జ్యోతిపాల్గొన్నారు.

# బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత

- బాల్య వివాహాలతో జరిగే ఇబ్బందులపై అవగాహన కల్పించాలి
- బాల కార్మిక వ్యవస్థ ఉండవద్దు
- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి



**రాజన్న సిరిసిల్ల, మే 15(మనం ప్రతినిధి):** బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యతని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. స్త్రీ, మహిళా, శిశు, వృద్ధుల, దివ్యాంగుల, ట్రాన్స్ జెండర్స్ ల సంక్షేమ శాఖ ఆద్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాల్ లో బాలల హక్కుల పరిరక్షణపై రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సర్పంచులు, మున్సిపల్ వార్డ్ సభ్యులు, అంగన్వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు వచన్ కుమార్ రెడ్డి, బండి అపర్ణ, మర్రిపల్లి చందన, గోగుల సరిత, వందన గౌడ్, ప్రేమలత అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ₹పిల్లల రక్షణ.. సమాజం బాధ్యత₹ టోల్ ఫ్రీ నంబర్లతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కిశోర బాలికలకు శిక్షణ ఇచ్చేందుకు కుట్టు మిషన్ అందజేశారు.బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డుల్లో బాలల హక్కుల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని, బాల్య వివాహాలతో కలిగే ఇబ్బందులపై అవగాహన కల్పించాలని, బాల్య వివాహాలు అడ్డుకోవాలని సూచించారు. పాఠశాలల్లో డ్రాప్ ఔట్లు ఉండవద్దని, ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో సౌకర్యాలపై వివరించి.. ప్రవేశం కల్పించాలని ఆదేశించారు. బాల కార్మిక వ్యవస్థ ఉండవద్దని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ అభివృద్ధితోపాటు ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసి.. బాలల స్థితిగతులు, ఇబ్బందులు గుర్తించాలని సూచించారు. 1098 హెల్ప్ లైన్ వినియోగించుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. పిల్లలకు వ్యాక్సిన్లు ఇప్పించాలని సూచించారు.

బాలలే దేశ భవిష్యత్ అని, అందరి సహకారంతోనే ప్రతి సామాజిక రుగ్మతలోని నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. మగ, ఆడపిల్లల ఇద్దరం సమానమని స్పష్టం చేశారు. ప్రతి వివాహం నమోదు కావాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో సౌకర్యాలపై వివరించాలని తెలిపారు. ఆరు ఏండ్లలోపు పిల్లలు చేర్పించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాల బాలికలకు అవగాహన కల్పించాలని, చదువుతోనే సామాజిక. ఆర్థిక మార్పు సాధ్యమని తెలిపారు.

# డిగ్రీ కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు



**మహాదేవపూర్ మే 15 మనం న్యూస్:** మహాదేవపూర్ మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాల సందర్భంగా ఐదవ రోజు గ్రంథాలయ పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని కళాశాల లైబ్రరీ కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పోరిక రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు ముఖ్యఅతిథిగాహాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగ్రంథాలయాలు జ్ఞానానికినిధులు,సమాజనికివెలుగుఅనీ,సమాచార సేకరణ పుస్తకాలు, వార్త పత్రికలు, జర్నల్స్ లాంటి చదవాలని విద్యార్థులను కోరారు.అలాగే మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో గౌరవ మంత్రి శ్రీధర్ బాబు కృషి చేసి ఈప్రాంతానికిఇంటర్మీడియట్, డిగ్రీ, పాలిటెక్నిక్ మరియు ఐటీఐ కళాశాలలను తీసుకువచ్చారని తెలిపారు.కళాశాలగ్రంథాలయానికి అవసరమైన అకాడమిక్ మరియుపోటీపరీక్షలకుసంబంధించిన పుస్తకాలను అందజేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా కళాశాలలో ఉన్న మిగిలిన సమస్యలను మంత్రి శ్రీధర్ బాబు మరియు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తాననిపేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయ్ కుమార్ మాట్లాడుతూచిరిగిన చొక్కా అయినా తొడుక్కో, కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కోఅనే కందుకూరి వీరేశలింగం పంతులు మాటలను గుర్తుచేస్తూవిద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గ్రంథాలయాలపాత్రఎంతో ముఖ్యమనిఅన్నారు. కళాశాల గ్రంథాలయంలో పుస్తకాల కొరత ఉందని, ఈ నేపథ్యంలో చైర్మన్ కోటరాజబాబు పుస్తకాలు అందజేస్తామని ప్రకటించడం శుభపరిణామమని తెలిపారు.అనంతరం జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబును శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుడాల శ్రీనివాస్,వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాకతీయ మెగాటెక్స్టైల్స్ ఉద్యోగ అవకాశాలు

**భీమదేవరపల్లి మే 15 మనం న్యూస్:** కాకతీయ మెగాటెక్స్టైల్స్ లో ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తులు కోరడైందని ఏబీ ఎంవేణు తెలిపారు. శుక్రవారం రోజున ఏబీ ఎం వేణు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా సంగం మండలంలోని గీసుకొండ లో కాకతీయ మెగా టెక్స్టైల్ లో టైలరింగ్ చేసే నిరుద్యోగ మహిళలకు ఉద్యోగ అవకాశాల కోసం టైలరింగ్ అనుభవం కలిగిన మహిళలు18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలు వయసు కలిగిన వారుదరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల మహిళలు మండల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.



# పెన్షన్ మంజూరుపై ముఖ గుర్తింపు




**భీమదేవరపల్లి, మే 15 మనం న్యూస్:** పెన్షన్ దారుల ముఖ గుర్తింపు తోనే ధ్రువీకరణ జరుగుతుందని ఎంపీడీవో వీరేశం తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న వృద్ధాప్య, దివ్యాంగ, పెన్షన్లు తప్పుదోవ పట్టకుండా ఉండే ఒదుకు ముఖ గుర్తింపు తో ధ్రువీకరణ చేసి గ్రామాలలో ఉన్న గ్రామ కార్యదర్శి ముఖ లక్షణాలను కెమెరా ద్వారా స్కాన్ చేసి ధ్రువీకరిస్తారనితెలిపారు.

# 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఎడ్యుకేషన్ వీక్



**మహాదేవపూర్, మే 15మనం న్యూస్ :** మహాదేవపూర్లోని జడ్పీహెచ్ఎస్ మహదేవపూర్ బాలికల మరియు బాలుర ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులఆధ్వర్యంలోగ్రంథాలయదినోత్సవ ం సంయుక్తంగా, ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలల్లో పుస్తక ప్రదర్శన మరియు విద్యార్థినీ విద్యార్థులచే పుస్తక పఠనం జరిగినది ఇట్టి కార్యక్రమంలో బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులుఅనిల్ కుమార్ మాట్లాడుతూ పుస్తక పఠనం వల్లవిద్యార్థుల మేదస్సు పెరుగుతుందని, వారి యొక్క సమగ్రఅభివృద్ధికితోడ్పడుతుందని అన్నారు. బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థుల్లో ఊహాశక్తి , సృజనాత్మకతపెంపొందుతుందని తెలియజేశారు. పాఠశాల గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు క్రమం తప్పకుండా చదివితే పాఠ్యాంశాలు కూడా సులువుగా అర్థమవుతాయని అన్నారు. బాలికల పాఠశాల గ్రంథాలయ ఇన్చార్జ్ ఉపాధ్యాయురాలు జనగామ రజిత మాట్లాడుతూ నిశ్శబ్దంగా పుస్తకాలు ఎక్కువగా చదివే విద్యార్థులు భవిష్యత్తులో సగర్వంగా తలెత్తుకొని ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో బాలికల మరియు బాలుర పాఠశాలల ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి,మడక మధు, వీరేశం,ప్రసూన, పిడి రమేష్, ఐఈడి ఆర్ పినరేష్ తదితరులు పాల్గొన్నారు

# మాజీ మంత్రి రాజేశం గౌడ్ని పరామర్శించిన ఎమ్మెల్సీ రమణ



**జగిత్యాల మే 15( మనం ప్రతినిధి ):** హైదరాబాదులోని స్టార్ ఆస్పత్రిలో మాజీ మంత్రి రాజేశం గౌడ్ కి మోకాలు మార్పిడి శస్త్ర చికిత్స కాగా శుక్రవారం వారిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ . మరియు తెలంగాణ ఉద్యమ నాయకురాలు కదిరే పద్మ తదితరులు ఉన్నారు

# విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించాలని, పుస్తక పఠనమే విజ్ఞానానికి మార్గం,




- డీఈఓ రమేష్ కుమార్ పిలుపు

**నాగర్ కర్నూల్ మే 15 (మనం బ్యూరో):** గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో విద్యా వారోత్సవాల ఉత్సాహం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం విద్యా వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ....., గ్రంథాలయాలు విద్యా వ్యవస్థలో జ్ఞాన కేంద్రాలుగా కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల్లో పఠన అలవాటును పెంపొందించడం ద్వారా వారి సృజనాత్మకత, విశ్లేషణా సామర్థ్యం, ఆలోచనా శక్తి అభివృద్ధి చెందుతుందని ఆయన వివరించారు. పుస్తకాలు మనకు నిజమైన మార్గదర్శకులు. తరగతి గదిలో నేర్చుకున్న జ్ఞానాన్ని మరింత విస్తరించాలంటే గ్రంథాలయ పఠనం అత్యంత అవసరం అని రమేష్ కుమార్ అన్నారు. ఆధునిక సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా పుస్తకాల ద్వారా లభించే లోతైన జ్ఞానానికి ప్రత్యామ్నాయం లేదని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు రోజువారీ జీవితంలో కనీసం కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, అందుబాటులో ఉన్న పుస్తకాలు, రిఫరెన్స్ మెటీరియల్ను ఉపయోగించుకోవడం ద్వారా తమ లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని ఆయన తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా ఆయన ఈ సందర్భంగా వివరించారు. ప్రతి విద్యార్థికి సులభంగా జ్ఞానం అందించాలనే లక్ష్యంతో గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కిరణ్ కుమార్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# బిజెపి, బీ ఆర్ఎస్, పార్టీ ముఖ్య నాయకులు కాంగ్రెస్లో చేరడం జరిగింది

**డిసిసి ఎస్టీ సెల్ చైర్మన్ సర్పంచ్ ఉప సర్పంచ్ వినోద రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో**

**వరంగల్ జిల్లా మే 15 న్యూస్** సెంగెం మండలం పెద్ద తండా గ్రామంలో మన ప్రియతమా నాయకులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మరియు మండల్ సమన్వయ కమిటీ సభ్యులు ఆదేశాలమేరకు డిసిసి ఎస్టీ సెల్ చైర్మన్ , సర్పంచ్, ఉప సర్పంచ్ గుగులోత్ వినోదరవీందర్ నాయక్ ఆధ్వర్యంలో గుగులోతు రవి, కేవుల గుగులోతు రవి, రాములు తదితరులు బిజెపి / బీ ఆర్ఎస్ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. గ్రామ అభివృద్ధి మరియు ప్రజా సేవే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్, శ్రీకాంత్, నితీష్, రాకేష్, అనిల్, బిక్షపతి, చక్రు, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల, మే -15(మనం ప్రతినిధి ):** విద్యార్థులందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు విద్యా వారోత్సవాల కింద రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. లైబ్రరీ లో చదివి ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పుస్తక ప్రదర్శన, మానసిక ఉల్లాసానికి అందుబాటులో ఉంచిన వివిధ ఆటల పరికరాలను పరిశీలించి.. విద్యార్థులు ఈ పుస్తకాలు, ఆటల పరికరాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ₹ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక₹ కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు. మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని సూచించారు. కోడి గుడ్లు, బాలామృతం, ఇక్రిశాట్ వారి సూచనల మేరకు రూపొందించిన స్నాక్స్, పాలు పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చాలా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. లైబ్రరీ అనేది చదువుకునేందుకు మంచి అవకాశమని, మిగతా వారితో పోటీ పడే స్ఫూర్తి పొందుతారని పేర్కొన్నారు. తాను కూడా లైబ్రరీలో చదివానని గుర్తు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులు వార్త పత్రికలు చదవాలని సూచించారు. దీంతో అన్ని విషయాలపై అవగాహన వస్తుందని వివరించారు. సమయం చాలా విలువైందని, సోషల్ మీడియా కు దూరంగా ఉంటూ లక్ష్య సాధన పై దృష్టి సారించాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని, ప్రతి సబ్జెక్ట్ కు నిర్ణీత గడువు పెట్టుకొని చదవాలని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వారు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా కొలువు సాధించాలని ఆకాంక్షించారు. స్కూల్ వెళ్ళే విద్యార్థులు లైబ్రరీకి వచ్చేలా వివరించాలని పేర్కొన్నారు. వచ్చే వారం యూత్ అండ్ పర్యాటక శాఖ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేక వాకథాన్, జాబ్ మేళా నిర్వహించ నున్నామని వెల్లడించారు. యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు. కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో పరిశీలన జిల్లా కేంద్ర గ్రంథాలయంలో టాస్క్ ఆద్వర్యంలో కొనసాగుతున్న కంప్యూటర్ శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు వస్తున్నారు? ఏ ఏ అంశాలు నేర్చుకుంటున్నారో ఆరా తీశారు. తరగతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కృషితో గ్రంథాలయాలను అభివృద్ధి బాటలో తీసుకు వెళుతున్నామని తెలిపారు. గ్రంథాలయంలో చదువుకొని దాదాపు 150 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. చాలా గ్రామాల్లో పబ్లిక్ రీడింగ్ రూమ్ లను ఏర్పాటు చేసి గ్రామీణ పాఠకులకు గ్రంథాలయాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక, ఆర్థికంగా ముందుకు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం

- చెంచుల జీవనోపాధి అభివృద్ధికి టీజీఐఎల్పీ కీలకం
- మల్లాపూర్ చెంచుకుంటలో 34 కుటుంబాలతో కలెక్టర్ ముఖాముఖి సమావేశం
- తక్షణమే మౌలిక వసతులను కల్పించాలి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్....



**ఉమ్మడి మహ బూబ్ నగర్ మే 15 (మనం బ్యూరో):** నాగర్కర్నూల్ జిల్లాలోని ఉంటున్నటువంటి ఆదివాసి గిరిజన అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ ఇన్క్లూజివ్ లైవ్లీహుడ్స్ ప్రోగ్రాం (టీజీఐఎల్పీ)ను సమర్థవంతంగా అమలు చేసి చెంచు గిరిజన కుటుంబాలను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లాలని నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ పెంట గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. అత్యంత పేదరిక పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు గుర్తించిన 34 చెంచు కుటుంబాలతో సమావేశమై వారి సమస్యలను నేరుగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల జీవన విధానం, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య పరిస్థితులు, పిల్లల విద్య, తాగునీటి సౌకర్యాలు వంటి అంశాలపై సమగ్రంగా ఆరా తీసిన కలెక్టర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., చెంచు గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తరతరాలుగా అడవులపై ఆధారపడి జీవిస్తున్న చెంచు కుటుంబాలను ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధిలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. టీజీఐఎల్పీ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించి, వారిని స్వయం ఆదాయం పొందే స్థాయికి చేర్చాలని అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే కాకుండా, ఆర్థికంగా నిలదొక్కుకునే కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కుటుంబానికి వారి సామర్థ్యాలు, ఆసక్తులను ఆధారంగా చేసుకుని ప్రత్యేక జీవనోపాధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పశుపోషణ, కోళ్ల పెంపకం, చిన్నచిన్న వ్యాపారాలు, అటవీ ఉత్పత్తుల ఆధారిత ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో శిక్షణలు ఇచ్చి ఆదాయ వనరులు పెంచాలని అధికారులకు ఆదేశించారు. చెంచు మహిళల ఆర్థిక సాధికారతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మళ్లీ ఈ నెల 20వ. తేదీన చెంచు పెంటకు సందర్శిస్తానన్నారు. అప్పటివరకు వారికి అనువైన స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించాలని కలెక్టర్ కోరారు. మహిళా సంఘాల ద్వారా పొదుపు అలవాట్లు పెంపొందించి, బ్యాంకు లింకేజీలు కల్పించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించాలన్నారు. గిరిజన యువతకు



నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మల్లాపూర్ పెంటలో మౌలిక వసతుల కొరతపై చెంచు పెంటలో గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, విద్యుత్, రహదారులు, ఆరోగ్య సేవలు, విద్యా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పిల్లలు చదువుకు దూరం కాకుండా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన చెంచు కుటుంబాలకు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. పింఛన్లు, రేషన్, ఆరోగ్య భద్రత పథకాలు, గృహ నిర్మాణ పథకాలు వంటి ప్రయోజనాలు అందకుండా ఎవరూ మిగలకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. చెంచు కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు మానవీయ దృక్పథంతో పరిష్కరించాలన్నారు. గ్రామ స్థాయిలో వుంటున్న చెంచుల వైపు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం సాయం అందించడం మాత్రమే కాకుండా, ప్రతి కుటుంబం గౌరవప్రదమైన జీవితం గడపగలిగే స్థాయికి తీసుకెళ్లడమేనని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పిడి చిన్న ఓబులేష్, అచ్చంపేట ఆర్డీవో యాదగిరి గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దశదినకర్మ అంటే పవిత్రత... తెలంగాణ శ్రీనివాస్ నాయక్



**నర్సంపేట మే 15 న్యూస్** వివిధ కార్యక్రమంలో భాగంగా వర్ధిల్లి రమ, వర్ధిల్లికట్టయ్య వారి యొక్క దశదినకర్మ కార్యక్రమంలో సామాజిక జాతీయ భావం గల ఉద్యమ నేత , నర్సంపేట కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి తెలంగాణ శ్రీనివాస్ నాయక్ హాజరై ప్రగాఢ సానుభూతి, శ్రద్ధాంజలి, జోహార్లు అర్పిస్తూ మాట్లాడారు.... హిందూ సంప్రదాయాలలో దశదినకర్మకు ప్రత్యేక స్థానం ఉందని పరమపదించిన వ్యక్తులకు శాంతి చేకూర్చడంతోపాటు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తో పాటు వారి ఇంటికి పవిత్రత చేకూరేలా ముక్కోటి దేవతలు ఆశీర్వదిస్తారని అన్నారు... ఆ సర్వోన్నతుడు కర్మ ఫలాన్ని బట్టి దశదిశలు మార్చే మహోన్నతుడని ప్రతి ఒక్క నిమిత్తమాత్రుడనని అందుకే దశదినకర్మ పవిత్రత అని తెలంగాణ శ్రీనివాస్ నాయక్ అన్నారు ఈ కార్యక్రమంలో వర్ధల్లి రాజు గౌడ్, రంజిత్ గౌడ్, చంద్రమోహన్ గౌడ్, కర్ణాకర్ గౌడ్, శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు






# వన్డే వరల్డ్‌కప్ ఆడటంపై కోహ్లి కీలక వ్యాఖ్యలు



భారత బ్యాటింగ్ దిగ్గజం విరాట్ కోహ్లి.. వన్డే వరల్డ్ కప్-2027 టోర్నీలో ఆడతాడా? లేదా?.. చాన్నాళ్లుగా క్రికెట్ వర్గాల్లో ఈ చర్చ నడుస్తోంది. 'సూపర్ స్టార్లు' అయినా సరే తమను తాము ఎప్పటికప్పుడు నిరూపించుకోవాలని హెడ్ కోచ్ గౌతం గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ గట్టిగానే చెబుతున్నారు.

తమ దృష్టిలో దిగ్గజాలు, యువ ఆటగాళ్లు సమానమనే సంకేతాలు ఇస్తున్నారు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025లో భారత్ ను విజేతగా నిలిపిన తర్వాత కెప్టెన్ పదవి నుంచి రోహిత్ శర్మను తప్పించడం ఇందుకు నిదర్శనం. అంతేకాదు రోహిత్-కోహ్లి లను మేనేజ్ మెంట్ దేశీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో తప్పక ఆడాలని ఆదేశించింది.

ఈ ఇద్దరూ అక్కడా సత్తా చాటి తమను తాము నిరూపించుకున్నారు. అయినప్పటికీ వయసు రీత్యా రోహిత్-కోహ్లి ను వరల్ కప్ ఆడిస్తారా? లేదా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఇలాంటి తరుణంలో విరాట్ కోహ్లి తన భవిష్యత్తుపై మౌనం వీడాడు.

వన్డే వరల్ కప్-2027లో ఆడతారా? లేదా? అన్న అంశంపై స్పందిస్తూ.. ''నా దృష్టి కోణం ఒక్కటే. నా జట్టు విలువ పెంచేలా నా శాయశక్తులా కృషి చేస్తా. అక్కడున్న వాళ్లు కూడా నా వల్ల జట్టుకు మేలు చేకూరుతుందని భావించాలి. అప్పుడే నేను జట్టులో ఉంటాను.

అయితే, పదే పదే నన్ను నేను నిరూపించుకోవాలనే ఒత్తిడి వస్తే.. అక్కడ నాకు స్థానం ఉండదని పరోక్షంగా నాకు నేను చెబుతున్నట్లు అర్థం. ఏదేమైనా నిజాయితీగా ఆట కోసం సన్నద్ధం కావడం అత్యంత ముఖ్యం. బ్యాటింగ్ చేయడానికి వెళ్లే ముందు ప్రతిసారి నా తల వంచుకుని.. కొత్తగా మైదానంలోకి దిగినట్లే వెళ్తాను.

నా క్రికెట్ కెరీర్ లో దేవుడు ఎన్నో అవకాశాలు ఇచ్చాడు. అందుకు నేను కృతజ్ఞుడిని. కఠినంగా శ్రమించడమే నాకు తెలుసు. సరైన రీతిలో ఆడటమే నా లక్ష్యం. అలాగే ఆడతాను కూడా. వన్డే మ్యాచ్ లో నలభై ఓవర్ల పాటు.. వికెట్ల మధ్య పరుగులు తీయాల్సి వస్తే నేను కచ్చితంగా ఆ పనిని పూర్తి చేస్తా.

నాకెలాంటి ఫిర్యాదులూ ఉండవు. ఎందుకంటే.. మ్యాచ్ లో ఊహించని పరిస్థితులు ఎదురైనా.. అందుకు తగ్గట్లుగా జట్టు కోసం ఉపయోగపడేలా ముందే నేను సన్నద్ధమవుతా. మ్యాచ్ లో ఎదుర్కొనే ప్రతి బాల్ నా కెరీర్ లో ఆఖరి బంతి అనే ఆలోచనతోనే సిద్ధమవుతా.

వికెట్ల మధ్య అలుపు లేకుండా పరిగెడతా. ఇంత చేసినా నా విలువ, స్థాయి ఏమిటో నిరూపించుకోవాలని అంటున్నారంటే.. అక్కడ నా అవసరం లేదు అని అర్థం. నాకు అది అక్కర్లేదు కూడా!'' అని కోహ్లి నర్మగర్భ వ్యాఖ్యలు చేశాడు.

ఆర్సీబీ పాడ్కాస్ట్లో కోహ్లి చేసిన ఈ కామెంట్లు వైరల్ అవుతున్నాయి. గంభీర్, అగార్కర్ వైఖరి నచ్చకే అతడు ఈ విధంగా స్పందించాడని అభిమానులు అంటున్నారు.

కాగా 2024లో టీమిండియా టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్కు వీడ్కోలు పలికిన రోహిత్-కోహ్లి .. గతేడాది అనూహ్యంగా టెస్టులకూ గుడ్బై చెప్పారు. ఇప్పుడు ఇద్దరూ వన్డేలతో పాటు ఐపీఎల్లో కొనసాగుతున్నారు. ఆర్సీబీ తరఫున కోహ్లి ఐపీఎల్-2026 సీజన్లో ఇప్పటికి 12 మ్యాచ్లు ఆడి 484 పరుగులు సాధించాడు.

# రోహిత్ చెప్పిన మాటలే వింటా

**– తిలక్ వర్మ**




పంజాబ్ కింగ్స్ పై ముంబయి ఇండియన్స్ సంచలన విజయం సాధించడంలో తిలక్ వర్మ కీలక పాత్ర పోషించాడు. తన 75 పరుగుల అజేయమైన ఇన్నింగ్స్ తో ముంబయిని గెలిపించాడు. ఈ సందర్భంగా విభిన్నంగా సెలబ్రేషన్స్ చేసుకుంటూ కనిపించాడు. అయితే, ఇవన్నీ రోహిత్ శర్మ కోసమని ఆ తర్వాత తిలక్ తెలిపాడు. '45' అంకెలను చూపిస్తూ ఇది నీ కోసమని చెప్పడం విశేషం. డగౌట్ లోని రోహిత్ నవ్వుతూ కనిపించాడు.

అనంతరం డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్లాక.. సైడ్ ఆర్మ్ స్పెషలిస్ట్ ముర్తుజా హుస్సేన్ తో రోహిత్, తిలక్ వీడియో కాల్ లో మాట్లాడారు. ''మనతో ఆర్ఎస్ 45 ఉన్నారు. నేనెప్పుడూ రోహిత్ భాయ్ మాటే వింటా'' అని తిలక్ హార్ట్ సింబల్ చూపించాడు. అనంతరం తిలక్ ఇన్నింగ్సు రోహిత్ ప్రశంసించాడు. తన ఇన్నింగ్స్ ను చూడొద్దని.. తిలక్ ఆటను చూడాలని చెప్పడం గమనార్హం. ఈ వీడియోను ముంబయి ఇండియన్స్ సోషల్ మీడియాలో పంచుకుంది.

# 'పెద్ది'.. ఆ విషయంలో సందేహం అక్కర్లేదు: దిల్ రాజు

'పెద్ది' సినిమా జూన్ 4న ఆరోగ్యకర వాతావరణంలోనే విడుదలవుతుందని, ఆ విషయంలో ఎలాంటి సందేహం అక్కర్లేదని ప్రముఖ నిర్మాత దిల్ రాజు తెలిపారు. టాలీవుడ్ లో నెలకొన్న తాజా పరిస్థితులపై తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య ఫిల్మ్ ఛాంబర్ లో మీటింగ్ జరిగింది. సమస్యలపై చర్చించి, పరిష్కరించుకున్నాం. ఎగ్జిబిటర్లు కోరుతున్న పర్సంటేజీ విధానానికి నిర్మాతలు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు ఓ కమిటీ ఏర్పాటుకానుంది. ఏ, బీ, సీ.. ఇలా ఆయా సెంటర్లలోని థియేటర్ను బట్టి పర్సంటేజీని కమిటీ నిర్ణయిస్తుంది'' అని తెలిపారు.





మల్టీప్లెక్స్ ల్లో ఉన్నట్టే సింగిల్ స్క్రీన్లలోనూ పర్సంటేజీ విధానం ఉండాలని, దీనికి అంగీకరించిన నిర్మాతల చిత్రాలనే ప్రదర్శిస్తామని తెలంగాణ ఎగ్జిబిటర్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, పర్సంటేజీ విధానం వల్ల తమకు నష్టమంటున్నారు నిర్మాతలు. 'పెద్ది'ని లక్ష్యంగానే చేసుకొని ఇలా డిమాండ్ చేయడం సరికాదని బదులిచ్చారు. తాము 2008 నుంచి పర్సంటేజీ విధానాన్ని కోరుతున్నామని, ఏ సినిమా గానీ, ఏ నిర్మాత గానీ తమ టార్గెట్ కాదనేది ఎగ్జిబిటర్ల వాదన. ఈ వ్యవహారంపై.. ఫిల్మ్ ఛాంబర్ లో.. వాణిజ్యమండలి అధ్యక్షుడు, ప్రముఖ నిర్మాత సురేశ్ బాబు ఆధ్వర్యంలో థియేటర్ల యజమానులు, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు సమావేశమయ్యారు. 15 మందితో ఓ కమిటీ ఏర్పాటుకానుండగా.. రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఫిల్మ్ ఛాంబర్ ఆదేశించింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన చిత్రమే 'పెద్ది'.

# పెద్ది ప్రమోషన్స్‌కు దూరంగా జాన్వీ కపూర్



శ్రీదేవి కుమార్తెగా సినీ రంగ ప్రవేశం చేసిన జాన్వీ కపూర్, బాలీవుడ్ లో పలు చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో భారీ విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం ఆమె హిందీ కంటే తెలుగు ప్రాజెక్టులపైనే ఎక్కువ మొగ్గు చూపుతోంది. ముఖ్యంగా రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' చిత్రంలో ఆమె హీరోయిన్ గా నటిస్తోంది. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామాలో జాన్వీ గ్రామీణ యువతిగా కనిపించనుంది.

అయితే, ఈ భారీ పాన్-ఇండియా చిత్రం ప్రమోషన్లకు జాన్వీ దూరంగా ఉండబోతోందని వస్తున్న వార్తలు ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశమయ్యాయి. కేవలం భారీ రెమ్యూనరేషన్ కోసమే ఈ ప్రాజెక్టుకు సంతకం చేసిందని, సినిమాలో తన పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేకపోవడం వల్లే ఆమె ప్రమోషన్లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుందని ఒక ప్రముఖ దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. ఈ విషయంపై చిత్ర యూనిట్ నుండి ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ ప్రమోషన్ల విషయంలో జాన్వీ వెనక్కి తగ్గితే అది ఆమె కెరీర్ పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎందుకంటే 'పెద్ది' వంటి ప్రతిష్టాత్మక చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఆమెకు ఉంది.

ప్రస్తుతం జాన్వీ చేతిలో చెప్పుకోదగ్గ పెద్ద ఆఫర్లు లేని తరుణంలో, 'పెద్ది' విజయం ఆమెకు టాలీవుడ్ లో మరిన్ని అవకాశాలను తెచ్చిపెడుతుంది. జూన్ 4న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లలో పాల్గొనకపోవడం జాన్వీ చేసే పెద్ద పొరపాటే అవుతుంది. వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్న నేపథ్యంలో, జాన్వీ తన నిర్ణయాన్ని మార్చుకుని ప్రమోషన్లలో భాగస్వామి కావాలని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మెగా ఫోన్ పట్టిన రామ్..



ఇప్పటివరకూ నటుడిగా, గాయకుడిగా, గేయరచయితగా తన ప్రతిభను చాటుకున్న రామ్ పోతినేని.. ఇప్పుడు దర్శకుడిగా తొలి చిత్రాన్ని రూపొందించేందుకు సిద్ధమయ్యారు. తన 23వ సినిమాకు తానే దర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటించారు. తన పుట్టినరోజు సందర్భంగా స్వీయ దర్శకత్వంలో రానున్న సినిమా విశేషాలు పంచుకున్నారు.

ప్రస్తుతానికి 'RAPO23'గా ఈ సినిమా ప్రచారంలో ఉంది. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కించనున్నారు. 'రాపో సినిమాటిక్స్' బ్యానర్ పై కృష్ణ పోతినేని దీన్ని నిర్మించనున్నారు. ఇందులో రామ్ 'వీర' పాత్రలో కనిపించనున్నారు. లెదర్ జాకెట్ తో వెనకవైపు నిలబడి ఉన్న ఆయన లుక్ స్టైలిష్ గా ఆకట్టుకుంటోంది. పోస్టర్ ను పంచుకుంటూ 'ఒంటరి తోడేలు కథ ఇది' అనే ట్యాగ్ లైన్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ కథను కూడా రామ్ స్వయంగా సిద్ధం చేసినట్లు సమాచారం. జూన్ లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించి, డిసెంబర్ లో సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు.



**రామ్ గురించి మీకు ఈ విషయాలు తెలుసా..**

- రామ్ పోతినేని యూట్యూబ్ లో హిందీ డబ్బింగ్ సినిమాలతో నార్త్ ఇండియాలో భారీ క్రేజ్ సొంతం చేసుకున్నారు.
- హిందీ డబ్బింగ్ సినిమాల ద్వారా 2 బిలియన్లకు పైగా వ్యూస్ సాధించిన తొలి సౌత్ ఇండియన్ హీరోగా రికార్డు సృష్టించారు.
- 'కందిరీగ', 'నేను శైలజ', 'ఉన్నది ఒక్కటే జిందగీ', 'హలో గురు ప్రేమ కోసమే', 'డబుల్ ఇస్మార్ట్' సహా 9కి పైగా సినిమాలు 100 మిలియన్ ల క్లబ్ లో చేరాయి.
- యూట్యూబ్ లో 1 మిలియన్ సబ్ స్క్రైబర్స్ మార్క్ను అందుకున్న తొలి టాలీవుడ్ హీరోగా గుర్తింపు పొందారు.
- 'ఇస్మార్ట్ శంకర్' చిత్రం రూ.65 కోట్లకుపైగా గ్రాస్ వసూలు చేసి రామ్ కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది.
- 11 ఏళ్ల వయసులోనే 'ఆడయాళం' షార్ట్ ఫిలింలో నటించి యూరోపియన్ ఫిల్మ్ ఫెస్టివల్ లో ఉత్తమ నటుడు అవార్డు అందుకున్నారు.

# 'డ్రాగన్' ట్రీట్ కోసం ముంబైకి తారక్..?

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియన్ ఎన్టీఆర్ పుట్టినరోజు పురస్కరించుకుని మే 20న ప్రశాంత్ నీల్ మూవీకి సంబంధించిన ట్రీట్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. అయితే, ఒకరోజు ముందుగానే అంటే మే 19వ తేదీ అర్ధరాత్రి 'డ్రాగన్' చిత్రానికి సంబంధించిన మొదటి గ్లింప్స్ ను విడుదల చేసేందుకు చిత్ర బృందం సిద్ధమైంది.



ఈ టీజర్ లాంచ్ కోసం ఎన్టీఆర్ స్వయంగా ముంబై వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అక్కడ నేషనల్ మీడియా సమక్షంలో ఈ ఫస్ట్ లుక్ ను ప్రెజెంట్ చేయనున్నట్లు తెలుస్తోంది. 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి.


Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.